శనివారం 22-6-2019



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 91

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**'హెచ్1బీ' కోటాలో కోత లేదు**

భారత్‌కు స్పష్టం చేసిన అమెరికా విదేశాంగ శాఖ - 13లో



**లంక వీరంగం**

మలింగ, మాథ్యూస్ రాణింపుతో ఇంగ్లండ్‌పై లంక విజయం - స్పోర్ట్స్‌లో

## తెలంగాణ గంగమ్మకు జైబోలో..

# దిశ మార్చి వస్తోంది దశ మార్చబోతోంది



కన్నెపల్లి వద్ద ఉవ్వెత్తున ఎగసిపడుతున్న గోదావరి..



మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్, తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి తదితరులు

### కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఎగసిపడ్డ గోదావరి జలాలు

### ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభం

**మేడిగడ్డ బ్యారేజీ వద్ద రిబ్బన్ కత్తిరించి జాతికి అంకితం చేసిన సీఎం కేసీఆర్**

- హాజరైన గవర్నర్ నరసింహన్, ఏపీ, మహారాష్ట్ర సీఎంలు వైఎస్ జగన్, ఫడ్నవిస్
- తొలుత అక్కడి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఆ తర్వాత కన్నెపల్లి వద్ద పంప్‌హౌస్‌కు స్విచాన్ చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్
- మధ్యాహ్నం 1:15 గంటలకు పంప్‌హౌస్ నుంచి మొదలైన నీటి పంపింగ్
- ముందుగా జలాశయ ప్రతిష్టాంగ, జలసంకల్ప మహాయాగ హోమాల నిర్వహణ
- అన్నారం, సుందిళ్ల, మేడారం, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌లను ప్రారంభించిన మంత్రులు
- రాష్ట్రంలోని 45 లక్షల ఎకరాలు ఇక సస్యశ్యామలమే
- అతిథులు, బ్యాంకర్లను ఘనంగా సన్మానించిన ముఖ్యమంత్రి కేసీఆర్

2 లో









## రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశం

- ఎట్టకేలకు పలకరించిన రుతుపవనాలు
- రాష్ట్రంలో 70 శాతం భూభాగంలోకి నైరుతి
- నేటి నుంచి 2 వారాలు సాధారణం కంటే అధిక వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై.కె. రెడ్డి వెల్లడి
- రైతులు పంటల సాగు మొదలు పెట్టుకోవచ్చని స్పష్టీకరణ

- 5లో

### లోక్‌సభలో 'ట్రిపుల్ తలాక్' రగడ

- బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్
- తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు
- అందరికీ ఒకే శిక్ష ఉండాలి: కాంగ్రెస్
- రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే: ఒవైసీ - 13లో

### అగ్రవర్ణ పేదల రిజర్వేషన్‌కు ఓకే

- మెడికల్ సీట్లలో 10% ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ప్రభుత్వ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు అమలు
- దాదాపు 200 సీట్లు అదనంగా పెరిగే అవకాశం
- 'మెడికల్'కు హెల్త్ వర్సిటీ నోటిఫికేషన్ జారీ - 4లో












కన్నెపల్లి పంప్‌హౌస్‌ను స్విచ్ ఆన్ చేస్తున్న సీఎం కేసీఆర్.
నీటి పంపింగ్ అనంతరం ఉరకలెత్తుతున్న గోదావరి జలాలు



# దిశ మార్చి వస్తోంది..
# దశ మార్చబోతోంది

## ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభం

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ దశాబ్దాల కల సాకారమైంది. రాష్ట్రంలోని 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు శుక్రవారం లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. తొలుత ఉదయం 11:23 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఆవిష్కరించారు. అనంతరం విశిష్ట అతిథి గవర్నర్ నరసింహన్, మరో ముఖ్యఅతిథి, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తోపాటు వై.ఎస్. జగన్, సీఎం కేసీఆర్ కొబ్బరికాయలు కొట్టారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ గుమ్మడికాయను కొట్టి సరిగ్గా ఉదయం 11:26 గంటలకు రిబ్బన్ కట్ చేసి మేడిగడ్డ బ్యారేజీని ప్రారంభించారు. అలాగే మధ్యాహ్నం 1:07 గంటలకు కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముఖ్యమంత్రి స్విచాన్ చేశారు. మధ్యాహ్నం 1.15 గంటలకు పంప్‌హౌస్ నుంచి నీటి పంపింగ్ ప్రారంభం కావడంతో పవిత్ర గోదావరి జలాలను తెలంగాణ బీడు భూములకు మళ్లించే భగీరథ ప్రయత్నమైన బృహత్తర కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది.

### ఘనంగా జల సంకల్ప యాగం

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముందు మేడిగడ్డ బ్యారేజీ వద్ద, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద శృంగేరీ పీఠం అర్చకుల ఆధ్వర్యంలో జలాశయ ప్రతిష్టాంగ యాగం, జలసంకల్ప మహోత్సవ యాగం జరిగింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి మాత విగ్రహాన్ని ప్రతిష్టించి వేద పండితులు పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన యాగం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా వేద పండితులు ముగ్గురు సీఎంలను, గవర్నర్‌ను ఆశీర్వదించారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరిగిన యాగంలో కేసీఆర్ దంపతులు, కన్నెపల్లి పంప్‌హౌస్ దగ్గర జరిగిన యాగంలో మంత్రి ఎర్రబెల్లి దంపతులు పాల్గొన్నారు. ఇదే సమయంలో అన్నారం బ్యారేజీని మంత్రి నిరంజన్‌రెడ్డి, అన్నారం పంప్‌హౌస్‌ను మంత్రి మహమూద్ అలీ, సుందిళ్ల బ్యారేజీ, పంప్‌హౌస్‌లను మంత్రి కొప్పుల ఈశ్వర్, మేడారం పంప్‌హౌస్‌ను మంత్రి మల్లారెడ్డి, లక్ష్మీపూర్ పంప్‌హౌస్‌ను మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు.

### ముగ్గురు సీఎంలు కలిసిన సందర్భం..

నదీజలాల వాటాలు, పంపకాల విషయంలో రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో గోదావరి నది పరీవాహక ప్రాంతానికి చెందిన ముగ్గురు ముఖ్య మంత్రులు కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొనడం చరిత్రలో నిలిచిపోనుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహారాష్ట్రతో అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో తెలంగాణ ప్రాజెక్టులు ముందుకు పడలేదు. నిన్న మొన్నటి వరకు ఏపీ ప్రభుత్వంతోనూ నీటి వివాదాలు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక మహారాష్ట్ర ప్రభుత్వంతో, ఏపీలో కొలువుదీరిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంతో ముఖ్యమంత్రి కేసీఆర్ స్నేహపూర్వక దౌత్య సంబంధాలు నడిపారు.

**అతిథులు, బ్యాంకర్లకు సన్మానం:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యఅతిథులు గవర్నర్ నరసింహన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌లను ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా వారికి ఘన స్వాగతం పలికిన కేసీఆర్... అతిథులు వెళ్లేటప్పుడు హెలికాప్టర్ దాకా వెళ్లి మరీ ఒక్కొక్కరికీ ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించిన వివిధ బ్యాంకుల ప్రతినిధులను సీఎం సన్మానించి జ్ఞాపికలు అందించారు.

### లిఫ్ట్‌లో ఇరుక్కున్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

కన్నెపల్లిలో నిర్మించిన పంపుహౌస్ లిఫ్ట్‌లో విద్యాశాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ఇరుక్కుపోయారు. ప్రాజెక్టు ప్రారంభానికి హాజరైన ఆయన... కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటార్లను చూసేందుకు లిఫ్టులో కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గంటన్నర తర్వాత లిఫ్ట్ అద్దాలు పగలగొట్టి అధికారులు వారిని నిచ్చెన ద్వారా మరో ఫ్లోర్‌లోకి ఎక్కించారు.

### సువర్ణాక్షరాలతో లిఖించే రోజు: సీఎస్

కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించిన జూన్ 21వ తేదీని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. జోషి అభివర్ణించారు. అతిథులు, బ్యాంకర్లను సన్మానించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ జోషి కృతజ్ఞతలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆంధ్రప్రదేశ్ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఐజీ నాగిరెడ్డి, మహారాష్ట్ర డీజీపీ జైస్వాల్, ఎంపీలు జోగినపల్లి సంతోశ్ కుమార్, బి.వెంకటేష్ నేత, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గండ్ర వెంకట రమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నీటిపారుదలశాఖ ఈఎన్‌సీలు మురళీధర్‌రావు, హరే రామ్, వెంకటేశ్వర్లు, ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ. గోపాలరావు, ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### ముక్తీశ్వరుడ్ని దర్శించుకున్న ఫడ్నవిస్

**కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి వచ్చిన మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ మేడిగడ్డ బ్యారేజీ నుంచి నేరుగా ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరాలయానికి ఉదయం 11.45 గంటలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కమిషనర్ అనిల్ కుమార్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.**



### ఒకే కారులో ముగ్గురు సీఎంలు, గవర్నర్...

మేడిగడ్డ బ్యారేజీ ప్రారంభోత్సవం సందర్భంగా బ్యారేజీకి అనుబంధంగా గోదావరి నదిపై తెలంగాణ–మహారాష్ట్ర మధ్య నిర్మించిన బ్రిడ్జిని కూడా సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ముగ్గురు ముఖ్యమంత్రులు, గవర్నర్ ఒకే కారులో తెలంగాణ సరిహద్దు నుంచి బ్యారేజీ మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు ప్రయాణించారు. అనంతరం బ్యారేజీ లోపలికి నీరు నిల్వ ఉంచే చోటును పరిశీలించారు. మేడిగడ్డ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అతిథులతో కలిసి సీఎం కేసీఆర్ తిలకించారు. గోదావరి నీటి వినియోగానికి ప్రాజెక్టుల ఆవశ్యకతను గుర్తించిన విధానాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అతిథులకు వివరించారు. మేడిగడ్డ బ్యారేజీ ద్వారా తెలంగాణ ప్రాంతానికి ఏ విధంగా నీరు అందిస్తున్నది విడమరిచి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి మహారాష్ట్రతో చేసుకున్న చరిత్రాత్మక ఒప్పందమే కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్ని రకాలుగా సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభం సందర్భంగా కూడా ముఖ్యమంత్రి కేసీఆర్... ఏపీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ నరసింహన్‌లను పంప్‌హౌస్ అడుగు భాగంలో ఏర్పాటు చేసిన పంపుల వద్దకు తీసుకువెళ్లి చూపించారు. పంపుల సామర్థ్యం, ఉపయోగంపై విపులంగా చెప్పారు. మేఘా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధి కృష్ణారెడ్డి అతిథులకు నిర్మాణాల విశిష్టతను వివరించారు. అయితే షెడ్యూల్డ్ కార్యక్రమాలు ఉండటంతో ఫడ్నవిస్ కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభోత్సవంకన్నా ముందే వెళ్లిపోయారు.

### ప్రారంభోత్సవ మధుర ఘట్టాలు..

**ఉదయం 7:15 గంటలకు** హైదరాబాద్ నుంచి సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మేడిగడ్డకు బయలు దేరారు. అప్పటికే మేడిగడ్డ వద్ద శృంగేరీ పీఠానికి చెందిన ఫణి శశాంక్ శర్మ, గోపీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో 40 మంది వేద పండితులతో వరుణ దేవుడిని ఆహ్వానిస్తూ మహాక్రతువు నిర్వహించారు.

**8:30:** సీఎం కేసీఆర్ మేడిగడ్డ వద్ద 10 నిమిషాలపాటు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టును పరిశీలించారు.

**9:10:** హోమంలో కూర్చున్న కేసీఆర్ దంపతులు

**9:30:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్ కుమార్ యాదవ్‌లు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్నారు. వారికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మంత్రి ప్రశాంత్‌రెడ్డి స్వాగతం పలికారు.

**9:50:** యాగశాలలో కూర్చున్న ఏపీ సీఎం వై.ఎస్. జగన్, మంత్రులు

**10:45:** మహారాష్ట్ర సీఎం పడ్నవిస్, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌లు మేడిగడ్డ వద్ద నిర్వహిస్తున్న హోమం వద్దకు చేరిక.. వారికి సంప్రదాయ రీతిలో స్వాగతం.

**11:00:** జలసంకల్ప హోమం పూర్తి

**11:15:** ప్రాజెక్టుపై ఫొటో ప్రదర్శ నను తిలకించిన సీఎంలు, గవర్నర్, అతిథులు.

**11:20:** ప్రాజెక్టు డాక్యుమెంటరీ వీక్షణ

**11:23:** వైఎస్.జగన్ మేడిగడ్డ వద్ద పైలాన్ బటన్‌నొక్కి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**11:26:** గేట్ల వద్ద రిబ్బన్ కత్తిరించిన సీఎం కేసీఆర్, అంతకు ముందు గుమ్మడికాయతో దిష్టి తీశారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో గవర్నర్, కేసీఆర్, జగన్ మహారాష్ట్ర సరిహద్దుకు వెళ్లారు.

**మధ్యాహ్నం 12:50:** కన్నెపల్లికి చేరుకున్నారు. 12:50 నుంచి 12:53 వరకు 'మేఘా' ప్రతినిధులు పంపుల పనితీరును గవర్నర్, సీఎంలకు వివరించారు. గుమ్మడి కాయలతో దిష్టి తీసిన సీఎం కేసీఆర్ అనంతరం కన్నెపల్లి పంప్‌హౌస్‌కు రిబ్బన్ కట్ చేశారు.

**12:55:** శిలాఫలకం ఆవిష్కరణ. అక్కడి దిగువన ఉన్న మోటార్ల పరిశీలన.

**1:07:** ఆరో నంబర్ మోటార్‌ను స్విచ్ ఆన్ చేసి ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రారంభించారు.

**1:30:** మధ్యాహ్న భోజన విరామం, ఆ తర్వాత అతిథులు, ఇంజనీర్లు, బ్యాంకర్లతో ముఖ్యమంత్రులు, గవర్నర్ మాట్లాడారు. అనంతరం అతిథులను సన్మానించారు.

**2:00** గంటల తర్వాత నుంచి ఒకరి తర్వాత ఒకరు తిరుగు ప్రయాణమయ్యారు. ముందుగా గవర్నర్ నరసింహన్, తర్వాత ఏపీ సీఎం జగన్‌కు సీఎం కేసీఆర్ వీడ్కోలు పలికారు.

**2:25** గంటలకు బ్యాంకర్లు, కొందరు అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసిన సీఎం కేసీఆర్.. ఆ తర్వాత హైదరాబాద్ బయలుదేరారు.

బ్యారేజీ వద్ద గవర్నర్ నరసింహన్, సీఎంలు ఫడ్నవిస్, జగన్‌లతో ముఖ్యమంత్రి కేసీఆర్





శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని బటన్ నొక్కి ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్, ఇరు రాష్ట్రాల మంత్రులు



యాగశాలలో కేసీఆర్ దంపతుల పూజలు. చిత్రంలో గవర్నర్ నరసింహన్, సీఎంలు ఫడ్నవిస్, జగన్, మంత్రులు ఇంద్రకరణ్, ఈటల తదితరులు



మేడిగడ్డ బ్యారేజీ గురించి మ్యాప్ ద్వారా సీఎంలు ఫడ్నవిస్, జగన్‌లకు వివరిస్తున్న కేసీఆర్

## అన్నీతానైన 'మేఘా' కృష్ణారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** కన్నెపల్లిలోని మేడిగడ్డ ఎత్తిపోతల కేంద్రంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి అన్నీ తామై వ్యవహరించారు. గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌లకు కన్నెపల్లి పంప్‌హౌస్ ఫోర్ బే, నీటి నిల్వ, నీటిని పంప్ చేసే విధానం, దాని నిర్మాణం తదితర విశిష్టతల గురించి వివరించారు. మోటార్ల పనితీరుపై వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం పంప్ హౌస్‌లో మోటార్స్ ఏర్పాటు చేసిన దిగువ ప్రాంతానికి గవర్నర్, ఇద్దరు సీఎంలను తీసుకెళ్లి మోటార్ల పనితీరు, వాటి సామర్థ్యం తదితర అంశాలను వివరించారు. ఆపై పంప్‌హౌస్ ఎగువ భాగానికి వచ్చి.. మోటర్లను కంప్యూటర్ ద్వారా సీఎం ఆన్ చేశారు. అక్కడి నుంచి డిశ్చార్జ్ పాయింట్ వద్దకు వెళ్లి నీరు ఉబికివస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంప్‌హౌస్‌ను వేగంగా నిర్మించడంపై మేఘా ఇంజనీర్లను సీఎం అభినందించారు.



## వరదొస్తే పంపులన్నీ ప్రారంభం

- ప్రస్తుతం ప్రాణహితలో 1,420 క్యూసెక్కుల ప్రవాహం
- ఇంకా పుంజుకోని ప్రవాహాలు.. అందుకే ఒక్క మోటార్‌తోనే ఎత్తిపోతలు ప్రారంభం
- జూలై రెండో వారానికి పుంజుకోనున్న వరద

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం ప్రస్తుతానికి ఒక్క మోటార్‌తో మొదలవగా మిగతా పంపుల ప్రారంభం ప్రాణహిత, గోదావరిలో పూర్తిస్థాయి వరదలు పుంజుకున్నాకే జరగనుంది. జూలై నుంచి ప్రవాహాలు పుంజుకొనే తీరుకు అనుగుణంగా ఒక్కో మోటార్‌ను ఆన్‌చేస్తూ నీటిని తీసుకునేలా ఇప్పటికే అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఏటా జూన్ నుంచి ప్రాణహితలో ప్రవాహాలు మొదలవుతాయి. అయితే ఈ ఏడాది రుతుపవనాలు ఆలస్యం కావడంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రాంతంలో పెద్దగా వర్షాలు కురవలేదు. దీంతో ఈ ఏడాది 1,471 క్యూసెక్కులకు మించి ప్రాణహితలో ప్రవాహాలు లేవు. ఈ నెల 17 నుంచి 20 వరకు ప్రాణహితలో 1,385 క్యూసెక్కుల మేర ప్రవాహాలు కొనసాగగా 21న 1,420 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగినట్లు టెక్రా గేజ్ స్టేషన్ రికార్డులు చెబుతున్నాయి. గతేడాది ఇదే సమయానికి గరిష్టంగా 50 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. కానీ ఈ ఏడాది 2 వేల క్యూసెక్కులు కూడా దాటలేదు. ఈ నేపథ్యంలోనే గోదావరి నీటి ఎత్తిపోతల ప్రారంభోత్సవ కార్యక్రమం కోసం గోదావరి నదిపై క్రాస్ బండ్ నిర్మించి ప్రవాహానికి అడ్డుకట్ట వేశారు. ఈ నిల్వతో వచ్చిన నీటితోనే ఒక్క మోటార్‌ను ఆన్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ప్రస్తుతం గోదావరిలో 94 మీటర్ల నీటి ప్రవాహం కొనసాగుతుండగా 100 మీటర్ల లెవల్ నీటి ప్రవాహం ఉంటేనే రోజుకు 2 టీఎంసీల నీటిని ఎత్తిపోయడం సాధ్యం కానుంది. అయితే ప్రస్తుతం రుతుపవనాలు పుంజుకోవడంతో వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావంతో జూలై నుంచి ప్రవాహం పుంజుకునే అవకాశం ఉంది. జూలై రెండో వారానికి 50 వేల మేర ప్రవాహాలు వచ్చినా ఒక్కో మోటార్‌ను ప్రారంభిస్తూ నీటిని ఎత్తిపోసే అవకాశాలున్నాయి.

### ఇదం జగత్



...అయితే ఇంకా చాలామందే ఉన్నారంటారా!?

# పోలీసులకు కొత్త పాఠాలు

- సిలబస్‌లో స్వల్ప మార్పులు
- యాప్స్, ఐటీలో ప్రత్యేక శిక్షణ
- సైబర్ నేరాల ఛేదనకు ఉపయుక్తం
- సెప్టెంబర్‌లో తరగతులు ప్రారంభం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పోలీసులకు బోధించే సిలబస్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకోనున్నాయి. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై కొత్తగా డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చేవారికి అవగాహన కల్పించేందుకు ఇప్పుడున్న సిలబస్‌కు కొన్ని పాఠ్యాంశాలు చేర్చనున్నారు. కొన్నేళ్లుగా టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్న పోలీసు శాఖ ఇపుడు పలు రకాల యాప్స్, సోషల్ మీడియా విభిన్న వేదికల ద్వారా ప్రజలతో మమేకమవుతోంది. ఈ సాంకేతికత ఆధారంగా పలు చిక్కుముడులున్న కేసులెన్నో పోలీసులు ఛేదిస్తున్నారు. అందుకే, కొత్త బ్యాచ్ పోలీసుల్లోనూ సాంకేతికతపై మంచి పట్టు వచ్చేలా సిలబస్‌లో స్వల్ప మార్పులు చేశారు. టెక్నాలజీపై పట్టుచిక్కితే నేరాల చిక్కుముడులు విప్పడం సులభతరంగా మారుతుందన్న ఉన్నతాధికారుల ఆలోచన మేరకు ఈ మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

**పాత జిల్లాల ప్రకారమే నియామకాలు..**

ఇప్పటికే పోలీసు నియామక ప్రక్రియ ఊపందుకుంది. ఇందులో భాగంగా వివిధ తుది రాతపరీక్షల్లో అర్హత సాధించిన 1.2 లక్షల మందికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 కేంద్రాల్లో ఇప్పటికే సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతోంది. నోటిఫికేషన్ ప్రకారం.. నియామకాలు పాత జిల్లాల ప్రకారమే జరుగుతాయని చెప్పినా.. ఇప్పటికీ అభ్యర్థుల్లో కొంత గందరగోళం ఉంది. కానీ ఈ విషయంలోనూ అధికారులు మరోసారి స్పష్టతనిచ్చారు. ఈ సారి నియామకాలు పాత జిల్లాల ప్రకారమే జరగనున్నాయి. వచ్చే దఫా నియామకాల్లోగా కొత్త జిల్లాలకు రాష్ట్రపతి ఆమోదం లభిస్తే.. దానికి అనుగుణంగా నియామకాలు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## ఏయే అంశాలుంటాయి?

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై పోలీసులకు అవగాహన అవసరం. ఇప్పటికే పోలీసు శాఖలో హాక్‌ఐ, దర్పణ్, టీఎస్–కాప్ తదితర యాప్‌ల వినియోగం పెరిగింది. చలానాలు మొదలు కేసు దర్యాప్తు, నిందితుల గుర్తింపు వరకు అంతా యాప్‌ల ద్వారానే జరుగుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా శిక్షణ తీసుకోనున్న దాదాపు 16,925 మంది కానిస్టేబుళ్లు, 1,250 మంది ఎస్సై ర్యాంకు అధికారులకు ఈ కొత్త సిలబస్ బోధించనున్నారు. థియరీతో పాటు, ప్రాక్టికల్స్‌కు కూడా అధిక ప్రాధాన్యం కల్పించనున్నారు. గతంలో ఉన్న సిలబస్‌కు అదనంగా ఐటీ తరగతులు, ప్రాక్టికల్స్ చేరుతాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఇప్పటికే వీరికి కావాల్సిన సిలబస్ రూపకల్పన, టైం టేబుల్ పూర్తి చేశారు. ఆగస్టు చివరి నాటికి లేదా సెప్టెంబర్ మొదటివారంలో ట్రైనీ పోలీసులకు తరగతులు ప్రారంభం కానున్నాయని సమాచారం.


భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)

మ్యాక్® లూబ్రికంట్స్ డిస్ట్రిబ్యూటర్‌షిప్ నియామకం కోసం ప్రకటన

భారత్ పెట్రోలియం ఫార్చ్యూన్ 500 ర్యాంకింగ్ గల ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీ. దేశంలోని ప్రముఖ లూబ్ బ్రాండ్స్‌లో ఒకటైన **మ్యాక్® లూబ్రికంట్స్**‌ని మేము తయారుచేస్తున్నాము. **మ్యాక్® లూబ్రికంట్స్**‌ని ప్రముఖ వాహన తయారీదారులు ఆమోదించారు మరియు యథార్థ ఆయిల్స్ కోసం ప్రధాన ఒఇఎంలతో (ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు) ఒప్పందాలు కుదుర్చుకుంది. మా లూబ్రికంట్స్ శ్రేణిలో ఆటోమోటివ్ మరియు ఇండస్ట్రియల్ లూబ్రికంట్స్, గ్రీజులు, గేర్ ఆయిల్స్, బ్రేక్ ఫ్లూయిడ్స్ మరియు కూలంట్‌లు ఉన్నాయి. **ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో**ని మార్కెట్‌లను కవర్ చేసేందుకు, మేము **ప్రైమరీ లూబ్ డిస్ట్రిబ్యూటర్స్‌ని (పిఎల్‌డి)** మరియు **రూరల్ లూబ్ డిస్ట్రిబ్యూటర్స్‌ని (ఆర్ఎల్‌డి)** మరియు **ఇండస్ట్రియల్ లూబ్ డిస్ట్రిబ్యూటర్స్‌ని (ఐఎల్‌డి)** నియమించాలనుకుంటున్నాము.

టెరిటొరి మేనేజర్ సంప్రదింపు వివరాలు:

| | |
|---|---|
| టెరిటొరి మేనేజర్ లూబ్స్, సికింద్రాబాద్ | : 9790950901 |
| టెరిటొరి మేనేజర్ లూబ్స్, వైజాగ్ | : 9003257789 |
| టెరిటొరి మేనేజర్ లూబ్స్, నెల్లూరు | : 9949822248 / 9487365477 |

మరిన్ని వివరాలతో కూడిన ప్రకటన మా వెబ్‌సైట్ www.bharatpetroleum.in → Tenders → View Tender – New Tenders → Select: Date From (22.06.2019) Due Date (16.07.2019) → Select Department: Lubricant Distributorship → Choose a Tender Type: Press → Open File "Southern Region Network Expansion 19-20"లో లభిస్తుంది.

ఫారాలను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, వీటిని నింపి వర్తించే ఫీజుతో పాటు సంబంధిత టెరిటొరి కార్యాలయాలకు వెబ్‌సైట్‌లోని వివరాల ప్రకారం సమర్పించాలి. సవరణ, ఏదైనా ఉంటే, పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడుతుంది.

దరఖాస్తు సమర్పించడానికి ఆఖరు తేదీ:
**16.07.2019, 1700 గంటలు**

MAK LUBRICANTS
MAK makes it possible.

#GiveItUp

Energising Lives, Energising Naya Bharat



wybor
The Lifestyle Specialist







టీ షర్ట్ పై గరిష్ఠంగా రూ. 200 వరకు నిర్వహణ రుసుం | ధర ఆఫర్ 32WHN-09 (Warrior) కోసం
ప్రత్యేకతలు మరియు ఆకర్షణలు ముందుగా తెలియచేయకుండా మారవచ్చు

EASY EMI OPTIONS AVAILABLE FROM BAJAJ FINSERV | wybor care 87500 35000

TRADE INQUIRIES ARE SOLICITED FROM UNREPRESENTED AREAS.
PLEASE CONTACT: T. ESHWAR GOUD (ASSISTANT BRANCH MANAGER) - 9573672658 & 8297006666 & K. RAVI SHANKAR (SALES EXECUTIVE) - 9502713211

**DIRECT DEALER: MIRYALGUDA:** SRI SAI BALAJI ELECTRONICS, 9246906392; **HUZURNAGAR:** SAI BABA ENTERPRISES, 9160473143; **KODAD:** SRI MADHU ELECTRONICS, 9246170199.



Mahindra Rise.

mahindrasupromaxitruck.com

సుప్రో ప్రాఫిట్ ట్రక్ యొక్క
3 ఏళ్లలో ₹3 లక్షల రీసేల్‌కి వాగ్దానం*

మైలేజ్ 23.17km/l+
3 సంవత్సరాల వారంటీ
3 సంవత్సరాల ఫ్రీ మెయింటెనెన్స్#
100% ఫైనాన్స్^




కట్టలుతో పాటు

SUPRO HD SERIES
ప్రాఫిట్ ట్రక్

అధిక సమాచారానికి, మిస్డ్ కాల్ చెయ్యండి 9699699400కి

with you hamesha 1800-209-6006 | UDAY | 10 లక్షల రూపాయల ప్రమాదబీమా మరియు ఇతర ఆకర్షణీయమైన సదుపాయాలు కేవలం ఉదయ్ సభ్యులకి. | SCV OF THE YEAR 2019

1177962TEL

**SANSAI AUTO SERVICES PVT. LTD:** NALGONDA, MIRYALAGUDA, SURYAPET PH: 9160801111.






ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు HCL లో IT Engineer ఉద్యోగం
ఉద్యోగం చేస్తూనే degree పూర్తి చేసే అవకాశం

**ఉద్యోగ వివరాలు**
- Application and Infrastructure support, Testing and CAD support - రంగాలలో ప్రవేశ స్థాయి ఉద్యోగాలు
- విజయవంతంగా శిక్షణ పూర్తి అయిన తరువాత ఏడాదికి 2.0 లక్షల నుండి 2.2 లక్షల వేతనం.

**ఉద్యోగముతో పాటు ఉన్నత విద్య**
*HCL నుండి నిధుల సహాయముతో SASTRA UNIVERSITY నుండి BCA (3 Years) లేదా BITS PILANI నుండి B.Sc. (4 Years) పూర్తిచెయుట తప్పనిసరి.

**విద్యార్హతలు**
- ఇంటర్మీడియట్ 60% మరియు ఆ పై మార్కుల ఉత్తీర్ణత.
- గణితం /వ్యాపార గణితం తప్పనిసరి.
- 2018, 2019 ఏడాదిలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు మాత్రమే.

**IT ఉద్యోగ శిక్షణ**
- 12 నెలల శిక్షణ,ప్రతి నెల 10,000 వేతనం.
- ఫీజు: 2 లక్షలు +Taxes. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు మరియు శిక్షణ తదుపరి HCL లో విధులు చేపట్టిన మొదటి సంవత్సరము నుండి EMI ప్రారంభమవును

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి.

WALKIN FOR SELECTION / INTERVIEW PROCESS ON 21ST, 22ND & 23RD JUNE 2019

**ADILABAD** – **Venue:** Skill Training Center, Bright Light Society, H.No.6-8-57/4, Bhuktpur, Radheshyam Complex, NH No.7 Road, Adilabad

**SIDDIPET** – **Venue:** Brightlight Society, H.No: 17 186/1,near panchamukha hanuman temple, Shivaji nagar, Siddipet

**WARANGAL** – **Venue:** Sri Balaji Junior College, H.No.2-9-780/1, 2-9-780/2, TNGOs Colony, 100ft Road, Waddepally, Hanmakonda, Warangal

**SECUNDERABAD** – **Venue:** Skill Training Center,Bright Light Society, Near BBR Hospital,Besides Bharat Lodge –Chaina Bazar, Navajeevan Nagar, Balnagar, Secunderabad

**NIZAMABAD** – **Venue:** Indian Red Cross Society,Nizamabad District Branch, Behind Thasildar office, Khaleelwadi, Nizamabad

**MAHABOOBNAGAR** – **Venue:** Red Cross Blood Bank, Indian Red Society, Mahaboobnagar District Branch,Telangana Chowrasta Mahaboobnagar.

**MANCHIRYALA** – **Venue:** Vivekavardhini Degree & PG College Behind Bus Stand Manchiryala

**NALGODNA** – **Venue:** Indian Red Cross Society,Nalgonda District Branch, H.No.5-6-300, Red Cross Bhavan, Near Bustand, Nalgodna

**KHAMMAM** – **Venue:** Khammam IT Solution, Revenue Bhavan, Beside Traffic Police Station Near Bustand, Khammam

To Register for the selection process, give a missed call to **8448 386 391**
Website: **www.hcltechbees.com** | Email **techbee.telangana@hcl.com**

HCL

$ 8.6 BILLION | 137,000+ MINDS | 44 COUNTRIES

HCL does not have any partners/ vendors for training & recruitment for jobs in HCL. Candidates are advised to contact HCL office.

## రైతులకు కాదు కాంట్రాక్టర్లకు స్వర్గధామం

### కాళేశ్వరంపై మాజీ మంత్రి షబ్బీర్ అలీ



**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్లకు స్వర్గధామమని రైతులకు కాదని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అభిప్రాయపడ్డారు. రూ. 35వేల కోట్లతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు అంచనాలు రూ.82వేల కోట్లకు పెంచారని, ఇప్పుడది రూ.1.20 లక్షల కోట్లకు చేరిందని, రాష్ట్ర ఖజానాపై ఇంత పెద్ద ఎత్తున భారం మోపి కాంట్రాక్టర్లకు నిధులు కట్టబెడుతున్నారని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన విమర్శించారు. సచివాలయం, అసెంబ్లీ భవనాలను మళ్లీ కడతామని చెబుతూ కేసీఆర్ ప్రభుత్వం అనవసర వ్యయం చేస్తోందని ఆరోపించారు. కాగా, ప్రాంతీయ పార్టీలను మోదీ అణచివేస్తున్న వాస్తవాన్ని గ్రహించాలని, భవిష్యత్ రాజకీయాల్లో కాషాయ డ్రాగన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 20% కూడా పూర్తి కాని కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచార ఆర్భాటం కోసమే కేసీఆర్ ప్రారంభించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ విమర్శించారు.

## కాళేశ్వరం కర్త, కర్మ, క్రియ కేసీఆరే: తలసాని



**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో తెలంగాణ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలోని కార్యకర్తలు పటాకులు పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఇప్పుడు నీళ్ల కల సాకారమైంది. ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అన్నీ సీఎం కేసీఆరే. అర్ధరాత్రి వరకు ఇంజనీర్లతో కలిసి కూర్చొని చర్చలు జరిపారు. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో కలిసిమెలిసి ఉండాలని భావించి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర, ఏపీ సీఎంలను ఆహ్వానించారు. వచ్చే యాభై ఏళ్ల వరకు హైదరాబాద్, తెలంగాణ ప్రజలకు ఇక నీటి కష్టాలు ఉండవు' అని తలసాని పేర్కొన్నారు.

## కాళేశ్వరంతో మరిన్ని మిల్లులు, ఉపాధి

### సంబురాలు చేసుకున్న పౌరసరఫరాల ఉద్యోగులు

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికి మార్గదర్శకం అవుతుందని, రైస్ మిల్లర్లు, ఐకేపీ మహిళలు, హమాలీలకు ప్రయోజనం కలగనుందని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ అన్నారు. కాళేశ్వరం ప్రారంభ వేడుకను పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పౌరసరఫరాల ఉద్యోగులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు, హమాలీలు, రేషన్ డీలర్లు, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాల గోదాములు, రేషన్ షాపుల వద్ద తోరణాలు కట్టి, బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి రైతులు ఆనందం వ్యక్తంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో మరిన్ని మిల్లుల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని, దీని ద్వారా ఎంతోమంది ప్రజలకు ఉపాధి లభిస్తుందని రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గంప నాగేందర్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కోశాధికారి చంద్రపాల్ అన్నారు.

## ప్రాజెక్టులు కట్టలేదనడం అవాస్తవం



జగ్గారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** గత 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ప్రాజెక్టులు నిర్మించలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులు కట్టలేదనడం అవాస్తవమని, తమ పార్టీ కట్టిన ప్రాజెక్టులతోనే తెలంగాణ ప్రజలకు సాగు, తాగు నీరు అందుతున్నాయని శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ప్రాజెక్టులు ఎవరు కట్టినా సమర్థించాలనే ఆలోచనతో తాము కేసీఆర్‌కు మద్దతిచ్చామని, కానీ హరీశ్‌రావు మాత్రం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీశ్ తాగుతున్న సింగూరు, మంజీరా ప్రాజెక్టులు కట్టింది కాంగ్రెస్ కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ మెప్పుకోసం కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తే తాము చూస్తూ ఊరుకోమని జగ్గారెడ్డి హెచ్చరించారు.

## బీసీ బిల్లు పెట్టిన వైఎస్సార్ సీపీకి కృతజ్ఞతలు

- బీసీ సంక్షేమ సంఘం నేత కృష్ణయ్య



**హైదరాబాద్:** రాజ్యసభలో వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర పార్టీ సభ్యులు ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు పార్లమెంటులో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. తమకు మద్దతుగా బిల్లును ప్రవేశపెట్టిన వైఎస్సార్‌సీపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం బీసీ భవన్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడుతూ.. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని 37 రాజకీయ పార్టీలను ఆయన కోరారు. బీసీ పార్టీలుగా చెప్పుకునే డీఎంకే, అన్నా డీఎంకే, పీఎంకే, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే బీజేపీ, టీఆర్‌ఎస్, కాంగ్రెస్, టీడీపీలు కూడా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు ఆయన లేఖరాశారు.

## ప్రజా కళల కోసం రాష్ట్ర ఉత్సవాలు

**సాక్షి, హైదరాబాద్:** ప్రజాకళలు అంతరించిపోతున్న దశలో కళాకారులను సమీకరించి వారి కళారూపాల ద్వారా ప్రజాకళలకు మళ్లీ ప్రాణం పోసేందుకు ఆగస్టు 5, 6 తేదీల్లో రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రజానాట్యమండలి ప్రకటించింది. శుక్రవారం మఖ్దూం భవన్‌లో రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలు, ప్రజానాట్యమండలి ద్వితీయ రాష్ట్ర మహా సభల గోడపత్రికను మండలి అధ్యక్షుడు పల్లె నరసింహ, ప్రధాన కార్యదర్శి కన్నం లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా పాటపాడుదాం రండి కార్యక్రమం ద్వారా యువతలో నిక్షిప్తమైన కళలను వెలికితీసేందుకు వందలాదిమందిని ఎంపిక చేసి వారికి తర్ఫీదునిచ్చినట్లు తెలిపారు.

## 'సెక్రటేరియట్, అసెంబ్లీ కూల్చడం తుగ్లక్ చర్య'

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ భవనాలను కూల్చడం తుగ్లక్ చర్య అని టీపీసీసీ అధికార ప్రతినిధి జి. హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. కొత్త సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాల కోసం కేటాయించాలని అనుకుంటున్న రూ. 600 కోట్లను వైద్యరంగానికిచ్చి, ప్రతి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## గర్వంగా ఉంది: ప్రభాకర్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వాములైనందుకు గర్వంగా ఉందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నాణ్యమైన విద్యుచ్ఛక్తిని అందించేందుకు విద్యుత్ సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన నిర్మించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ చేసిన కృషిని కొనియాడారు.

## టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి

### ఉత్తర్వులు జారీ • నేడు ప్రమాణ స్వీకారం



**సాక్షి, అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానాల పాలక మండలి అధ్యక్షునిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం ఉదయం ఆయన చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆంధ్రప్రదేశ్ హిందూ దేవాదాయ, ధర్మాదాయ చట్టం, 1987ను అనుసరించి ఈ నియామకం చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్‌మోహన్‌సింగ్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బోర్డులో ఇతర సభ్యుల నియామకాన్ని త్వరలోనే చేపడతామని తెలిపారు. ప్రకాశం జిల్లా మేదరమెట్ల గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి స్వయానా తోడల్లుడు. వైఎస్ మరణం తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో స్థాపించిన వైఎస్సార్ సీపీలో వైవీ దశాబ్ద కాలంగా క్రియాశీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2014లో ఆయన ఒంగోలు ఎంపీగా గెలుపొందారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని లోక్‌సభలో జరిగిన పోరాటంలో ఆయన అగ్రభాగాన నిలిచారు. హోదా కోసం సహచర ఎంపీలతోపాటు తన పదవిని త్యాగం చేశారు. 2019 ఎన్నికల్లో తాను పోటీ చేయక పోయినా పార్టీ గెలుపు కోసం గట్టి కృషి చేశారు. ప్రస్తుతం ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

# కాంగ్రెస్‌లో పదవుల 'లొల్లి'

- టీపీసీసీ చీఫ్ రేసులో ఐదారుగురు నేతలు
- వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలంటున్న జగ్గారెడ్డి
- అధ్యక్ష పదవికి అర్హుడినే అంటున్న సంపత్
- గ్రేటర్ అధ్యక్ష పదవి కోసం విక్రమ్‌గౌడ్ పోటీ
- ఇప్పట్లో పార్టీ పునర్వ్యవస్థీకరణ ఉండదని అధిష్టానం సంకేతాలు

**సాక్షి, హైదరాబాద్:** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం పోటీ ఎక్కువవుతోంది. టీపీసీసీ చీఫ్‌తోపాటు పలు పదవుల కోసం కొందరు తెరవెనుక ప్రయత్నాలు చేసుకుంటుండగా, మరికొందరు బహిరంగంగా తమ ఆకాంక్షలను వెలిబుచ్చుతున్నారు. టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియామకం జరిగి నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆయన్ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తారన్న వార్తల నేపథ్యంలో నలుగురైదుగురు కీలక నేతలు ఆ పదవిని ఆశిస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌తోపాటు ఇతర పదవుల కోసం కూడా డిమాండ్ పెరుగుతోంది.

### రేవంత్‌కు చాన్సుందా...!

టీపీసీసీ అధ్యక్ష పదవి కోసం నలుగురైదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో ఫైర్‌బ్రాండ్ రేవంత్‌రెడ్డి, మాజీమంత్రి శ్రీధర్‌బాబు ముందు వరుసలో ఉండగా, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీమంత్రి జీవన్‌రెడ్డి కూడా ఈ పదవి కోసం పోటీ పడుతున్నారని తెలుస్తోంది. ఉత్తమ్‌ను మారిస్తే అవకాశం ఇవ్వాలని వీరు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. అయితే, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి ఈ పదవి ఇవ్వడం ఖాయమనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో రేవంత్ లాంటి నేతను నియమిస్తేనే కేడర్‌కు భరోసా వస్తుందనే ఆలోచనలో అధిష్టానం ఉందనే సంకేతాలు వస్తున్నా ఇప్పుడే ఇస్తారా లేదా 2023 ఎన్నికలకు ముందు బాధ్యతలు అప్పగిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ఇప్పట్లో పార్టీ పునర్వ్యవస్థీకరణ ఉండదని అధిష్టానం సంకేతాలు ఇస్తున్నట్లు కొందరంటున్నారు. ప్రస్తుతానికి టీపీసీసీ చీఫ్‌ను మార్చాల్సిన అవసరం లేదని, ఒకవేళ మార్చినా ఎవరో ఒకరికి బాధ్యతలు అప్పగించి ఎన్నికలకు ముందు రేవంత్‌ను రంగంలోకి దించుతారని, ఇదే ఆలోచనతో ఢిల్లీ పెద్దలున్నారని కొందరు చెబుతున్నారు. ఇప్పుడే రేవంత్‌ను రంగంలోకి దించి రానున్న నాలుగేళ్లలో పార్టీని బలోపేతం చేసే అవకాశం ఇస్తారని కొందరంటున్నారు. మొత్తం మీద టీపీసీసీ చీఫ్ పదవి వ్యవహారమంతా ప్రస్తుతం రేవంత్ చుట్టూనే తిరుగుతోంది. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ కూడా తనకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇస్తే నిర్వహిస్తానని ఇటీవల వ్యాఖ్యానించగా, టీపీసీసీ అధ్యక్ష పదవి పొందేందుకు తాను కూడా అర్హుడినేనని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అంటున్నారు.

### మారిస్తే ఏఐసీసీలో కీలక పదవి

ఒకవేళ టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ స్థానంలో వేరే నేతను నియమిస్తే ఉత్తమ్‌కు ఏఐసీసీలో కీలక పదవి లభిస్తుందని తెలుస్తోంది. నల్లగొండ లోక్‌సభ సభ్యుడిగా కూడా ఎన్నికైనందున ఆయన సేవలను ఢిల్లీ స్థాయిలోనే ఉపయోగించుకోవాలని అధిష్టానం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ అధినేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఉత్తమ్‌ను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో నియమించి కొన్ని రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసే ఇన్‌చార్జి బాధ్యతలను కూడా అప్పగిస్తారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో వినిపిస్తోంది.



### మాకూ పదవులివ్వండి

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి తనకు కావాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా అడుగుతున్నారు. ఆ హోదా ఇస్తే రాష్ట్రమంతా తిరిగి పార్టీ కేడర్‌ను ఉత్తేజితం చేస్తానని, పార్టీని బలోపేతం చేస్తానని ఆయన చెబుతున్నారు. గ్రేటర్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి తనకు ఇస్తే రానున్న గ్రేటర్ ఎన్నికల్లో సరికొత్త వ్యూహంతో వెళ్లి హైదరాబాద్ నగరంలో పార్టీ ఉనికిని కాపాడతానని మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ కుమారుడు, టీపీసీసీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మేయర్ అభ్యర్థిగా గత ఎన్నికల్లో పోటీ చేసిన తనకు ఈ పదవి అడిగే అర్హత ఉందని ఆయన అంటున్నారు.

### పదవి ఇవ్వకపోవడంతోనే...!

తనకు గానీ, తన సోదరుడు, నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డికి గానీ టీపీసీసీ బాధ్యతలు అప్పగించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2018 ఎన్నికల ముందు నుంచే అడుగుతున్నారు. తమ చేతిలో పార్టీని పెడితే రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి శ్రేణులను ఉత్తేజితం చేస్తామని, అవసరమైతే పాదయాత్ర నిర్వహించి ప్రజల్లోకి పార్టీని బలంగా తీసుకెళ్తామని ఆయన చాలాసార్లు బహిరంగంగానే చెప్పారు. కానీ, అధిష్టానం ఆ దిశలో చర్యలు తీసుకోకపోవడంతో పార్టీ నాయకత్వ తీరుపై సంచలన విమర్శలు చేసి ఆయన పార్టీని వీడాలని నిర్ణయించుకోవడం గమనార్హం.

## కేంద్రం సహకరించకుంటే అనుమతులు వచ్చేవా?

- బీజేపీలో చేరినా కేసుల నుంచి మినహాయింపు ఉండదు
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు



**సాక్షి, హైదరాబాద్:** కేంద్రం సహకరించకపోతే కాళేశ్వరంతోపాటు ఇతర ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఎలా వచ్చేవని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి మురళీధర్‌రావు ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టుకు సహకరించిందన్నారు. ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించిన విషయంలో బహిరంగ చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. తాము మొదటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థిస్తూ వచ్చామని, ప్రాజెక్టు ప్రారంభాన్ని అభినందిస్తున్నామన్నారు. విద్యాసాగర్‌రావు పార్టీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు గోదావరి జలాల కోసం పాదయాత్ర కూడా చేశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం పెట్టుబడులు, ఇతర వివరాలు, డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు వివరించాలని కోరారు. బ్యాంకుల నుంచి ఎంత? ఇతర సంస్థల నుంచి వచ్చింది ఎంత? దీంతో ఎన్ని ఎకరాలకు సాగు నీరందిస్తారనే దానిపై స్పష్టత లేదన్నారు. 160 టీఎంసీలతో 16 లక్షల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందించవచ్చన్నారు. మొత్తం కలిపి 40 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని గాలి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

### టీఆర్‌ఎస్‌లో పెరిగిన గ్రూపిజం

టీఆర్‌ఎస్‌లో వర్గపోరు ఎక్కువైనట్టు కనిపిస్తోందని, అది హరీశ్‌రావు, కేసీఆర్‌కి మధ్య నడుస్తున్నట్లు అనిపిస్తోందని మురళీధర్‌రావు అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ గురించి ప్రస్తావన లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని, తెలంగాణ దేశంలో భాగం అనే విషయం మర్చిపోకూడదన్నారు. కర్ణాటక తర్వాత బీజేపీ విస్తరించే అవకాశం ఉన్న రాష్ట్రంగా తెలంగాణను జాతీయ నాయకత్వం గుర్తించిందని చెప్పారు. అతి త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ కీలకంగా మారబోతోందన్నారు. కాంగ్రెస్ తెలంగాణలో చాలా వేగంగా కరిగిపోయే పార్టీ అని ఎద్దేవా చేశారు. ఆంధ్ర, తెలంగాణలో బీజేపీలోకి కొత్త వారిని ఆహ్వానిస్తున్నామని, టీడీపీ, కాంగ్రెస్‌ల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అవినీతిని బీజేపీ ప్రోత్సహించదని, బీజేపీలో చేరినంత మాత్రాన కేసుల నుంచి, దర్యాప్తుల నుంచి మినహాయింపు ఉండదనే విషయం గ్రహించాలని అన్నారు.

## కాళేశ్వరం ఘనత కేసీఆర్‌దే..

### టీఆర్‌ఎస్ ఎంపీలు

**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభమవ్వడం తెలంగాణకు పండుగ రోజని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకే ఈ ప్రాజెక్టు నిర్మాణ ఘనత దక్కుతుందని టీఆర్‌ఎస్ ఎంపీలు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును శుక్రవారం ప్రారంభించిన నేపథ్యంలో టీఆర్‌ఎస్ ఎంపీలు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సంబురాలు చేసుకున్నారు. భవన్‌లో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి, కనకదుర్గమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు మాట్లాడుతూ... ప్రపంచం లోనే అతిగొప్ప ప్రాజెక్టుగా కాళేశ్వరం చరిత్ర సృష్టించిందన్నారు. ఈ ప్రాజెక్టును కేసీఆర్ ప్రాజెక్టుగా భావిస్తున్నామన్నారు. రీడిజైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టుని ప్రపంచ స్థాయిలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ నీటి కష్టాలు తీరుతాయన్నారు. పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ..పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాష్ట్రపతి భవిష్యత్తులో నీటి కష్టాలను ప్రస్తావించారన్నారు. ఇలాంటి సమస్యలను ముందుగానే గుర్తించిన సీఎం కేసీఆర్ తెలంగాణను సస్యశ్యామలం చేసే దిశగా కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలాలు రాష్ట్రంలోని గ్రామ గ్రామానికి, మూల మూలలకు అందనున్నాయని, అందుకే ఈ ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు.

## కాళేశ్వరం నిర్మాణంలో బీజేపీది సమానపాత్ర

### పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్



నడ్డాను అభినందిస్తున్న లక్ష్మణ్. చిత్రంలో రాజా సింగ్, చింతల, రాంచందర్‌రావు

**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వ పాత్ర ఎంత ఉందో బీజేపీది కూడా అంతే సమాన పాత్ర ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ప్రాజెక్టునంతా తానే చేపట్టినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని లక్ష్మణ్ విమర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వం, అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారం లేనిదే ఈ ప్రాజెక్టు ఎలా ముందుకు సాగేదని ఆయన ప్రశ్నించారు. లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు శుక్రవారం ఢిల్లీలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాను కలిశారు. తెలంగాణలోని రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు. అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ టీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టు డీపీఆర్‌ను పబ్లిక్ డొమైన్లో పెట్టాలని, ప్రాజెక్టు స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 20 శాతం కూడా పూర్తికాని ప్రాజెక్టును కేవలం ప్రాచుర్యం కోసం ప్రారంభోత్సవం చేశారన్నారు.

### అధికార దుర్వినియోగానికి చెక్ పెడతాం..

తెలంగాణలో టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, కుటుంబ పాలన, నియంత పోకడలను ప్రజల్లో ఎండగడతామని, టీఆర్‌ఎస్ అధికార దుర్వినియోగానికి చెక్ పెడతామని లక్ష్మణ్ అన్నారు. తెలంగాణలో అధికారమే లక్ష్యంగా జేపీ నడ్డా ఇప్పటికే దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాష్ట్రానికి సంబంధించి రైల్వే ప్రాజెక్టులు, అవసరమైన జాతీయ రహదారుల సాధన గురించి నడ్డాకు నివేదిక ఇచ్చామన్నారు. రాష్ట్రంలో బీజేపీ కార్యకర్తలపై దాడులు, ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం నుంచి వివరణ కోరతామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడుతున్నారని, ఏదో ఒక వీడియో విడుదల చేసిన పోలీసులు దమ్ముంటే అన్ని వీడియోలను బయటపెట్టాలన్నారు. పోలీసులు బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేసి తరిమికొడుతుంటే అడ్డుకొనేందుకే రాజాసింగ్ రాయితో కొట్టుకున్నారన్నారు. పోలీసులు కేవలం ఎంఐఎం చెప్పుచేతుల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు. తమపై దాడులకు పాల్పడితే మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

# అగ్రవర్ణ పేదలకు 'మెడికల్'లో రిజర్వేషన్

- 10 శాతం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు అమలు
- దాని ప్రకారం దాదాపు 200 సీట్లు అదనంగా పెరిగే అవకాశం
- ఉస్మానియా, నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కాలేజీలకు అదనపు సీట్లు హుళక్కే?
- మెడికల్ సీట్లకు నోటిఫికేషన్ జారీ చేసిన ఆరోగ్య విశ్వవిద్యాలయం



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా బలహీన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. 2019–20 వైద్య విద్యా సంవత్సరంలో భర్తీ చేయబోయే ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలుచేస్తారు. దీనికి సంబంధించి 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ, అందుకు అవసరమైన మార్గదర్శకాలను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచే తప్పనిసరిగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించినందున ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లల్లో అమలు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఈ రిజర్వేషన్ల అమలు కోసం ప్రత్యేకంగా మంజూరయ్యే సీట్లలోనే అమలు చేస్తామని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలోనూ ఆర్మీ, ఎన్‌సీసీ, దివ్యాంగులు, మహిళలకు కూడా కోటా కల్పిస్తారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలను కేవలం తెలంగాణలోనే ఉన్న కులాలకే అమలు చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. అయితే ప్రైవేటు కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు కూడా ఈ రిజర్వేషన్లు అమలు చేయాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంసీఐకి ప్రతిపాదించింది. కానీ దానిపై స్పష్టత రాకపోవడంతో కేవలం ప్రభుత్వ ఆధ్వర్యంలోని మెడికల్ కాలేజీల్లోనే అమలు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

### ఐదెకరాలపైగా వ్యవసాయ భూమి ఉంటే రిజర్వేషన్ వర్తించదు...

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అగ్రకులాల్లోని పేదల ఆదాయం రూ.8 లక్షల లోపు మాత్రమే ఉండాలి. ఇక ఐదెకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంటే అటువంటి వారికి ఈ రిజర్వేషన్ వర్తించదు. ఇంటి స్థలం వెయ్యి చదరపు అడుగులున్నా, నిర్ధారించిన మున్సిపాలిటీల్లో 200 చదరపు గజాల స్థలమున్నా అనర్హులే. ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీచేయాలని ప్రభుత్వం రెవెన్యూ యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వీటికి కూడా ధ్రువీకరణ పత్రాలు జారీచేస్తారు.

### 200 సీట్లు అదనంగా పెరిగే అవకాశం

వాస్తవంగా తెలంగాణలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,550 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. పది శాతం రిజర్వేషన్ల అమలుకు ఇతర రిజర్వేషన్ల స్ఫూర్తి దెబ్బతినకుండా ఉండాలంటే 25 శాతం అదనంగా సీట్లు పెంచాలి. ఆ ప్రకారం తెలంగాణలో ఏకంగా 387 సీట్లు పెరగాలి. కానీ ఉస్మానియా మెడికల్ కాలేజీలో 250 ఎంబీబీఎస్ సీట్లున్నాయని, అది గరిష్ట పరిమితి వరకు ఉండటంతో అక్కడ మాత్రం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు కాదని అంటున్నారు. ఇక ఈఎస్ఐలోని సీట్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలోవి కాబట్టి వాటిపై నిర్ణయం తీసుకునే అధికారం ఇక్కడి ప్రభుత్వానికి లేదు. ఇక నల్లగొండ, సూర్యాపేటలో ఈ ఏడాది నుంచి ప్రారంభం కాబోయే మెడికల్ కాలేజీలకు కూడా ఈడబ్ల్యూఎస్ సీట్లకు అనుమతి వచ్చే అవకాశం లేదని అంటున్నారు. ఎందుకంటే అక్కడ మంజూరైన సీట్ల మేరకు కూడా ఫ్యాకల్టీ లేదు. ఈ నేపథ్యంలో అదనపు సీట్లకు అనుమతి రావడం కష్టమని అంటున్నారు. అంటే మిగిలిన కాలేజీల్లోని సీట్ల ఆధారంగా చూస్తే అదనపు సీట్లు వచ్చే అవకాశముంది. ఆ ప్రకారం దాదాపు 200 ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశముందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి.

# 'కాళేశ్వరానికి' జాతీయ హోదా ఇవ్వండి

- మిషన్ భగీరథ, కాకతీయ ప్రాజెక్టులకు నిధులివ్వాలి
- కేంద్రాన్ని కోరిన ముఖ్యమంత్రి కేసీఆర్
- బడ్జెట్ కసరత్తుపై రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో నిర్మలా సీతారామన్ భేటీ
- కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం నేపథ్యంలో హాజరుకాలేకపోయిన సీఎం
- ఆయన తరపున హాజరైన ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి

**సాక్షి, న్యూఢిల్లీ:** కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారు. మిషన్ భగీరథ, కాకతీయ ప్రాజెక్టులకు నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు నిధులివ్వాలన్నారు. కేంద్ర బడ్జెట్ కసరత్తులో భాగంగా రాష్ట్రాల ప్రతిపాదనలు, సూచనలు తీసుకొనేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ భేటీలో సీఎం కేసీఆర్ పాల్గొనాల్సి ఉన్నప్పటికీ కాళ్వేరం ప్రాజెక్టు ప్రారంభోత్సవం వల్ల ఆయన హాజరుకాలేకపోయారు. ఆయన తరపున రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరై ముఖ్యమంత్రి ప్రసంగ పాఠాన్ని చదివి వినిపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదాతోపాటు బయ్యారం స్టీల్ ప్లాంట్ పనులను వేగవంతం చేయాలని, వెనుకబడిన జిల్లాల జాబితాలో రాష్ట్రంలోని 32 జిల్లాలను చేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇవ్వాలన్నారు.ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ. 88 వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని, వాటిలో అధిక భాగం కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా సమీకరించిన అప్పులే అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరారు.

### స్టీల్‌ప్లాంట్ ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందుతున్న మిషన్ భగీరథ, మిషన్ కాకతీయలకు నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు నిధులు కేటాయించాలని రామకృష్ణారావు కోరారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు రూ. 50 కోట్ల చొప్పున, పాత జిల్లాలు తొమ్మిదింటికి మాత్రమే రూ. 450 కోట్లు కేటాయిస్తున్నారని, ఆ మొత్తాన్ని కొత్తగా ఏర్పాటైన జిల్లాలు కలిపి 32 జిల్లాలకు వర్తింపజేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 హామీ మేరకు ఏర్పాటు కావాల్సిన స్టీల్ ప్లాంట్ ఇంకా పెండింగ్ లోనే ఉందని, ఆ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానించాలని సూచించారు. దేశంలో 40 కోట్ల ఎకరాల సాగుభూమి, 70 వేల టీఎంసీల జలవనరులు అందుబాటులో ఉన్న విషయాన్ని వివరిస్తూ... ప్రస్తుతం వాటిలో 5.5 కోట్ల ఎకరాలు అంటే 14% మాత్రమే సాగవుతోందని, అందుకు కేవలం 40 వేల టీఎంసీల జలవనరులే వాడుకుంటున్నామన్నారు. వ్యవసాయ రంగం పుంజుకోవాలంటే అందుబాటులో ఉన్న వనరులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. తక్కువ పన్ను వసూలు చేసే విధంగా మరిన్ని పన్ను మినహాయింపు పథకాలను అమలుచేయడం, జాతీయ పెట్టుబడి నిధిలో ప్రకటించిన సొమ్ముకు పదేళ్ల గరిష్ట పరిమితి విధించి, దశలవారీగా నల్లధనాన్ని బయటకు తేవడంలాంటి ప్రయత్నాలు చేయాలని సూచించారు. జాతీయ అవసరాల దృష్ట్యా తమ సూచనలను సహకార సమాఖ్య స్ఫూర్తితో తీసుకోవాలని కోరుతూ కేంద్రం వాటిని పరిగణనలోకి తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

## తడిసి.. ముద్దయ్యారు!

- తొలకరి వానతో హైదరాబాద్‌లో భారీగా ట్రాఫిక్ జామ్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రవేశంతో కురిసిన వర్షానికి గ్రేటర్ వాసులు తడిసి ముద్దయ్యారు. మండుటెండలు, తీవ్ర వడగాడ్పులతో సతమతమైన సిటీ జనులు తొలకరి వానను చూసి మురిసిపోయే లోగా.. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని నరక యాతన అనుభవించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులపై వరదనీరు పోటెత్తింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు బయలుదేరినవారు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుపోయారు. మాదాపూర్, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, గచ్చిబౌలి, మెహిదీపట్నం మార్గాల్లో గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జాంవల్ల చాలా మంది మెట్రో రైళ్లను ఆశ్రయించారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున ప్రయాణికులు రావడంతో మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి.

## జూలై 1 నుంచి గ్రూపు-2 ఇంటర్వ్యూలు

### వెబ్‌సైట్‌లో అర్హుల జాబితా

**సాక్షి, హైదరాబాద్:** గ్రూపు–2 ఇంటర్వ్యూలను జూలై 1వ తేదీ నుంచి నిర్వహించాలని టీఎస్‌పీఎస్సీ నిర్ణయించింది. ఇంటర్వ్యూలకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. తేదీల వారీగా ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సిన వారి జాబితాలను వారం వారం ప్రకటిస్తామని, జంబ్లింగ్ పద్ధతిలో అభ్యర్థులను ఖరారు చేస్తామని వెల్లడించింది. 1,032 గ్రూపు–2 పోస్టుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ 2017లో నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రూప్–2 మీద దాఖలు చేసిన కేసులపై ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడంతో... టీఎస్‌పీఎస్సీ 1:2 రేషియోలో అభ్యర్థులను ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.

## 25న గురుకుల పరీక్ష ఫలితాలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ గురుకులాల్లో 2019–20 విద్యా సంవత్సరం డిగ్రీ ప్రవేశాల భర్తీకి సంబంధించిన పరీక్ష ఫలితాలు, కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు ఈనెల 25న వెల్లడించనున్నట్లు గురుకులాల సొసైటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. www.tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థుల పరీక్ష ఫలితాలు, కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు అందుబాటులో ఉంటాయని పేర్కొంది . సోషల్, ట్రైబల్ వెల్ఫేర్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం టీజీయూజీసెట్–2019 పరీక్ష నిర్వహించింది.

## నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

### 24 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తైన విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) చేరేందుకు జరిపే ఈసెట్ కౌన్సెలింగ్‌ను శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 22 నుంచి ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈ నెల 24 నుంచి 26 వరకు చేయించుకోవాలని, వెబ్ ఆప్షన్లు ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇచ్చుకోవచ్చునన్నారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను https://tsecet.nic.inలో పొందవచ్చునని నవీన్‌మిట్టల్ వివరించారు.

## నేడు మాజీ ఖైదీల కోసం జాబ్‌మేళా

**సాక్షి, హైదరాబాద్:** జైలు నుంచి విడుదలైన ఖైదీల కోసం జైళ్ల శాఖ శనివారం 5వ జాబ్‌మేళా నిర్వహించనుంది. చంచల్‌గూడ జైలు ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ మేళా నిర్వహిస్తామని ఆ శాఖ డీజీ వీకే సింగ్ వెల్లడించారు. విడుదలైన ఖైదీలు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

## అలాగైతే డీలర్ లైసెన్స్ రద్దు

### రిటైల్ వ్యాపారులు పీవోఎస్ మిషన్లు కలిగి ఉండాల్సిందే

**సాక్షి, హైదరాబాద్:** పీవోఎస్ మిషన్లతో ఎరువుల అమ్మకాలు జరగకపోతే డీలర్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువులను రైతులకు సమయానికి అందేలా వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షించాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీబీటీ విధానంలో ఎరువుల విక్రయాలున్నందున కంపెనీలు, రిటైల్ డీలర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, మార్క్‌ఫెడ్, జిల్లా వ్యవసాయాధికారుల బాధ్యతలను వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉత్తర్వుల్లో వివరించారు. రిటైల్ వ్యాపారులు కచ్చితంగా పీవోఎస్ మిషన్లు కలిగి ఉండాలని అందులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎరువుల సబ్సిడీని 100 శాతం నేరుగా కంపెనీలకు చెల్లిస్తున్నందున ప్రతి ఒక్క వ్యాపారి పీవోఎస్ మిషన్ల ద్వారా క్రయవిక్రయాలు జరపాలని సూచించారు. స్టాక్‌లపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించుకోవాలని, నెలవారీగా స్టాక్ నివేదికలను ఫెర్టిలైజర్ ఇన్‌స్పెక్టర్లకు అందజేయాలని అన్నారు. బుక్ బ్యాలెన్స్‌కు, పీవోఎస్ బ్యాలెన్స్ కచ్చితంగా సరితూగాలని, ఏమైనా తేడాలు ఉంటే లైసెన్స్‌ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే మార్క్‌ఫెడ్ బఫర్ స్టాక్ నిల్వ ఉంచుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## పదో షెడ్యూలులోని విద్యా సంస్థల విభజన

### ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ఎక్కడి విద్యార్థులు అక్కడే

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విభజన చట్టం పదో షెడ్యూలులోని విద్యా సంస్థల విభజన మొదలైంది. బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలను రెండు తెలుగు రాష్ట్రాలు వేర్వేరుగానే చేపట్టాలని నిర్ణయించాయి. పదేళ్లపాటు ఉమ్మడి ప్రవేశాల విధానం (20 శాతం ఓపెన్ కోటాలో) ఉన్నా.. ఆంధ్రప్రదేశ్‌లో సీట్లు లభించిన తెలంగాణ విద్యార్థులకు, తెలంగాణలో సీట్లు లభించిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు సీట్లు రావడం, వారు అక్కడికి వెళ్లి ఉండటం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లోనూ సమస్యలు తలెత్తుతుండటంతో ఎక్కడి విద్యార్థులకు అక్కడే ప్రవేశాలు చేపట్టాలని రెండు రాష్ట్రాల్లోని వ్యవసాయ యూనివర్సిటీలు నిర్ణయించాయి. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని వ్యవసాయ యూనివర్సిటీలోని ఫుడ్ టెక్నాలజీ కోర్సులో అక్కడి విద్యార్థులకే ప్రవేశాలు కల్పించనున్నారు. తెలంగాణలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఫుడ్ టెక్నాలజీ కోర్సులో ఇక్కడి విద్యార్థులకే సీట్లను కేటాయించనున్నారు. ఈ మేరకు రెండు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఇటీవల ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఈసారి రాష్ట్రంలో ఫుడ్ టెక్నాలజీ కోర్సులో రాష్ట్ర విద్యార్థులకే ప్రవేశాలు కల్పించేలా ఎంసెట్ ప్రవేశాల క్యాంపు కార్యాలయం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వెబ్ ఆప్షన్లలో ఆ మేరకు చర్యలు చేపడుతోంది.



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ కమ్యూనిటీ సెంటర్‌లో యోగా చేస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు



హుస్సేన్‌సాగర్ బుద్ధవిగ్రహం వద్ద యోగా చేస్తున్న మంత్రి శ్రీనివాసగౌడ్

## వెబ్‌సైట్‌లో సీ-టెట్ హాల్‌టికెట్లు

### జూలై 7న పరీక్ష

**సాక్షి, హైదరాబాద్:** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో నిర్వహించే సీ–టెట్ (సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)– 2019 హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. జూలై 7వ తేదీన సీ–టెట్ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా అధికారిక వెబ్‌సైట్ http://ctet.nic.in నుంచి తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# రాష్ట్రంలోకి నైరుతి ప్రవేశం..

### ఎట్టకేలకు పలకరించిన రుతుపవనాలు

- రాష్ట్రంలో 70 శాతం భూభాగంలోకి నైరుతి
- నేటి నుంచి 2 వారాలూ సాధారణం కంటే అధిక వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై.కె. రెడ్డి వెల్లడి
- రైతులు పంటల సాగు మొదలు పెట్టుకోవచ్చని స్పష్టీకరణ

**సాక్షి, హైదరాబాద్:** నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణలోకి శుక్రవారం ప్రవేశించాయి. అనుకున్న సమయానికంటే ఏకంగా 12 రోజులు ఆలస్యంగా వచ్చాయి. వచ్చీ రావడంతోనే ఒకేసారి రాష్ట్రంలో 70 శాతం మేర విస్తరించాయి. ఒకట్రెండు రోజుల్లో మిగిలిన ప్రాంతాల్లోకి కూడా నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వై.కె.రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నైరుతి రుతుపవనాల ప్రవేశాన్ని ధ్రువీకరించారు. రుతుపవనాలు మరింత పురోగమనంలో ఉన్నాయని, వచ్చే రెండు వారాలూ అంటే వచ్చే నెల నాలుగో తేదీ వరకు తెలంగాణలో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురుస్తాయని స్పష్టం చేశారు. జూన్‌లో ఇప్పటివరకు తెలంగాణలో 48 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఆ లోటును రానున్న కాలంలో భర్తీ చేసేలా వర్షాలు కురుస్తాయన్నారు. 60 శాతం ప్రాంతాల్లో వర్షపాతం నమోదు కావడం, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లతో గాలులు భూమి నుంచి 4 కిలోమీటర్ల ఎత్తు వరకు వీయడం ఈ రెండు అంశాలను లెక్కలోకి తీసుకొని నైరుతి రుతుపవనాల ఆగమనాన్ని అంచనా వేస్తామన్నారు. ఆ ప్రకారం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు నిర్ధారించా మన్నారు. ఈ వర్షాలను ఆధారం చేసుకొని రైతులు పంటలను సాగు చేసుకోవచ్చని ఆయన భరోసా ఇచ్చారు. ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీంతో రుతుపవనాలు మరింత పురోగమిస్తాయని తెలిపారు. జూలై 15 లోపు దేశమంతా రుతుపవనాలు విస్తరిస్తాయని వివరించారు.

**ఈసారి 732 మిల్లీమీటర్ల వర్షం...**

సాధారణంతో పోలిస్తే ఈసారి 97 శాతం వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. అంటే ఆ లెక్కను కూడా సాధారణ వర్షాలుగానే పరిగణిస్తామని వై.కె.రెడ్డి తెలిపారు. తెలంగాణలో సాధారణ నైరుతి సీజన్ వర్షపాతం 755 మిల్లీమీటర్లు (ఎంఎం) కాగా, 97 శాతం లెక్కన ఈసారి 732 ఎంఎంలు కురిసే అవకాశముందన్నారు. గతేడాది ఇదే సీజన్‌లో సాధారణ వర్షపాతాలే కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడించినా 2 శాతం లోటు నమోదైంది. 2016లోనైతే సాధారణం కంటే ఏకంగా 19 శాతం రాష్ట్రంలో అధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాలు ఒకసారి ప్రవేశించాక రెండ్రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తాయి. కొన్నిసార్లు విస్తరించడానికి నాలుగైదు రోజులు పడుతుంది. గతేడాది ఒకేసారి రాష్ట్రమంతటా విస్తరించాయి. ఈసారి రెండు రోజుల్లోనే విస్తరిస్తాయని వై.కె.రెడ్డి తెలిపారు. కేరళలోకి రుతుపవనాలు ప్రవేశించడం గత ఆరేళ్ల లెక్కలతో పోలిస్తే ఈ సారి చాలా ఆలస్యంగా వచ్చాయి. గతేడాది మే 29న రాగా, 2016లో జూన్ 7న ప్రవేశించాయి. ఈసారి జూన్ 8న వచ్చాయి.

**ఆలస్యం అనర్థంకాదు...**

రుతుపవనాలు ఆలస్యమైనంత మాత్రాన ఆ ఏడాది సీజన్ బాగుండదని అనుకోవాల్సిన అవసరం లేదని వై.కె.రెడ్డి తెలిపారు. గతంలో అనేకసార్లు ఆలస్యమైనా సాధారణ వర్షపాతం నమోదైన పరిస్థితి ఉందన్నారు. ఈ ఏడాది తెలంగాణలోకి జూన్ 8న రుతుపవనాలు వస్తాయని అంచనా వేశామని, కానీ 21న (శుక్రవారం) ప్రవేశించాయన్నారు. 2016లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి జూన్ 8న ప్రవేశించగా, తెలంగాణలోకి 19న వచ్చాయి. కానీ ఆ ఏడాది సీజన్‌లో సాధారణం కంటే ఏకంగా 19 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే 2012లో నైరుతి రుతుపవనాలు జూన్ 5న కేరళలోకి, అదే నెల 16న తెలంగాణలోకి ప్రవేశించాయి. కానీ 4 శాతం అధిక వర్షపాతం అప్పుడు రికార్డు అయింది. 2014లో మాత్రం కేరళలోకి నైరుతి రుతుపవనాలు జూన్ 6న ప్రవేశించగా, తెలంగాణలోకి జూన్ 20న వచ్చాయి. అప్పుడు మాత్రం ఏకంగా 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది మే 29న కేరళలోకి, 8న తెలంగాణలోకి అత్యంత ముందుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. కానీ 2 శాతం లోటు వర్షపాతం నమోదైందని వై.కె.రెడ్డి తెలిపారు. గత ఇరవై ఏళ్లలో ఈసారి మాత్రమే అత్యంత ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించాయి.

**విస్తారంగా వర్షాలు...**

రుతుపవనాల రాకకు ముందు తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిశాయి. గురువారం నుంచే తెలంగాణలోని అనేకచోట్ల భారీ వర్షపాతం నమోదైంది. జనగాం జిల్లా జఫర్‌గఢ్‌లో 10 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. భూపాలపల్లి, పాలకుర్తిలో 9 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కరీంనగర్, ఘన్‌పూర్, పర్కాల్, రామగుండం, లింగంపేట, మొగుళ్లపల్లిలో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. డోర్నకల్, సుల్తానాబాద్, మంచిర్యాల, తాడ్వాయిలో 6 సెంటీమీటర్ల చొప్పున.. గోవిందరావుపేట, లక్సెట్టిపేట, బెజ్జంకి, బిక్నూరు, పెద్దపల్లి, కొత్తగూడ, సిర్పూరులో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మిగిలిన చాలా ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది.



**వివిధ సంవత్సరాల్లో కేరళకు, తెలంగాణల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన తేదీలు**

| ఏడాది | కేరళలోకి | తెలంగాణలోకి |
|---|---|---|
| 2013 | జూన్ 3 | జూన్ 7 (ఏపీ) |
| 2014 | జూన్ 5 | జూన్ 19 |
| 2015 | మే 30 | జూన్ 13 |
| 2016 | జూన్ 7 | జూన్ 17 |
| 2017 | మే 30 | జూన్ 12 |
| 2018 | మే 29 | జూన్ 8 |
| 2019 | జూన్ 8 | జూన్ 21 |

**1918లో రికార్డు...**

1918వ సంవత్సరంలో నైరుతి రుతుపవనాలు అత్యంత ముందస్తుగా కేరళలోకి ప్రవేశించడం గమనార్హం. ఆ ఏడాది ఏకంగా మే 7నే రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించాయి. ఆ తర్వాత 1943లో మే 12న, 1932లో మే 15న కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఇవి ఇప్పటివరకు ఉన్న జాతీయ రికార్డు. సాధారణంగా కేరళలోకి మే 29న ప్రవేశిస్తూ ఉంటాయి. ఇక అత్యంత ఆలస్యంగా కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన సందర్భాలూ ఉన్నాయి. 1972లో ఏకంగా జూన్ 20న కేరళలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఆ తర్వాత 2003లో జూన్ 13న కేరళలోకి ప్రవేశించాయి. ఇవే ఇప్పటివరకున్న రికార్డులు.

## బలహీన రుతుపవనాలంటే?

సాధారణంగా కురవాల్సిన దానిలో సగంలోపే వర్షపాతం నమోదైతే బలహీన రుతుపవనాలుగా పరిగణిస్తారు. సాధారణంలో సగానికి మించి నిర్ణీత వర్షపాతం నమోదైతే సాధారణ వర్షపాతంగా గుర్తిస్తారు. కనీసం 2 వాతావరణ కేంద్రాల్లో 3 సెంటీమీటర్లకంటే ఎక్కువగా నమోదై.. సాధారణ వర్షపాతం కంటే ఒకటిన్నర నుంచి నాలుగు రెట్లు నమోదైతే.. అప్పుడు బలమైన రుతుపవనాలుగా పరిగణిస్తారు. కనీసం 2 వాతావరణ కేంద్రాల్లో 5 సెంటీమీటర్ల కంటే ఎక్కువగా, సాధారణ వర్షపాతంలో నాలుగు రెట్లకు పైగా నమోదైతే.. అప్పుడు అద్భుత రుతుపవనాలుగా పరిగణిస్తారు.

# ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి నోటిఫికేషన్

- మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీ ప్రక్రియ మొదలు
- 1,275 ప్రభుత్వ, 1,605 ప్రైవేటు ఎంబీబీఎస్ సీట్లు
- నేటి నుంచి 28 వరకు దరఖాస్తు గడువు.. ఆ రాత్రే జాబితా
- 29 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన..

**సాక్షి, హైదరాబాద్:** ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య విద్య కోర్సుల్లో 2019–20 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అగ్ర కులాల్లోని పేదలకు 10 శాతం రిజర్వేషన్ అమలు ఉత్తర్వులు విడుదల చేసిన వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, మైనారిటీ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ( www.knruhs.in & http://www.knruhs.telangana.gov.in/) దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి సూచించారు. కాగా, 22 నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలి. నీట్‌లో వచ్చిన మార్కుల ప్రకారమే సీట్ల కేటాయింపు ఉంటుంది. దరఖాస్తుల ఆధారంగా 28 రాత్రి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తారు. ఆ జాబితా ఆధారంగా 29 నుంచి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. అనంతరం తుది మెరిట్ జాబితా విడుదల చేసి సీట్లు కేటాయిస్తారు. ఆగస్టు 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. దరఖాస్తు సమయంలో సమస్యలు తలెత్తితే 9502001583, 8466924522 నంబర్లలో సంప్రదించాలని, నిబంధనలకు సంబంధించిన సమాచారం కోసం 9490585796, 8500646769 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈసారి స్పోర్ట్స్ కోటా ఉండదని వీసీ తెలిపారు. అఖిల భారత కోటా సీట్లకు దరఖాస్తు చేసిన వారు నిర్ణీత కాలంలో వీలైనంత త్వరగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. అఖిల భారత కోటా సీట్లలో చేరేందుకు జూలై 3 చివరి తేదీ కావడంతో ఇక్కడ దరఖాస్తు చేసినవారు ఆ లోపే వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.

**కన్వీనర్ కోటాలో 2,880 ఎంబీబీఎస్ సీట్లు..**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద మొత్తం 2,880 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయని కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నేషనల్ పూల్‌కు 15 శాతం సీట్లు పోగా 1,275, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 1,275 సీట్లు, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో 330 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయని వివరించారు. ఇవి కాకుండా ఈడబ్ల్యూఎస్ కోటా కింద మరో 200 ఎంబీబీఎస్ సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇవన్నీ కలిపితే 3,080 ఎంబీబీఎస్ సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ కానున్నాయి. ప్రైవేటు, మైనారిటీల్లోని ఎంబీబీఎస్ సీట్లల్లో 50 శాతం కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్‌కు ఏడాది ఫీజు రూ.10 వేలు, ప్రైవేటు మెడికల్, మైనారిటీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా ఫీజు రూ.60 వేలుగా ఉంది. జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 50 పర్సెంటైల్ 134 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీకి 40 పర్సెంటైల్ 107 మార్కులు, దివ్యాంగులు 45 పర్సెంటైల్ 120 మార్కులుగా కటాఫ్‌ను ఎంసీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే.



## హైకోర్టు ఆవరణలో యోగా

**సాక్షి, హైదరాబాద్:** ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు యోగా చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు టి.సూర్యకిరణ్‌రెడ్డి, ఇతరులు యోగాసనాలు వేశారు.

# రిజిస్టర్ పోస్ట్‌లో ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్

- స్పందించని అధికారులపై చర్యలేంటి?
- ఆదేశించిన హైకోర్టు

**సాక్షి, హైదరాబాద్:** రిజిస్టర్ పోస్టులో వచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయని అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ భూముల్లోకి కొందరు అక్రమంగా చొరబడ్డారని పేర్కొంటూ మణుగూరుకు చెందిన కె.లక్ష్మీపతిరాజు రిట్ దాఖలు చేశారు. రిజిస్టర్ పోస్ట్‌లో ఫిర్యాదు పంపితే మణుగూరు డీఎస్పీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు స్వీకరించకుండా వెనక్కి పంపేశారని, ఈ విషయాన్ని ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గతంలో పిటిషనర్ హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఈ రిట్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి విచారించారు. దీంతో రిజిస్టర్ పోస్టులో అందిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, స్పందించని అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని అప్పట్లోనే న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు. నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి అందజేసే ఫిర్యాదులనే కాకుండా రిజిస్టర్ పోస్టులో వచ్చే ఫిర్యాదులపై కూడా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్పష్టంచేశారు. అయితే శుక్రవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగానే.. ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది మల్లారెడ్డి చెప్పారు. అధికారులపై చర్యల నివేదిక మాటేమిటని హైకోర్టు ప్రశ్నించగా అందుకు కొంత సమయం కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణ 25కి వాయిదా పడింది.



సాక్షి
శనివారం, జూన్, 22

# నెరవేరిన జలసంకల్పం

గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని తెలంగాణలోని బీడు భూముల్ని సస్య శ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ముగ్గురు ముఖ్య మంత్రుల సాక్షిగా శుక్రవారం ప్రారంభమైంది. మూడేళ్లనాడు మొదలైన ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు అనేకానేక అవాంతరాలకు, అవరోధాలకు ఎదురీదుతూ చకచకా ముందుకు సాగిన తీరు అపూర్వమని చెప్పాలి. ఎన్నో ప్రాజెక్టులు, వందల కిలోమీటర్ల పొడవైన సొరంగాలు, రిజర్వాయర్లు, కాల్వలు, భారీ మోటార్లు... ఇవన్నీ మూడేళ్ల వ్యవధిలోనే పరిపూర్తి చేయడం అద్భుతం, అసాధారణం. దాదాపు 40 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తూనే, జనం దాహార్తిని తీరుస్తూనే, పరిశ్రమల అవసరాలకు సైతం ఉపయోగపడేవిధంగా ఈ బృహత్తర ప్రాజెక్టును తీర్చిదిద్దారు. గోదావరి నదీగర్భం నుంచి దాదాపు అరకిలోమీటరు ఎత్తులో నీళ్లను ఎత్తిపోసి అక్కడి నుంచి వివిధచోట్ల నిర్మించిన బరాజ్‌లకు వాటిని తరలించి బీడు భూములను చివురింపజేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇరుగు పొరుగు రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరిస్తే, పొరుగు అవసరాలను పెద్ద మనసుతో అర్థం చేసుకోగలిగితే రాష్ట్రాల మధ్య అవగాహన సాధ్యమేనని, జటిలమైన జల వివాదాలు సైతం సునాయాసంగా పరిష్కారమవుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిరూపించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మించాలనుకున్న సమయంలో పొరుగునున్న మహారాష్ట్ర అందుకు అభ్యంతరం చెప్పినప్పుడు ఆయన చేసింది ఇదే. అనేక ప్రత్యామ్నాయాలను ఆలోచించి చివరకు తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద ఎత్తిపోతల చేపడతామని ప్రతిపాదించి, ఆ రాష్ట్రాన్ని ఒప్పించారు. ఈ క్రమంలో ఆ రాష్ట్రం వ్యక్తం చేసిన ఎన్నో సందేహాలను ఆయన పటాపంచలు చేయగలిగారు.

మన దేశంలో జలవివాదాలు ఎన్ని సమస్యలను సృష్టిస్తున్నాయో, ఆ వివాదాల కారణంగా జనం ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అందరికీ తెలుసు. అయినా నేతలు కాస్తయినా వెనక్కి తగ్గరు. తమ వాదనే సరైందంటూ కాలం గడుపుతారు తప్ప ప్రజలకు మేలు కలుగుతుందన్న వివేచనను ప్రదర్శించరు. రాజ్యాంగంలోని 262వ అధికరణ నదీజలాల వివాదాలు తలెత్తినప్పుడు ఏం చేయాలో వివరిస్తుంది. నదీజలాల వినియోగం, పంపిణీ, నియంత్రణ వగైరాలపై రాష్ట్రాల మధ్య జగడం వచ్చినప్పుడు దాని పరిష్కారం కోసం తగిన యంత్రాంగాన్ని పార్లమెంటు ఏర్పాటు చేయొచ్చునని ఆ అధికరణ వివరిస్తుంది. దాన్ని అనుసరించే 1956లో నదీ జలాల బోర్డు చట్టం, అంతర్రాష్ట్ర నదీజలాల వివాద చట్టం వంటివి వచ్చాయి. బోర్డు ఏర్పాటు ఇంతవరకూ సాకారం కాకపోయినా నదీజలాల చట్టం కింద ట్రిబ్యునళ్లు ఏర్పడ్డాయి. కానీ వీటిల్లో చాలా ట్రిబ్యునళ్లు వివాదాలు బాగా ముదిరాక ఉనికిలోకొచ్చినవే. కానీ ఆశ్చర్యమేమంటే ఇవి అంతులేని జాప్యం తర్వాత ప్రకటించిన నిర్ణయాలు వివాదాలను ఏమాత్రం పరిష్కరించకపోగా వాటిని మరింత జటిలంగా మార్చాయి. జలవివాదాలు సుప్రీంకోర్టు పరిధిలోకి రాబోవని నిబంధనలు చెబుతున్నా చివరకు అవి అక్కడికే చేరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో సుప్రీంకోర్టు చెప్పినా రాష్ట్ర ప్రభుత్వాలు ఆ తీర్పుల్ని అమలు చేయడానికి ససేమిరా అంటున్నాయి. 'ప్రజల మనోభావాల'ను సాకుగా చూపుతున్నాయి. ఏతావాతా రాజ్యాంగ అధికరణలు, చట్ట నిబంధనల ప్రకారం వెళ్లాలనుకుంటే ఏళ్లకేళ్ల సమయం పడుతుంది తప్ప చివరకు ఏ ఫలితమూ లభించడం లేదు. వివాదాలు తలెత్తిన రాష్ట్రాల్లోని ప్రజానీకానికి అగచాట్లు తప్పడం లేదు. వేర్వేరు దేశాల మధ్య కూడా జలవివాదాలు పరిష్కారమవుతుండగా మన దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య అటువంటి సమన్వయం కొరవడుతోంది. పర్యవసానంగా ప్రతిపాదించిన ప్రాజెక్టులన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. విలువైన జలాలు సముద్రంపాలవుతున్నాయి.

గోదావరి నదిలోనే ఏటా 3,000 టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతోందని ఒక అంచనా. రెండు రాష్ట్రాల్లోని కోట్లాదిమందికి ప్రాణాధారమైన గోదావరి నదిలో ఏటా మూడు నెలల పాటు...అంటే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నీటి లభ్యత అత్యధికంగా ఉంటుంది. కానీ దురదృష్టమేమంటే ఇలా వచ్చే నీరంతటినీ సంపూర్ణంగా వినియోగించుకునే సామర్థ్యం తెలుగు రాష్ట్రాలు రెండిటికీ లేదు. మరోపక్క ఈ రెండు రాష్ట్రాలూ తరచుగా కరువు వాతబడి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఉపాధి అవకాశాలు ఆవిరై జనం పొట్టచేతబట్టుకుని వలసపోతున్నారు. ఊళ్లు బావురుమంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు సాకారం కావడానికి తెలంగాణ ప్రభుత్వం చేసిన కృషి ఆదర్శనీయమైనది. గోదావరి జలాలను ఎగువనున్న మహారాష్ట్రతోపాటు రెండు తెలుగు రాష్ట్రాలూ వినియోగించుకోవాల్సి ఉండగా ఇందులో కేవలం మహారాష్ట్ర మాత్రమే తన వంతు వాటాను మెరుగ్గా వాడుకోగలుగుతోంది. గోదావరి జల వివాద ట్రిబ్యునల్ ప్రకటించిన అవార్డు ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటాకు 1486 టీఎంసీల నీళ్లు వస్తాయి. ఇందులో తెలంగాణకు 912.250 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 509.546 టీఎంసీలున్నాయి. నదుల్లో సమృద్ధిగా నీళ్లున్నప్పుడు సమస్యలు తలెత్తే ప్రశ్నే ఉండదు. అలా లేనప్పుడే వివాదాలు ముసురుకుంటాయి. కృష్ణానదిలో ఎప్పుడూ నీళ్లు సరిగా పారే పరిస్థితి లేనందువల్ల పంపకాల్లో పేచీ వస్తోంది. అది తరచుగా వివాదాల్లో చిక్కుకుంటోంది. గోదావరికి నీటి లభ్యత విషయంలో ఎప్పుడూ ఇబ్బంది లేదు. అలాగని ఇకముందూ ఇలాగే ఉంటుందనుకోవడానికి లేదు. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణకు మహారాష్ట్రతో అవగాహన కుదిరినట్టే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య కూడా నదీజలాల విషయంలో సమన్వయం, సదవగాహన ఏర్పడితే ఈ రెండు రాష్ట్రాల భవిష్యత్తూ దివ్యంగా ఉంటుంది. శుక్రవారం నాటి చారిత్రక ఘట్టం అది నూటికి నూరుపాళ్లూ సాధ్యమేనని బాస చేస్తోంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి బ.పంచమి రా.7.01 వరకు తదుపరి షష్ఠి, నక్షత్రం ధనిష్ఠ రా.7.30 వరకు, తదుపరి శతభిషం, వర్జ్యం తె.3.29 నుంచి 5.17 వరకు (తెల్లవారితే ఆదివారం), దుర్ముహూర్తం ఉ.5.29 నుంచి 7.16 వరకు అమృతఘడియలు... ఉ.8.01 నుంచి 9.45 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ. 9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

# జాతి వైవిధ్యతకు 'జమిలి' ప్రమాదం

విశ్లేషణ



విద్యా భూషణ్ రావత్

**దేశంలో భారీస్థాయికి చేరుకున్న ఎన్నికల ఖర్చును తగ్గించే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏకకాలంలో అసెంబ్లీలకు, పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించడం పేరిట జమిలి ఎన్నికల ప్రతిపాదనను ముందుకు తీసుకొచ్చింది. దీనిలో సాధ్యాసాధ్యాలు, జాతీయ–స్థానిక రాష్ట్రస్థాయి సమస్యల మధ్య వ్యత్యాసం వంటి ఆచరణాత్మక అంశాలను పక్కనబెట్టి చూస్తే, ఈ ప్రతిపాదనలో అంతకు మించిన ప్రమాదం పొంచి ఉందన్నది వాస్తవం. వివిధజాతుల సమ్మిళిత సంస్కృతిగా మన రాజ్యాంగం ఘనంగా ప్రవచించిన భారతీయ బహుముఖ వైవిధ్యతను నిర్మూలించి దేశం మొత్తాన్ని ఏకజాతీయ చట్రంలో ఇరికించే స్వభావంతో జమిలి ఎన్నికల భావన ముందుకొస్తోంది. అధికార పార్టీకి తిరుగులేని బలం చేకూర్చే ఆ ప్రతిపాదన అమలైతే దేశం, పౌరులు చెల్లించాల్సిన మూల్యం చాలా ఎక్కువగా ఉంటుంది.**

ఒక దేశం ఒకే పోల్ పేరిట దేశంలో ప్రస్తుతం విస్తృతంగా ప్రచారం అవుతున్న జమిలి ఎన్నికల నినాదం అతి ప్రమాదకర సంకేతాలను వెలువరిస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే జమిలి ఎన్నికల భావన వివిధజాతుల సమ్మిళిత సంస్కృతిగా మనం ఘనంగా చెప్పుకునే భారతీయ వైవిధ్యతను నిర్మూలించి దేశం మొత్తాన్ని ఏకజాతీయ చట్రంలో ఇరికించే స్వభావంతో ముందుకొస్తోంది. సజాతీయత ముసుగులో ఎన్నికలు గెల్చుకోవడం అనే ప్రక్రియను విజయవంతంగా ముగించిన కేంద్రంలోని పాలకపార్టీకి జమిలి ఎన్నికలు వరంగా మారటం ఖాయం. కానీ అతిపెద్ద దేశంగా ఉంటూ తనే ఒక ఖండంగా భాసిల్లుతున్న భారతదేశంలో ఎన్నికల కమిషన్ సన్నద్ధత తీరుతెన్నులను పరిశీలించే వారికి ఒక విషయం సుబోధకమే. ప్రధాని నరేంద్రమోదీ, ఆయన సహాయకులు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి చేయవలసిన ప్రధాన కర్తవ్యం ఏమిటంటే, ఒకే రోజు దేశవ్యాప్తంగా పోలింగ్ నిర్వహించి ఫలితాలను నాలుగురోజుల్లోపే ప్రకటించాలని ఎన్నికల కమిషన్‌ని కోరడమే.

దేశం మొత్తంలో ఎన్నికలను ఒకేరోజు ముగించడం వల్ల మనకు ఎన్నో ప్రయోజనాలు సిద్ధిస్తాయి. వీటిలో మొట్టమొదటిది ఏమిటంటే ఎగ్జిట్ పోల్స్ ప్రాతిపదికన పార్టీల గెలుపోటములపై విచ్చలవిడిగా సాగుతున్న అంచనాలను అరికట్టవచ్చు. ఎగ్జిట్ పోల్స్ తనకు తానుగా ఒక దందా లాగా మారిపోయి మార్కెట్లోని దళారీలకు ఫలితాల అంచనాల పేరిట కోట్లాదిరూపాయలు కొల్లగొట్టే అవకాశాలు కల్పిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల కేంపెయిన్ మార్చి 10న మొదలై మే 19న చివరి దశ ప్రచారంతో ముగిసింది. మే 23న ఫలితాల లెక్కింపు జరిగింది. ఇంత సుదీర్ఘకాలం జరిగే ఎన్నికల ప్రక్రియ వల్ల అనేక పుకార్లు వ్యాప్తి చెందుతూ, అంచనాలు పెరుగుతూ పోవడమే కాదు.. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, భారత ఎన్నికల సంఘం పనితీరుపైనే సందేహాలను రేకెత్తిస్తోంది. కాబట్టి, మోదీ జమిలి ఎన్నికలను కోరుకుంటున్నట్లయితే, దేశమంతా ఒకేరోజు పోలింగ్ పూర్తి చేసి తదుపరి నాలుగైదు రోజుల్లోనే ఫలితాలను వెల్లడించేలా తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలి. అవసరమైన చోట రీపోల్స్ జరిపించడం, ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాలకు తరలించడానికి ఈ అయిదు రోజుల వ్యవధి సరిపోతుంది.

ఇక రెండో విషయం.. ఒకే దేశం ఒకే పోల్ విధానంలో ఎన్నికల నిధులను ప్రభుత్వమే సమకూర్చడం. పోలింగ్ జరగడానికి రెండు నెలల ముందే రాజకీయ పరమైన ప్రకటనలను, ఒపీనియన్ పోల్స్‌ని నిషేధించాల్సి ఉంటుంది. మూడోది.. రాష్ట్ర అసెంబ్లీలు వివిధ కాలాల్లో ఏర్పడుతుంటాయి. ఇది ఎల్లప్పుడూ సంభవించే ప్రక్రియ. శాసనసభలకు కూడా ఏకకాలంలో ఎన్నికలు 1950 మొదట్లో మాత్రమే జరిగేవి. కానీ ఆ తర్వాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీల కాల వ్యవధి మారుతూ వచ్చింది. ప్రభుత్వాలు కుప్పగూలిపోవడం, రాష్ట్రపతి పాలన వంటి పలు పరిణామాలు దీనికి కారణం. ఇలాంటివి పదే పదే జరగటం సహజం. సార్వత్రిక ఎన్నికలు జరిగేవరకు రాష్ట్రాల అసెంబ్లీలను అనిశ్చితంగా ఉంచలేరు. అలా ఉంచితే అది పూర్తి సమస్యాత్మకంగా మారుతుంది. అంతకుమించి జాతీయ సమస్యలకు, స్థానిక రాష్ట్ర స్థాయి సమస్యలకు మధ్య చాలా పెద్ద వ్యత్యాసం ఉంటుంది. ఇవి రెండు ఎన్నటికీ ఒకటిగా ఉండలేవు. ప్రస్తుతం ఎన్నికల కోసం జరుగుతున్న భారీ స్థాయి ఖర్చును తగ్గించాలని ప్రధానమంత్రి భావించడంలో తప్పులేదు. మనం



అర్థం చేసుకోగలం కూడా. కానీ వాస్తవమేమిటంటే స్వయంగా ఆయన పార్టీనే ఈ దఫా ఎన్నికల్లో విపరీతంగా ఖర్చుపెట్టింది. బీజేపీ మినహా ఇతర పార్టీలన్నీ కలిపి కూడా బీజేపీ పెట్టిన ఖర్చులో కనీసం 50 శాతం కూడా వెచ్చించలేకపోయాయి. కాబట్టి భారీస్థాయిలో డబ్బులు వెదజల్లి అధికారంలోకి వచ్చిన పార్టీ తనతో సమాన స్థాయిని కలిగి ఉండే పార్టీల ఉనికిని ఎన్నడూ అంగీకరించదు.

అందుకే ప్రస్తుత కేంద్రప్రభుత్వం శాశ్వతంగా అధికారంలో ఉండటంకోసం దూకుడుగా తన ఆధిపత్యాన్ని చలాయించడానికి ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ప్రజాస్వామ్యం నిజంగా బలోపేతం కావాలంటే అమెరికా అధ్యక్షపాలనా వ్యవస్థ తరహాలో మన దేశంలోనూ రెండు దఫాలకు మించి ఎవరూ ప్రధాని పదవిని చేపట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఇది ప్రజాస్వామీకరణ ప్రక్రియను సంఘటితం చేస్తుంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా అంతర్గతంగా ప్రజాస్వామీకరణ ప్రక్రియకు అనుమతించాలి. అప్పుడు మాత్రమే మనదేశంలోని రాజకీయ పార్టీలు వివిధ రాజకీయ కుటుంబాల వారసత్వపు హక్కుగా మారలేవు. పైగా ఒకే జాతి, ఒకే పోల్ అనేది ఏరకంగా చూసినా ఆచరణ సాధ్యమయ్యే భావన కాదు. ఒక అసెంబ్లీలే ఎందుకు, పార్లమెంటే ఎందుకు, పంచాయతీలు, పట్టణ స్థానిక పాలనా సంస్థలు, జిల్లా పరిషత్‌లు అన్నిం టికీ ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహిస్తే పోలా? ఇది ఎంత అనాలోచితమైన, అవాస్తవికమైన ప్రతిపాదనో అర్థం చేసుకోవచ్చు. ప్రధాని మోదీ తలంపులోంచి పుట్టుకొచ్చిన ఈ జమిలి ఎన్నికల భావనలో కొత్తదనం అన్నది లేదు. చరిత్రలో శక్తిమంతుడైన ప్రతి వ్యక్తీ, నియంతా తిరుగులేని అధికారాన్నే కోరుకున్నాడు కానీ అది ఆచరణాత్మకం కాదు. వాస్తవం అంతకంటే కాదు. రాష్ట్ర ప్రభుత్వాల పదవీకాలాన్ని బట్టి వివిధ రాష్ట్రాల శాసనసభలు వివిధ కాలాల్లో ఎన్నికలకు వెళ్తుంటాయి. శాసనసభల పదవీకాలాన్ని ఒకసారి నిర్ణయించిన తర్వాత దాదాపు అదేసమయంలో అవి ఎన్నికలకు వెళ్తుంటాయి. ఈ చట్రానికి అవతల ఎవరూ ఎలాంటి ప్రయోజనమూ పొందలేరు. ఒక రాజకీయ పార్టీగా బీజేపీ తన చరిత్రలోనే ఎన్నడూ లేనంత ఉజ్వల దశను ఇప్పుడు అనుభవిస్తోంది. పైగా ప్రతి దేశంలోని ప్రతి పాలనా వ్యవస్థా ఇప్పుడు దాని చేతుల్లో ఉన్నాయి. ఈ దన్ను, దమ్ముతోనే అది దేశవ్యాప్తంగా సమస్త ప్రతిపక్షాలను దిగ్బంధించాలని ప్రయత్నిస్తోంది. కానీ బీజేపీ ప్రయత్నాలకు దేశం చెల్లించే మూల్యం అసాధారణంగానే ఉంటుంది.

ఒకేదేశం, ఒకే ఎన్నిక అంటూ మోదీ చేసిన ప్రతిపాదనను లా కమిషన్ కూడా తర్కించి ఈ అంశంపై తమ అభిప్రాయాలను తెలుపాల్సిందిగా వివిధ రాజకీయపార్టీలను కోరింది. అయితే భారతీయ ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులు ఒక భాగం మాత్రమే. ఎన్నికలకు సంబంధించిన ఈ మొత్తం ప్రక్రియలో ఎన్నికల సంఘానికి, న్యాయవ్యవస్థకు, అందరికంటే మించి భారతీయ ఓటరు లేదా పౌరుడికి కూడా భాగముంది. అందుకే ఈ కీలకమైన అంశంపై ఒక నిర్ణయం తీసుకోవడానికి ముందు అన్ని వర్గాల అభిప్రాయాలను లెక్కలోకి తీసుకోవాలి.

భారత్ ఇప్పటికీ పరిణితి చెందుతూ ఉన్న ప్రజాస్వామ్యంగా, అభివృద్ధి చెందుతున్న దేశంగా ఉంటోంది. ఎదుగుతున్న దేశం అనేక సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. వీటిలో అతిపెద్ద సవాలు చక్కటి, పారదర్శకమైన, సమర్థ పాలనను అందివ్వడం. కానీ మనదేశంలో రాజకీయ నేతలు అధికారంలోకి రావడానికి ముందు హామీలను గుప్పించి ఎన్నికై అధికారంలోకి వచ్చింతర్వాత వాటిని అవలీలగా మర్చిపోతూ, పక్కనబెడుతూ మరో అయిదేళ్లవరకు అధికారం చలాయిస్తూ ఉంటారు. చివరకి మరో దఫా ఎన్నికలకు సమయం సమీపిస్తున్నప్పుడు మాత్రమే వీరికి తాము గతంలో చేసిన హామీలు గుర్తుకొస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల వలే కాకుండా భారత్ వంటి వర్ధమాన దేశాల్లో రాజకీయనేతలు, బ్యూరోక్రాట్లు చట్టాలను పదేపదే ఉల్లంఘిస్తూ, చట్టపాలన అమలుకాని పరిస్థితిని అందిపుచ్చుకుని శిక్షలనుంచి తప్పించుకుంటుంటారు. అందువల్లే అధికారం కైవసం చేసుకున్న నేతలు, వారి అధికారులు, ప్రభుత్వ సేవకులు అధికారాన్ని తరచుగా దుర్వినియోగ పరుస్తూనే ఉంటారు. రాజకీయ నేతలు తామిచ్చిన హామీలకు కట్టుబడకపోతే వారిని తిరస్కరించే అవకాశం ఓటర్లకు అయిదేళ్లకుగానీ రాదు. ఈ స్థితిలో మార్పులు తీసుకొచ్చేంత వరకు, అపసవ్య పాలన అమలవుతున్న వ్యవస్థలో ఎన్నికలను ఇప్పుడున్న రీతిలో యధాతథంగా కొనసాగించడమే ఉత్తమం.

దేశవ్యాప్తంగా ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడంలో ఉండే పరిహాసాన్ని, అభాసను ఒకసారి చూడండి. ఈ ఎన్నికల సమయంలో అమిత్ షా, స్మృతి ఇరానీ గుజరాత్ నుంచి తమ రాజ్యసభ స్థానాలకు రాజీనామా చేశారు. రెండు విభిన్న తేదీల్లో వీరు రాజీనామా చేయడం అందరికీ తెలిసిన విషయమే. కానీ ఎన్నికల కమిషన్ ఒక అసాధారణ ఆదేశాన్నిచ్చి, ఆ రెండు రాజ్యసభ స్థానాలకు విభిన్న తేదీల్లో పోలింగ్ నిర్వహించింది. ఆ రెండు స్థానాలను బీజేపీకే దక్కనివ్వాలనే ఈసీ తలంపు వెనుక ఉద్దేశాన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. పాలక పక్షం ఇష్టాయిష్టాలకు అనుగుణంగా తోలుబొమ్మలాగా మారి ఎన్నికల సంఘం తన ప్రతిష్టను తానే ఈ రకంగా దిగజార్చుకోవచ్చా? ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ చర్చ లేవనెత్తుతున్న అధికార పార్టీకి గుజరాత్‌లో రెండు రాజ్యసభ స్థానాలకు ఏకకాలంలో, ఒకే తేదీన ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాలేకపోయిందా? ఎంత కపటత్వమో ఇది. జమిలి ఎన్నికల పేరిట అధికార పార్టీ భవిష్యత్తులో చేసే చేష్టలు ఇలాగే కొనసాగుతాయి. రాజ్యాంగం ప్రవచించిన భారతీయ బహుముఖీన వైవిధ్యాన్ని నిర్మూలిస్తూ ఏక సంస్కృతి, ఏకజాతితత్వాన్ని ముందుపీఠికి తీసుకువస్తున్న క్రమంలో పాలకపక్షం తొండాట ప్రారంభంలోనే ఈ స్థాయిలో రుజువవుతోంది మరి!

వ్యాసకర్త సామాజిక, మానవ హక్కుల కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





## సోషల్ మీడియా

### గతం గతః



"మూడేళ్లక్రితం...అంటే 2016 డిసెంబర్ 8న శేఖర్ రెడ్డి వద్ద స్వాధీనం చేసుకున్న రూ. 33.89 కోట్ల వ్యవహారంలో ఆదాయం పన్ను శాఖ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఆ మొత్తం ఆయన సంస్థకు ఇసుక అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బని తేల్చిచెప్పింది. అయితే ఆ సొమ్మంతా అప్పట్లో విడుదలైన కొత్త రూ.2,000 నోట్ల రూపంలో ఉన్నదని, ఆ రోజుల్లో పౌరుల వద్ద అంత మొత్తం ఉండటం నేరమవుతుందని ఆ శాఖ మరిచినట్టుంది"

– అరవింద్ గుణశేఖర్, పాత్రికేయుడు

### అదృష్టవంతుడు



"ఈసారి ఎందుకనో బీజేపీ ప్రథమ ప్రధాని నెహ్రూపై విరుచుకు పడలేదు. బిహార్‌లో మెదడువాపు వ్యాధితో దాదాపు 200 మంది పిల్లలు మరణించిన వ్యవహారంలో మాజీ సీఎం రబ్డీ దేవిపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ ఆరోపణలు గుప్పిస్తున్నారు. మొత్తానికి చాచాజీ బతికిపోయినట్టే!"

– ఎస్‌పీ సింగ్, న్యాయవాది

### ఓపిక అవసరం



"క్రికెటర్ శిఖర్ ధావన్ గాయపడి ఆటకు దూరమైనందుకు ప్రధాని మోదీ ఎంతో బాధపడ్డారు. ముజఫర్‌పూర్‌లో కన్నుమూసిన పిల్లలూ... దయచేసి మీరు ఎదురు చూస్తుండండి. మీ మరణవార్తలు ఇంకా ప్రధాని వరకూ చేరలేదు. అలా చేరాకే మీ గురించి సంతాప ప్రకటన చేస్తారు"

– రాఫెల్ గాంధీ, రాజకీయ వ్యాఖ్యాత

### స్మారక చిహ్నాలు



"హేతువాదులకులాగే తీవ్రవాద హిందువులకు కూడా దైవం అంటే విశ్వాసం ఉండదు. వారి దృష్టిలో దేవుళ్లు చరిత్రాత్మక ఆకృతులు మాత్రమే. దైవం చారిత్రక ఆకృతి అయినప్పుడు దేవాలయాలు కేవలం స్మారక చిహ్నాలే అవుతాయి"

– దేవ్‌దత్ పట్నాయక్, రచయిత

### హవ్వ...!



"బ్యాంకుల్ని రూ.6,000 కోట్ల మేర మోసగించిన కేసులో ఆర్నెల్ల క్రితం తెలుగుదేశం ఎంపీ సుజనా చౌదరి సంస్థలపై దాడులు జరిగాయి. ఆయన ఇప్పుడు భారతీయ జనతా పార్టీలో చేరిపోయారు. బీజేపీ దగ్గరున్న వైట్ వాషింగ్ మెషీన్‌తో ఆయన పరిశుభ్రమైన వ్యక్తిగా మారిపోతారు. ఆయనపై ఉన్న కేసులన్నీ ఉపసంహరించుకుంటారు. 'నేను తినను... ఎవరినీ తిననివ్వను' అనే దగ్గరినుంచి 'తినేవారితో చెలిమి చేస్తామ'నే వరకూ వెళ్లిందన్నమాట!"

– ప్రశాంత్ భూషణ్
సుప్రీంకోర్టు న్యాయవాది

## పసిగుడ్డుపై పైశాచికత్వం

ముద్దులొలికే చిన్నారి. అప్పటి వరకు ఆనందంగా ఆడుకుంది. ఆ తర్వాత అమ్మ పొత్తిళ్లలో హాయిగా నిద్రించింది. కామంతో కళ్లు మూసుకుపోయిన రాక్షసుడు ఆ పసికూనపై కన్నేశాడు. తల్లిపొత్తిళ్ల నుంచి వేరుచేసి మరీ చిదిమేశాడు. ఆ తల్లికి శాశ్వతంగా కడుపుకోత మిగిల్చాడు. హన్మకొండలో జరిగిన ఘటనతో రాష్ట్రం అట్టుడికిపోతోంది. ఇటీవల వార్తలను పరిశీలిస్తే చెన్నైలో పదకొండేళ్ల దివ్యాంగురాలిపై అత్యాచారం. కామాంధుల చేతిలో చిత్రవధలకు గురైన సంఘటన. మనుషుల మధ్యన ఉంటున్న 22 మంది క్రూరమృగాలు అభం శుభం తెలియని ఒక దివ్యాంగురాలిపై అత్యాచారం. ఆ చిన్నారి బాల్యాన్ని తిరిగి ఇచ్చేదెవరూ. ఉత్తరాఖండ్‌లో ఎనిమిదేళ్ల చిన్నారిపై అశ్లీల వీడియోలకు బానిసలైన మైనర్లు జరిపిన అత్యాచారం... పిల్లల శరీర భాగాలతో వికృత చేష్టల ఘటనలు కోకొల్లలుగా పెరిగిపోతున్నాయి. ఒక యువకుడు 6 సంవత్సరాల చిన్నారిని చాక్లెట్ ఇస్తానని చెప్పి నిర్జన ప్రదేశానికి తీసుకు వెళ్లి దారుణంగా క్రూరంగా చిత్రహింసలకు గురిచేసి అత్యాచారం జరిపి హత్య చేసిన సంఘటన.. నిజంగానే పసిపిల్లలను బలి చేస్తున్నారు.

మనిషి జీవితంలో బాల్యం అనేది వెలకట్టలేని ఒక విలువైన దశ. పిల్లలు పెద్ద వారి కంటే సులువుగా మోసానికి, దాడికి, దోపిడికి, వేధింపులకు గురవుతారు. ప్రతి పిల్లవాడు ఎవరికి వారే ప్రత్యేకం. పిల్లలను జాతీయ సంపదగా పరిగణించాలి. పిల్లల రక్షణ బాధ్యత మనందరిదిగా గుర్తించాలి. దేశంలో బలమైన చట్టాలు ఉన్నప్పటికీ మానవ మృగాలు చిగురుటాకులను చిదిమేస్తూ వికృత ఆనందం పొందుతున్నారు. మధుర, నిర్భయ, అసిఫాలపై జరిగిన తరహా లైంగిక దాడులు భవిష్యత్తులో జరగకుండా కఠినంగా వ్యవహరించాల్సిందే. లైంగిక దాడులను ప్రోత్సహిస్తున్న వారిపై, పాల్పడిన వారిపై కఠిన శిక్షలు అమలు పరచాలి. ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండడానికి చట్టాలపై పూర్తి అవగాహన కల్పించాలి. పోక్సో చట్టం అమలులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలి. చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కామ పిశాచాల మనస్తత్వం పై యుద్ధం ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాలలపట్ల లైంగిక వేధింపులపై సమాజంలో మార్పు రావాలి.

డా॥ అట్ల శ్రీనివాస్ రెడ్డి,
ఫ్యామిలీ కౌన్సెలర్, హైదరాబాద్
మొబైల్ : 97039 35321

# ఆటలో గవ్వలు సరిగ్గా పడాలి



శ్రీరమణ

అక్షర తూణీరం



ఎంతో లోకానుభవం ఉన్న ఒక మహాకవి '... అధికారాంతమునందు చూడవలె ఆ అయ్య సౌభాగ్యముల్' అంటూ పద్యం నాలుగో పాదాన్ని ముగించాడు. అదొక సామెతలా జనంలో మిగిలిపోయింది. చంద్రబాబు విమానం టేకాఫ్ కాగానే, సెల్‌ఫోన్ ఎయిరోప్లేన్ పంథాలోకి వెళ్లగానే నలుగురు తెలుగు తమ్ముళ్లు పచ్చచొక్కాలు విసర్జించి కాషాయ కండువాలు ధరించారు. మోదీ మాత్రమే ఈ దేశాన్ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఉద్ధరించగలరనే ఏకాభిప్రాయం కలిగిందని వినమ్రంగా చెప్పారు. విమానంపైకి లేచిందో లేదో నలుగురు రాజ్యసభ సభ్యుల మెదళ్లలో జ్ఞానదీపాలు ఒక్కసారిగా వెలిగాయి. మాకు మా దేశం, అంతకంటే ముందు మా సొంత గడ్డ, దానికంటే ముందు మా ప్రజ ముఖ్యమనిపించింది. ఇన్నాళ్లూ జరిగిన అనైతిక చర్యలకు వగచి, చింతించి, బాధపడి, కంటకళ్లు పెట్టుకున్నారు. మా పశ్చాత్తాపాన్ని పెద్దమనసుతో అర్థం చేసుకోండి. రోజుకి ఆరు లీటర్ల మినరల్ వాటర్ తాగే వాళ్లం ప్రాయశ్చిత్తంగా అరలీటరు సాదా పానీతో సరిపెట్టుకోవడానికి నలుగురం నిర్ణయించుకున్నాం. చంద్రబాబే మా తండ్రి, చంద్రబాబే నేత, చంద్ర బాబే మా గురువు. ఆయనకి ముందుగానే మా నిర్ణయం విన్నవిద్దామని మేము సిద్ధపడ్డాం. గురు కటాక్షం లేక అది సాధ్యపడలేదు. మిగిలిన అరకొర, అడుగుబొడుగు తెలుగు తమ్ముళ్లు మేమంతా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుని ఇలా సన్యసించి కాషాయం లోకి కన్వర్ట్ అయ్యారని ఒక పుకారు లేపారు. అంతా వట్టిది. బీజేపీ తీర్థం పుచ్చుకున్నందున డబ్బు కరువు తీరుతుందా?' అని ఆ నలుగురూ సూటిగా ప్రశ్నిస్తున్నారు. మిగిలిన ఇద్దరూ కూడా చేరిపోతా రని, మంచిరోజు దొరక్క ఆగారని ఒకమాట చక్కర్లు కొడుతోంది.

అసలీ రాజ్యసభ సభ్యత్వాలు వాటి గడువులు పెద్ద పజిల్. సామాన్యులకు, మనలాంటి వాళ్లకి గడువులు వాటి గొడవ అంతుపట్టదు. లాటరీ అంటారు, కాలం తీరిందంటారు, అధిక మాసాలంటారు.. అంతా అయోమయంగా ఉంటుంది. మరో వైపు ఓడిపోయిన తెలుగు దిగ్గజాలు పది పదిహేను మంది, ఒకచోట గుమికూడి ఓ రోజల్లా మంతనాలు సాగించారు. కాకినాడ కేంద్రంగా సాగిన ఈ రహస్య సమాలోచనలు కూడా బాబు విమానం గాల్లోకి లేచీ లేవగానే! 'అబ్బే! రహస్యం ఏముందిందులో. అసలు రామరాజ్యానికి దీటుగా సాగిన బాబు పాలనకి ఇట్టి దుర్గతి ఎందుకు పట్టిందో చర్చించాం. చర్చల ఫలితాలు మా నేతకి చెప్పాలని నివేదిక సిద్ధం చేస్తున్నాం' అని చెబుతున్నారు. పాపం పుణ్యం కాకినాడ గ్రామ దేవతలకి తెలియాలి.

చంద్రబాబు బ్రహ్మాండంగా ఓడిపోవడం మాట అలా ఉంచి, ఆయన వాచాలత్వం వల్ల సమీకరణాలన్నీ అద్దాలు పగిలినట్టు పగిలాయి. మోదీ సర్కార్ భూస్థాపితం కాబోతోందని బాబు భవిష్యవాణిని వినిపించారు. అసలు ఒకటి మాట్లాడి ఒకటి పేలలేదని లేదు. మోదీ జ్ఞాపకశక్తి ఇంకా మసకబారలేదు. ఆయనపై వ్యక్తిగత విమర్శలకు కూడా వెళ్లారు. ఏంలేదు. రేపు అన్ని రాష్ట్రాలలో స్థానిక పార్టీలు విజయదుందుభులు మోగిస్తాయనీ, టీడీపీ సంగతి చెప్పనే అక్కర్లేదనీ బాబు కలలు కన్నారు. తెలుగు తమ్ముళ్లకి అనగా చినబాబుకి స్టేట్ అప్పగించి పెదబాబు ఢిల్లీలో చక్రం తిప్పాలని ఉవ్విళ్లూరారు. అసలు దేశ భవిష్యత్తంతా లోకల్ పార్టీలదేనని శంఖం పూరించారు. చంద్రబాబు తన నలభై ఏళ్ల రాజకీయ అనుభవం గురించి పదే పదే బెదిరించేవారు. అనుభవం కంటే ప్రపంచ తంత్రం గుర్తెరిగి ప్రవర్తించడం అసలైన విజ్ఞత. ఏ మాత్రం అనుభవం లేకపోయినా ఇందిరాగాంధీ దేశాన్ని తిరుగులేకుండా ఏలింది.

ప్రజారాజ్యానికి ఎమర్జెన్సీ ఏమిటో, ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా చూపించింది. ఇందిర శకంగా ముద్ర వేసుకుంది. అందాకా దేనికి ఎన్టీఆర్ పేపర్ చదవడం, రాజకీయాలు చెవిన వేసుకోవడం లాంటి దురలవాట్లకి దూరంగా ఉండేవారట. ఆయన తల్లి కడుపులో బిడ్డవలె 9 నెలల్లో పరిపూర్ణంగా తయారై గొప్ప నేతగా పేరు తెచ్చుకున్నారు. పరమపద సోపాన పటంలో ఎన్టీఆర్ చంద్రబాబుకి చిక్కి అరుకాసురుడనే పెద్దపాము నోట్లో పడ్డాడు. మొదటి గడికి జారాడు పాపం. ఇప్పుడు అంతకుమించిన మహాసర్పం నోట్లోపడి చంద్రబాబు సోపాన పటం దాటి నేలకి అంటుకున్నాడు. అందుకని ఆటలో అనుభవాలు కాదు, సరైన పందాలు పడటం ముఖ్యం.

(వ్యాసకర్త ప్రముఖ కథకుడు)

# దూరాన్ని పెంచే క్రోధం

ఒకసారి గౌతమ బుద్ధుడు శిష్యులకు కలిగిన అనేక సందేహాలకు చక్కని సమాధానాలతో సంతృప్తిపరిచాడు. శిష్యుల ప్రశ్నలు పూర్తయ్యాక కొన్ని మంచి విషయాలను శిష్యులకు బోధించాడు. క్రోధం వలన మనుషులు ప్రవర్తించే తీరు, సంభాషించే విధానం గురించి శిష్యులకు తెలియపరచాలని భావించిన బుద్ధుడు 'ఇంతవరకు ఎన్నో విషయాలు నేర్చుకున్నారు. ఇప్పుడు మీకో ప్రశ్న.. ఆలోచించి జవాబు చెప్పండి' అన్నాడు. శిష్యులు ఉత్సాహంగా 'తప్పకుండా ప్రయత్నిస్తాము' అన్నారు ఏకకంఠంతో. బుద్ధుడు నవ్వుతూ 'మనుషులు ప్రక్కప్రక్కన లేదా ఎదురెదురుగా ఉన్నప్పటికీ కోపం, ఆవేశం, అసహనం వారిలో ప్రవేశించినప్పుడు తమ సహజ ప్రవర్తన మరచిపోయి ఒకరి మీద ఒకరు బిగ్గరగా శబ్దం చేస్తూ అరుస్తారెందుకు?' అని అడిగాడు. శిష్యులు బాగా ఆలోచించారు కానీ సమాధానం తోచక, మౌనంగా ఉండిపోయారు.

కాసేపటి తరువాత బుద్ధుడు శిష్యులతో "ఈ ప్రశ్నకైనా జవాబుకు ప్రయత్నించండి. ఇద్దరు వ్యక్తులు ప్రేమగా ఉంటే, వారు దూరంగా ఉన్నప్పటికీ ఒకరి మనసులోని భావం మరొకరికి తెలియపరచడానికి కనుసైగ లేదా అంగ విన్యాసం సరిపోతుంది. అవతలి వారు సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. అదెలా సాధ్యం?" అని అడిగాడు. శిష్యులు దానికీ సమాధానం చెప్పలేకపోయారు. "మీరే చెప్పండి గురువర్యా" అన్నారు చివరికి. బుద్ధుడు 'ఒకరి మీద ఒకరికి కోపంగా వున్నప్పుడు వారి హృదయాల మధ్య దూరం పెరుగుతుంది. మనసులు కూడా చాలా దూరం అవుతాయి. భౌతికంగా ఇద్దరూ ప్రక్కప్రక్కనే ఉన్నా బిగ్గరగా అరుస్తూ, దూకుడుగా ప్రవర్తిస్తారు. కేకలు వేస్తూ తమ కోపం వెళ్లగక్కడానికి ప్రయత్నిస్తారు. అలాంటి సమయంలో వారు మనుషులమని మరచిపోయి రాక్షసుల్లా ప్రవర్తిస్తారు' అని చెప్పాడు. శిష్యులు రెండో జవాబు కోసం ఆసక్తిగా చూసారు.

జ్యోతిర్మయం

బుద్ధుడు "ఇద్దరు వ్యక్తులు ప్రేమగా, సయోధ్యతో మెలుగుతూ ఉంటే వారి హృదయాలు, మనసులు దగ్గరగా ఉంటాయి. భౌతికంగా ఒకరికొకరు దూరంగా ఉన్నప్పటికీ మనసులు మాత్రం చేరువగా ఉండడం వలన, బిగ్గరగా మాట్లాడనక్కరలేదు. ఒకరి మీద ఒకరికి ఉన్న అభిమానం కారణంగా అపోహలకు చోటు ఉండదు. అవగాహన శక్తి పెరుగుతుంది. వారి మనసులోని భావాలు చెప్పడానికి ఒక సైగ, అంగ విన్యాసమే సరిపోతాయి" అని చెప్పాడు. కోపం వలన కలిగే దుష్పరిణామాలు, శాంతం, ప్రేమ వలన లభించే ప్రయోజనాలు తెలుసుకుని మానవులు ప్రవర్తించాలని శిష్యులకు బోధపడింది. మనుషుల్లోని క్రోధం కట్టెకు అంటిన అగ్ని లాంటిది. కట్టెను అగ్ని దహించినట్టే, క్రోధం మనుషుల విచక్షణను, ఆలోచనలను దహించి, ప్రవర్తన దిగజారుస్తుంది.

– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083



మా బాధ్యత పెరిగింది
సినిమా పేజీలో...



వేయించుకు తినండి
లోపలి పేజీలో...



గుర్రపుస్వారీ.. కత్తిసాము?
సినిమా పేజీలో...

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ శనివారం
22-6-2019


చెట్టు నీడ

# బతుకు ధ్యాస

**ఆ** రోజు గురువు, తన శిష్యులకు బుద్ధ భగవానుడి అష్టాంగ మార్గాలను వివరిస్తున్నాడు. వారిలో ఒక విద్యార్థి గురువు చెప్పే అంశాలపై దృష్టి నిలపక ఇతర విషయాలు ఆలోచిస్తున్నాడు. అతని ఆలోచన గమనించి ప్రేమపూర్వకంగా మందలించాడు గురువు.



శిష్యునితో ''బౌద్ధ సూత్రాలలో ముఖ్యమైనది ధ్యానం. ధ్యానం అంటే ఏకాగ్రత. మనం చేసే పని మీదనే దృష్టి నిలపడం. బుద్ధభగవానుడు ఈ మార్గం ద్వారానే జ్ఞానాన్ని పొందాడు'' అంటూ ఏకాగ్రత ప్రాముఖ్యతను వివరించాడు గురువు. ఆయన మాటలు విన్న శిష్యుడు ''భంతే! ధ్యానం ద్వారా బుద్ధ భగవానుడు జ్ఞానాన్ని పొందాడు. కానీ సామాన్య ప్రజలకు నిత్యజీవితంలో ఏకాగ్రత వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి'' అని ప్రశ్నించాడు.

గురువు తలపంకించాడు. శిష్యుడితో ''సరే, అలా వెళదాం పద'' అన్నాడు. పరిసరాలను గమనిస్తూ వారలా ముందుకు సాగుతుండగా వారికి ఒక నది కనిపించింది. నది ఒడ్డున కూర్చున్న ఒక జాలరి చేపలు పట్టడానికి నదిలో గాలం వేసి దానిని చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఒక పాము అతడి పక్కగా వెళ్తూ అతని వద్ద ఆగిపోయి, తల పైకెత్తి చూస్తోంది. కానీ అతనికి అదేమీ తెలియడం లేదు. శిష్యుడు ఆ పాము జాలరిని కరుస్తుందేమోనని భయపడ్డాడు. జాలరిని అప్రమత్తం చేయడానికి ముందుకు వెళ్లబోతుండగా పాము అతని పక్కనుండి వెళ్లిపోయింది.

ఇంత జరిగినా అతడు కొంచెం కూడా కదలలేదు. అతని చూపు నదిలో ఉన్న గాలం నుండి మళ్లలేదు. గురువు శిష్యుని వంక చిర్నవ్వుతో చూస్తూ జాలరి సమీపానికి వెళ్లి అతన్ని పిలిచాడు. పలకలేదు. మరల పిలిచాడు. అయినా అతనిలో చలనం లేదు. దగ్గరకు వెళ్లి అతని భుజంపైన తట్టాడు. జాలరి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డట్టు లేచి బౌద్ధ గురువును చూశాడు. వెంటనే వారికి నమస్కారం చేశాడు.

గురువు ఆ జాలరిని.. ''ఏమి ఆలోచిస్తున్నావు నాయనా? మూడుసార్లు పిలిచాను. పలకలేదు. నీ పక్కనుండి పాము వెళ్లినా కనీసం తల కూడా తిప్పలేదు. నీకు పామంటే భయం లేదా?'' అని అడిగాడు. ఆ జాలరి.. ''క్షమించండి. నా చూపంతా చేపలపైన, గాలం పైనే ఉంది. నిజానికి పామంటే నాకు చచ్చేంత భయం. కానీ నా పక్కనుండి వెళ్లినట్లు కూడా తెలియలేదు నాకు. కనీసం శబ్దం సరిగా వినిపించలేదు. అంతగా లీనమైపోయాను. ఎందుకంటే చేపలు దొరక్కపోతే గడవడం చాలా కష్టం. అందువల్ల ఆ ధ్యాసలో ఉన్నాను'' అని చెప్పి మళ్లీ తన పనిలో నిమగ్నమయ్యాడు జాలరి.

గురువు శిష్యుని వంక నవ్వుతూ చూశాడు. శిష్యుడు అర్థమయిందన్నట్లుగా తల పంకించి గురువుకు వినయంగా నమస్కరించాడు.

– కస్తూరి శివభార్గవి

గమనిక

**ని**న్నటి సాక్షి ఫ్యామిలీ చెట్టునీడ ఫీచర్‌లో ప్రచురితమైన 'నాన్న ముద్దులు' వ్యాసంలో వాడిన రేఖాచిత్రం సన్నివేశాన్ని సూచించే రేఖాచిత్రమే తప్ప ప్రవక్తను ప్రతిబింబించేది కాదని తెలియజేస్తున్నాము. అయినప్పటికీ పాఠకులకు కలిగిన సందేహానికి, అసౌకర్యానికి చింతిస్తున్నాము. ఇటువంటి పొరపాటు మరోసారి జరగదని తెలియజేస్తున్నాము.

– ఫీచర్స్ ఎడిటర్

సినిమా

# నా పంచ్ పవర్ చూపిస్తా



● సంజన

**చే**తికి గ్లౌజులు తొడుక్కుని తన పంచ్ పవరేంటో చూపించడానికి రెడీ అవుతున్నారు సంజన. ఈ పంచ్‌లు ఎవరి మీద పడతాయో వేచి చూడాలి. అరుణ్ విజయ్ హీరోగా తమిళంలో తెరకెక్కుతున్న చిత్రం 'బాక్సర్'. వివేక్ కణ్ణన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో సంజన హీరోయిన్. శుక్రవారం ఈ చిత్రం ప్రారంభమైంది. ఇందులో హీరోహీరోయిన్లు ఇద్దరూ బాక్సర్స్‌గా కనిపిస్తారు. ఈ సినిమా ద్వారా తమిళ పరిశ్రమకు పరిచయం అవుతున్నారు సంజన. ''ఇందులో నటనకు బాగా స్కోప్ ఉన్న పాత్ర నాది. ఇంతకు ముందు సినిమాల కోసం నేర్చుకున్న గుర్రపు స్వారీ, నా ఫిజిక్ ఈ సినిమాకి అవకాశం వచ్చేలా చేశాయి. ఈ సినిమాలో నా పాత్రను చూసి కచ్చితంగా షాక్ అవుతారు. సరికొత్త అవతారంలో కనిపించబోతున్నాను'' అన్నారు సంజన. ఈ సినిమా కాకుండా రెండు కన్నడ చిత్రాలు, ఓ తమిళ వెబ్ సిరీస్‌తో సంజన బిజీగా ఉన్నారు.

వెబ్ ఫ్లిక్స్



వనితా విముక్తి కేంద్రంలో షాలినీ (హుమా ఖురేషీ)

# 2047లో ఊపిరి ఆడదా?

**స్వాతంత్య్రం వచ్చిన వందేళ్లకు.. ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా.. మానవహక్కుల పరిరక్షణలో నంబర్‌వన్‌గా.. భావప్రకటనకు తలమానికంగా.. స్త్రీ, పురుష సమానత్వంలో ముందంజగా ఉంటుందని మన విశ్వాసం! కాని ఒక సమాజంగా మనం వెనకబడిపోతున్నామని.. శీలమనే గోడల మధ్య బందీ అవుతామని.. స్వేచ్ఛకు ఊపిరాడదనీ.. ఇలాంటి భావవ్యక్తీకరణల్లో ఈ కథనం ముందంజలో ఉంది.**

2047... ఆర్యావర్త ప్రాంతం... మిలిటరీ తరహా ప్రభుత్వ పాలన..

నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న దేశం. అలాంటి సహజ వనరులను తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి.. ఆ ప్రాంతాన్ని పూర్తిగా హిందూ దేశంగా.. ఆర్యావర్తగా మార్చే ప్రయత్నం మొదలై.. అది కొంత సఫలమై అప్పటికి మూడేళ్లు. హిందువుల్లో కూడా మళ్లీ కుల విభజన, వర్గ విభజన ఆ పాలన నైజం. అందుకే ఎటు చూసినా సెక్టార్లు.. హద్దులుగా పెద్ద పెద్ద గోడలు. అగ్ర కులాలు.. అందునా ఉన్నత ఉద్యోగులకు.. ఒక సెక్టార్.. నిమ్న కులాలు.. వర్కింగ్ క్లాస్‌కు ఇంకో సెక్టార్.. దళితులకు ఆ హద్దులన్నిటికీ ఆవల.. స్లమ్స్‌లో నివాసం. ఈ ఆర్యావర్త ప్రభుత్వం వాళ్లకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూంటుంది. చాలా పరిమితంగా. ఒకరకంగా చెప్పాలంటే వెలివాడలవి.

స్త్రీలు... అందునా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న మహిళలైతే బానిసలు. అలా పెళ్లిళ్లు చేసుకున్న, తమ హక్కుల కోసం గొంతెత్తిన ఆడవాళ్లను వెదికి మరీ పట్టుకొచ్చి ''వనితా విముక్తి కేంద్రం''లో పెడ్తారు. ఆ ఆడవాళ్లు తమ పవిత్రతను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. ప్రతిరోజూ జవాన్ల బూట్లు తుడవాలి. ఉన్నతులైన పురుషులు తిన్న ఎంగిలి విస్తళ్లల్లో పొర్లుదండాలు పెట్టాలి. తొట్టిలోని మురికి నీటిలో స్నానం చేయాలి. ఆ మానసిక హింస గాయపెట్టకుండా పూట పూటకు స్టెరాయిడ్స్‌లాంటి మాత్రలు వేసుకోవాలి. ఇవన్నీ మౌనంగా సహిస్తూ.. క్రమశిక్షణ పాటిస్తున్న వాళ్లను పవిత్రతను నిరూపించుకునే పరీక్షకు ఎంపిక చేస్తారు. అలా నిరూపించుకున్న వాళ్లను విముక్తులను చేసి బయటకు అంటే వాళ్ల తల్లిదండ్రుల దగ్గరకు పంపిచేస్తారు. ఫెయిలైన వాళ్లను లేబర్ క్యాంప్‌కు తరలిస్తారు.

పిల్లలు.. ఆర్యావర్త సంస్కృతీ, సంప్రదాయాలకు సారథులు.. వారధులు. కులాంతర, మతాంతర వివాహాల వల్ల పుట్టిన పిల్లలను సంకరజాతిగా పరిగణించి.. ''ప్రాజెక్ట్ బలీ'' అనే ఆర్యావర్త ప్రభుత్వ కార్యక్రమం కోసం ఉపయోగిస్తుంటారు.

తిరోగమనమా? పురోగమనమా? అనిపిస్తోంది కదా! ఇప్పటి కొన్ని పరిస్థితులకూ అద్దం పడ్తోందన్న మాటా వినిపిస్తోంది. ఇది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'లేలా' అనే వెబ్‌సిరీస్ కథ. ప్రయాగ్ అక్బర్ (బీజేపీ మాజీ మంత్రి, లైంగిక వేధింపుల ఆరోపణ లున్న ఎమ్‌జె అక్బర్ కొడుకు) రాసిన నవలను అదే పేరుతో తెరకెక్కించారు ప్రముఖ సినీ దర్శకురాలు దీపా మెహతా.

## లేలా...

షాలిని (హుమా ఖురేషీ)... బాగా చదువుకున్న, ప్రొగ్రెసివ్ థాట్స్ ఉన్న ఒక హిందూ స్త్రీ. రిజ్వాన్ చౌదరి(రాహుల్ ఖన్నా) అనే ముస్లిం యువకుడిని ప్రేమించి పెళ్లిచేసుకుంటుంది. వాళ్లకు పుట్టిన బిడ్డే లేలా. ఆ బిడ్డ కోసం షాలినీ అన్వేషణే ఈ సిరీస్.

మంచి ఉద్యోగాలు చేస్తూ.. ఏ లోటూ లేకుండా ప్రశాంతంగా... కూతురే లోకంగా బతుకుతూంటారు షాలినీ, రిజ్వాన్‌లు. అప్పటికే ఆర్యావర్త ప్రభుత్వం ఏర్పడి యేడాది అవుతుంది. ఒకరోజు.. ఇంట్లోని స్విమ్మింగ్ పూల్‌లో షాలిని, రిజ్వాన్‌లు తమ కూతురు లేలాకు ఈత నేర్పిస్తుంటే దుండగులు జొరబడి రిజ్వాన్ తల బాది.. షాలినీని ఎత్తుకుపోతారు. ఈ హఠాత్పరిణామానికి బిక్కచచ్చిపోతుంది నాలుగేళ్ల లేలా. స్విమ్మింగ్ పూల్‌లో రిజ్వాన్ అచేతనమైపోతాడు.

## రెండేళ్లు..

షాలినీని వనితా విముక్తి కేంద్రంలో పెడ్తారు. అన్నీ సహిస్తూనే అక్కడి నుంచి పారిపోవడానికి దారి వెదుకుతూంటుంది ఆమె. అంతలోకే కులాంతర వివాహం చేసుకుందని ఇంకో అమ్మాయినీ తీసుకొస్తారు అక్కడికి. వీళ్లతోపాటు ఒక లేడీ డాక్టర్, ఆస్తి హక్కు కోసం తల్లిదండ్రుల మీద కేసు పెట్టిన మహిళ.. కులాంతర వివాహం చేసుకొని చంటిబిడ్డలతో సహా పట్టుకొచ్చిన తల్లులూ ఉంటారు ఆ కేంద్రంలో. వీలైనంత త్వరగా ప్యూరిటీ టెస్ట్ పెట్టించుకొని అక్కడి నుంచి వెళ్లిపోవాలనుకుంటున్న ఒక మహిళ.. ఆ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న గురుమా (పురుషుడే)కు ఇన్‌ఫార్మర్‌గా మారుతుంది. ఈ క్రమంలో ఆ కేంద్రంలోని చంటి పిల్లల ప్యూరిటీ టెస్ట్ కోసం ఓ వైద్యబృందం వస్తుంది. ఒక బిడ్డ రక్తనమూనాల్లో తల్లితోపాటు తక్కువ కులంలోని తండ్రి రక్తమూ ఉందని ఆ పసికందును తీసుకెళ్లిపోతారు. ఆ పాప ప్రక్షాళన కోసం ఆమెకు కుక్కతో పెళ్లి జరిపిస్తారు. ఆ అవమానం తట్టుకోలేక ఆమె ఆ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇది సద్దుమణిగేలోపే కులాంతర వివాహం చేసుకున్న ఆ కొత్త బందీ ప్రెగ్నెంట్ అని తేలుతుంది. గురుమాకు తెలిసి అబార్షన్ చేయమని లేడీ డాక్టర్‌కు ఆర్డర్ వేస్తాడు. చేశానని చెప్తుంది కాని డాక్టర్.. అబార్షన్ చేయదు. దీన్ని ఆ ఇన్‌ఫార్మర్ పసిగట్టి.. గురుమాకు చెప్పబోతుంటే ఆమెను బాత్రూమ్‌లో బంధించి ఆ అవకాశాన్ని తాను ఉపయోగించుకుని ప్యూరిటీ టెస్ట్‌తో బయట పడాలనుకుంటుంది షాలిని. వెళ్లి గురుమాకు చెప్తుంది ఆ కొత్తమ్మాయికి అబార్షన్ జరగలేదు అని. నిజం చెప్పి షాలిని.. ఆర్యావర్తకు అభిమాన పాత్రురాలైందని.. తెల్లవారే ఆమె ప్యూరిటీ టెస్ట్‌కు ఏర్పాట్లు చేస్తాడు గురుమా. ఆ టెస్ట్‌లో లేడీ డాక్టర్‌ను, ఆ కొత్త బందీని రెండు వేర్వేరు సెల్స్‌లో పెడ్తారు. షాలినికి ఒక డివైజ్ ఇచ్చి... బటన్ నొక్కమని చెప్తాడు గురుమా. ఆ బటన్ నొక్కితే ఆ ఇద్దరూ ఉన్న సెల్స్‌లోకి గ్యాస్ విడుదలై వాళ్ల ప్రాణాలు గాల్లో కలుస్తాయి. షాలిని విముక్తురాలై బయటకు వెళ్లిపోతుంది. షాలిని.. ఆ పని చేయదు. దాంతో ఆ ఇన్‌ఫార్మర్‌ను పిలిపిస్తాడు గురుమా. ఈ చాన్స్ కోసమే ఎదురు చూస్తున్న ఆ మహిళ.. వెంటనే బటన్ నొక్కుతుంది. గ్యాస్ విడుదలై ఆ ఇద్దరూ చచ్చిపోతారు. రెండేళ్లు అందులో మగ్గిన షాలినీని.. ప్యూరిటీ టెస్ట్ ఫెయిలయిందని లేబర్ క్యాంప్‌కు పంపిస్తారు. ప్యూరిటీ టెస్ట్ పాసైనా ఆ ఇన్‌ఫార్మర్‌ను వనితా విముక్తి కేంద్రంలోనే ఉంచుతారు. ఆమెను తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు, అన్న, తమ్ముడు రాలేదని. బయటకు వెళితే స్త్రీకి రక్షణ ఉండదని.

## లేబర్ క్యాంప్

విముక్తి కేంద్రం నుంచి లేబర్ క్యాంప్‌కు తీసుకెళ్తున్నప్పుడే తప్పించుకుని తన కూతురి కోసం రిజ్వాన్ తల్లిదండ్రుల దగ్గరకు వెళ్తుంది షాలిని. కూతురు అక్కడ ఉండకపోగా షాలిని మరిది.. ఆమె మీద విరుచుకుపడ్తాడు. ''నువ్వు మా అన్నను పెళ్లి చేసుకోవడం వల్లే ఇదంతా జరిగింది'' అంటూ. విస్తుపోతుంది అతని ప్రవర్తనకు. ఈలోపు లేబర్ క్యాంప్ గార్డ్ భాను (సిద్దార్థ) ఈ ఇంటికి వచ్చి షాలినీని తీసుకొని వెళ్లిపోతాడు. లేబర్ క్యాంప్ ద్వారా ఆమెకు ఒక ఇంజనీర్ ఇంట్లో సర్వెంట్ ఉద్యోగం దొరుకుతుంది. నగరానికి ఎయిర్ కండిషన్ డోమ్స్‌ను ఏర్పాటు చేయడానికి ఆ ఎన్ఆర్ఐ ఇంజనీర్‌ను అమెరికా నుంచి రప్పిస్తుంది ప్రభుత్వం. ఆ ఏసీ డోమ్స్ వల్ల విపరీతమైన వేడి పుట్టి.. రేడియేషన్‌కు చుట్టుపక్కల ఉన్న స్లమ్స్ అన్నీ మాడి మసైపోతాయని.. ఇది ఒకరకమైన మారణహోమం అని.. దాన్ని ఎలాగైనా ఆపాలని.. ఆర్యావర్త సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్న విప్లవకారులను కోరుతాడు ఆ ఇంజనీర్. వాళ్లతో రహస్య సంబంధాలు పెట్టుకుంటాడు. వాళ్లలో ఒకడే భాను. ఆర్యావర్త ప్రణాళికలను తెలుసుకోవడానికి లేబర్ క్యాంప్ గార్డ్‌గా పనిచేస్తుంటాడు. ఆ నిజం షాలినీకి తెలుస్తుంది. సహకరిస్తే.. ఆమె కూతురును వెదకడంలో సహాయం చేస్తానంటాడు భాను. అసలామె వనితా విముక్తి కేంద్రానికి రావడానికి.. ఆ సిబ్బందికి ఉప్పందించింది ఆమె మరిదేననే సీక్రెట్ కూడా చెప్తాడు. హతాశురాలవుతుంది షాలిని. ఇంకోవైపు ఎయిర్‌కండిషన్ డోమ్స్‌ను తయారు చేస్తున్న ఇంజనీర్ మీద అనుమానం వచ్చి అతని కుటుంబాన్నీ చంపేయిస్తుంది ఆర్యావర్త ప్రభుత్వం. ఎలాగైనా ఆ మారణహోమాన్ని ఆపాలని.. ఆ ప్లాన్ వివరాలు ఆర్యావర్త ప్రభుత్వాధినేత జోషి తర్వాత వ్యక్తి అయిన రావు ఆఫీస్‌లో ఉంటాయని.. అది తమకు అందివ్వాలని చెప్తాడు భాను. అందుకు ఆమెను రావు ఇంట్లో సర్వెంట్‌గా చేరుస్తాడు.



'లేలా'లోని వర్కింగ్ సెక్టార్ సన్నివేశం

## రావుగారింట్లో..

ఆర్యావర్త ప్రభుత్వం బ్యాన్‌చేసిన పాకిస్తానీ కవి, రచయిత.. ఫైజ్ అహ్మద్‌ఫైజ్‌కు వీరాభిమాని.. రావు. రహస్యంగా ఫైజ్ పాటలను వింటూంటాడు. ఈ బలహీనతను అడ్డం పెట్టుకుని భాను అడిగిన వివరాలను లాగొచ్చని అనుకుంటుంది షాలినీ. శ్రద్ధగా పనిచేస్తూ.. అతని అనుంగు సేవకులలో ఒకరిగా చేరుతుంది. చాటుగా ఫైజ్ పాటలను తెచ్చిస్తూ అతని నమ్మకాన్ని సంపాదిస్తుంది. ఆ చనువుతో ఆమె గతాన్ని తెలుసుకుంటాడు అతను. కూతురు లేలీ గురించీ చెప్పేస్తుంది. జాలిపడ్తాడు రావు. ఆర్యావర్త పట్ల తనకున్న అసమ్మతినీ వెళ్లగక్కుతాడు. ఈ చాన్స్‌ను ఉపయోగించుకుందామని షాలినీ ప్లాన్ చేసుకునే లోపే.. షాలినీకున్న కూతురి బలహీనతను తన రాజకీయ ఎత్తుగడకు వాడుకుందామనుకుంటాడు. కూతురి ఆచూకీ పట్ల ఉన్న తన ఆరాటాన్ని, తపనను.. అటు విప్లవకారులు.. ఇటు రాజకీయ నేతలు పావుగా మలచుకుంటున్న తీరుకు కుమిలిపోతుంది షాలిని. కాని తప్పదు.. బిడ్డ ముఖ్యం అని మనసును స్థిరం చేసుకుంటుంది. ఈ వేటలో లేలా ఎక్కడో కాదు.. ఇంతకు ముందు తనకు సర్వెంట్‌గా పనిచేసిన అమ్మాయి ఇంట్లోనే ఉందని తెలుస్తుంది. ఆ సర్వెంట్ కుటుంబం ఇప్పుడు బాగా సంపన్న కుటుంబంగా మారిపోతుంది. తన కూతురి పేరు విజయా యాదవ్‌గా మార్చేస్తుందా సర్వెంట్. ఆమె భర్త జోషీకి పీఏగా ఉంటూంటాడు. రావు ఇంట్లోని ఆఫీస్‌కు వస్తూంటాడు. ఒకసారి రాత్రి పూట.. రావు ఆఫీస్‌లో ఎయిర్ కండీషన్స్ డోమ్స్ ఆపరేషన్ ఫైల్స్‌ను ఫోటో తీస్తుంటే చూస్తాడు. కూతురిని మరచిపోతే కాపాడ్తానని, లేదంటే జైలే అని బెదిరిస్తాడు. సరే అన్నట్టుగా తలూపుతుంది షాలినీ. భానుకి అన్నీ చెప్తుంది. త్వరలోనే షాలిని కూతురు చదువుతున్న స్కూల్లో ఫంక్షన్ ఉంటుంది. అక్కడ గ్యాస్ బాంబ్‌ను ప్రయోగించమని ఆ బాంబ్‌ను షాలినీకిస్తాడు భాను. తను క్రిమినల్‌ను కాదని.. అలాంటివి చేయలేనంటుంది. కూతురు కావాలంటే తప్పదు అని హెచ్చరిస్తాడు. బాంబ్ తీసుకొని ఫంక్షన్‌కు వెళ్తుంది. దానికి ఆర్యావర్త అధినేత జోషీ వస్తాడు. అతనిని సన్మానించే వాళ్ల జాబితాలో ఆమె పేరూ పెడ్తాడు రావు. సన్మానం పేరుతో జోషీ దగ్గరకు వెళ్లిన షాలినీ తన చేతిలోని బాంబును చూపించి అతణ్ణి బెదిరిస్తుంది. పోలీసులు వస్తారు. అక్కడితో ఫస్ట్ సీజన్ ఎండ్! ●


రేపటి 'ఫన్‌డే'లో..!

**మంచివాడి గమ్యం ఎటువైపు?:** మంచివాడికి ఏడుపొచ్చింది. ''మరైతే నేను చావడానికి తప్ప మరి ఎందుకూ పనికిరానా?!'' అంటూ సముద్రం వైపు పరిగెట్టేడు. అక్కడ ఒడ్డున నిశ్చేష్టుడై నిలబడిపోయేడు. చీకట్లో సముద్ర కెరటాలు ''నువ్వు చావుకి'' అంటూ పైకి లేచి ''ఫ్నుక్కి రావ్'' అంటూ గభీమని విరిగి ''నువ్వు చావనూకూడా లేవుస్మా'' అనే అర్థంలో మాటల్ని విరిచి విరిచి అతనికి సుస్పష్టంగా తెలిసేట్టుగా అరిచి అరిచి చెప్పేయి. చావడానిక్కూడా పనికిరానివాడైన ఆ మంచివాడి గమ్యం ఎటువైపు సాగింది? రేపటి 'ఫన్ డే'లో చదవండి ఈవారం కథ ''ఓ మంచివాడి కథ''.



**మామయ్య తలకు ఏమైంది?:** మామయ్య ఉద్యోగం బాగుంది. లండన్, ప్యారిస్, టోక్యో, పెర్త్, ఢిల్లీ, బొంబాయి, కైరో, మాస్కో... ఇలా ఎన్నో ప్రాంతాలు తిరుగుతున్నాడు. రోజుకు మూడు నిమిషాల పని. మృష్టాన్న భోజనం.

ఇంతకీ మామయ్య ఉద్యోగం ఏమిటి? సర్కస్‌లో ఆట – సర్కస్ పని. పులి నోట్లో నోరు పెట్టడం. వెరీ ఈజీ. ఒక్కసారి నోరు తెరుస్తుంది. ఒక్క నిమిషం గుండె దిటవు చేసుకుని పులినోట్లో బుర్ర పెడితే చాలు. మళ్లీ రింగ్ మాస్టర్ ఈల వెయ్యగానే బుర్ర తీసెయ్యడం.

మరి పులి నోట్లో పెట్టిన మామయ్య తలకు ఏమైంది? చదవండి రేపటి 'ఫన్ డే'లో 'కథాప్రపంచం'లోని 'మామయ్య తల'.


గుడ్‌ఫుడ్

# పోషకాల పవర్‌హౌజ్!

**చా**లా చవకగా ఆరోగ్యాన్ని సంపాదించుకోడానికి జామ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలకు కొదవే లేదు. అందుకే ఈ పండును 'పోషకాల పవర్‌హౌజ్' అంటారు. వంద గ్రాముల జామపండులో 68 క్యాలరీలు ఉంటాయి. అంతే కాదు... ఇందులో క్యాల్షియమ్, మెగ్నీషియమ్, ఫాస్ఫరస్, పొటాషియమ్ వంటి ఖనిజాలూ పుష్కలంగా ఉంటాయి. జామతో కలిగే ఆరోగ్య ప్రయోజనాల్లో ఇవి కొన్ని మాత్రమే.

జామలో విటమిన్–సి చాలా ఎక్కువ. ఇది చాలా శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ కావడంతో ఎన్నో వ్యాధులను నివారిస్తుంది. ఒంటికి వ్యాధి నిరోధక శక్తిని సమకూరుస్తుంది.

జామ అనేక రకాల క్యాన్సర్లను నివారిస్తుంది. జామలోని యాంటీ ఆక్సిడెంట్స్ ఇందుకు దోహదం చేస్తాయి. ముఖ్యంగా ప్రోస్టేట్, రొమ్ముక్యాన్సర్ల నివారణకు బాగా ఉపయోగపడుతుంది.



జామ గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువ. అందుకే డయాబెటిస్ ఉన్నవారు దీన్ని నిరభ్యంతరంగా తినవచ్చు.

పీచుపదార్థాలు చాలా ఎక్కువ కావడం వల్ల ఇందులో జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పీచుపదార్థాలే ఒంట్లో చక్కెరను నెమ్మదిగా విడుదలయ్యేలా చేస్తాయి. అందువల్ల కూడా ఇది డయాబెటిస్ ఉన్నవారికి ఉపయుక్తమైన పండుగా పేరొందింది.

దీనిలో పీచుపదార్థాలు పుష్కలంగా ఉండటం వల్ల మలబద్ధకాన్ని సమర్థంగా నివారిస్తుంది. విరేచనం సాఫీగా అయ్యేందుకు తోడ్పడుతుంది.

జామలో పొటాషియమ్ కూడా ఎక్కువే. పొటాషియమ్ రక్తపోటును అదుపు చేస్తుందన్న విషయం తెలిసిందే. అందుకే హైబీపీ నియంత్రణకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

జామపండు ఒంట్లోని ట్రైగ్లిజరైడ్స్, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) వంటి వాటిని అదుపు చేయడంతో పాటు, ఒంటికి మేలు చేసే మంచి కొలెస్ట్రాల్ పెరగడానికి తోడ్పడుతుంది.

జామలో క్యాల్షియమ్, ఫాస్ఫరస్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇది ఎముకల పటిష్టపరుస్తుంది. ఎముకల ఆరోగ్యానికి దోహదపడుతుంది.

జామపండులో విటమిన్–బి6, విటమిన్ బి3 వంటి పోషకాలు పుష్కలంగా ఉండటం వల్ల అవి మెదడులోని న్యూరాన్ల పనితీరును మెరుగుపరుస్తాయి. అందువల్ల జామపండు తినేవారిలో మెదడు చురుగ్గా ఉంటుంది. డిమెన్షియా, అల్జైమర్స్ వంటి జబ్బులను నివారించడానికి కూడా జామ తోడ్పడుతుంది.

జామపండ్లను తినేవారిలో పంటి, చిగుర్లకు సంబంధించిన వ్యాధులు చాలా తక్కువ.

ఇందులో ఫోలిక్‌యాసిడ్ పుష్కలంగా ఉండటం వల్ల డాక్టర్లు దీన్ని గర్భిణులకు సిఫార్సు చేస్తుంటారు. కడుపులోని బిడ్డ తాలూకు నాడీ వ్యవస్థ ఆరోగ్యకరంగా అభివృద్ధి అయ్యేందుకు జామ తోడ్పడుతుంది.

ఆరోగ్యకరమైన, నిగారింపుతో కూడిన మెరిసే చర్మం కోసం జామ బాగా ఉపయోగపడుతుంది. ఏజింగ్ ప్రక్రియనూ ఆలస్యం చేస్తుంది.

బరువు తగ్గాలనుకునేవారికి జామ అనేక విధాల తోడ్పడుతుంది. ఇందులోని తక్కువ చక్కెర పాళ్లు, పీచు వంటి అంశాలు వేగంగా బరువు తగ్గడానికి తోడ్పడతాయి. ●




## ఈ పాటకు ట్యూన్ తెలుసా?




(నేడు ఎల్.వి.ప్రసాద్ వర్ధంతి)

**పల్లవి :**
ఏమిటో ఈ మాయా...
ఓ చల్లని రాజా వెన్నెలరాజా
ఏమిటో నీ మాయా...
ఓ చల్లని రాజా వెన్నెలరాజా
ఏమిటో నీ మాయా...

**చరణం : 1**
వినుటయె కాని వెన్నెల మహిమలు (2)
అనుభవించి నేనెరుగనయా (2)
నీలో వెలసిన కళలు కాంతులు (2)
లీలగ ఇపుడే కనిపించెనయా
॥ఏమిటో॥

**చరణం : 2**
కనుల కలికమిడి నీ కిరణములే (2)
మనసును వెన్నగ చేసెనయా (2)
చెలిమి కోరుచూ ఏవో పిలుపులు (2)
నాలో నాకే వినిపించెనయా
॥ఏమిటో॥

చిత్రం : మిస్సమ్మ (1955)
రచన : పింగళి నాగేంద్రరావు
సంగీతం : సాలూరి రాజేశ్వరరావు
గానం : పి.లీల

కట్‌చేయ్‌...దాచేయ్‌...

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | | 5 | | | 4 | | |
| 1 | 6 | 3 | | 4 | | | 7 | |
| | 4 | 2 | 7 | 9 | | | | 6 |
| 4 | | 8 | 6 | 2 | 9 | | 1 | |
| | | | | | | | | |
| | 1 | | 3 | 5 | 8 | 2 | | 4 |
| 8 | | | | 3 | 7 | 6 | 5 | |
| | 9 | | | 1 | | 8 | 2 | 7 |
| | | 1 | | | 5 | | | 3 |

**నిబంధనలు:**
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 4 | 6 | 3 | 2 | 9 | 8 | 7 |
| 7 | 9 | 8 | 5 | 1 | 4 | 2 | 3 | 6 |
| 6 | 2 | 3 | 7 | 9 | 8 | 5 | 1 | 4 |
| 3 | 4 | 2 | 1 | 7 | 5 | 6 | 9 | 8 |
| 9 | 8 | 5 | 2 | 4 | 6 | 3 | 7 | 1 |
| 1 | 6 | 7 | 3 | 8 | 9 | 4 | 5 | 2 |
| 2 | 5 | 1 | 9 | 6 | 7 | 8 | 4 | 3 |
| 8 | 3 | 9 | 4 | 2 | 1 | 7 | 6 | 5 |
| 4 | 7 | 6 | 8 | 5 | 3 | 1 | 2 | 9 |

# వేయించుకు తినండి



ఇలా అయినా వానలు బాగా పడతాయని
కిచెన్‌లో చేస్తున్న హోమమిది.
తిన్నంతసేపూ ఎండని మరచిపోతాం.
ఎందుకంటే వేయించుకుని తింటే వేడివేడిగా ఉంటుంది.
వేడివేడిగా ఉన్నప్పుడు వానపడాలని కోరుకుంటాం కదా...
మీ మనోవాంఛా ఫల సిద్ధిరస్తు!

## రా బనానా అండ్ కోకోనట్ కచోరీ



**కావలసినవి:** అరటికాయలు – 4 (పెద్దవి); బియ్యప్పిండి – 3 టేబుల్‌స్పూన్లు; ఉప్పు – తగినంత; పచ్చి మిర్చి తరుగు – ఒక టేబుల్ స్పూన్

**ఫిల్లింగ్ కోసం:** వేయించిన పల్లీల పొడి – 4 టేబుల్ స్పూన్లు; పచ్చి మిర్చి పేస్ట్ – ఒక టేబుల్ స్పూను; తాజా కొబ్బరి తురుము – ఒక కప్పు; కిస్‌మిస్ – ఒక టేబుల్ స్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు; ఉప్పు – తగినంత; పంచదార – 2 టేబుల్ స్పూన్లు; జీలకర్ర – అర టీ స్పూను; నిమ్మ రసం – ఒక టేబుల్ స్పూను; కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్లు; నూనె – డీప్ ఫ్రైకి సరిపడా.

**యోగర్ట్ కోసం:** పెరుగు – 100 గ్రా.; ఉప్పు – తగినంత; పంచదార – 2 టేబుల్ స్పూన్లు; వేయించిన పల్లీల పొడి – 2 టేబుల్ స్పూన్లు; వేయించిన నువ్వులు – ఒక టేబుల్ స్పూను; పచ్చి మిర్చి పేస్ట్ – ఒక టేబుల్ స్పూను; దానిమ్మ గింజలు – కొద్దిగా

**తయారీ:** ● అరటి కాయలను ఉడికించి తొక్క తీసి చేతితో మెత్తగా మెదపాలి ● ఒక పాత్రలో అరటి కాయ ముద్ద, బియ్యప్పిండి, పచ్చి మిర్చిపేస్ట్, ఉప్పు, ఒక టేబుల్ స్పూను నూనె వేసి బాగా కలిపి పక్కన ఉంచాలి.

**ఫిల్లింగ్ తయారీ:** ● ఒక పాత్రలో కొబ్బరి తురుము, పచ్చి మిర్చి పేస్ట్, పల్లీల పొడి, వేయించిన నువ్వులు, కిస్‌మిస్, జీలకర్ర, కరివేపాకు, పంచదార, నిమ్మ రసం, ఉప్పు, కొత్తిమీర వేసి బాగా కలపాలి ● అరటి కాయ మిశ్రమాన్ని ఉండలుగా చేయాలి ● చేతికి నూనె పూసుకుని, ఒక్కో ఉండను చేతి లోకి తీసుకుని కచోరీ ఆకారంలో చేయాలి ● ఫిల్లింగ్ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా కచోరీలో నింపి, గుండ్రంగా చేసి, పైన బియ్యప్పిండి అద్ది పక్కన ఉంచాలి ● ఈ విధంగా అన్నీ తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె వేసి కాగాక తయారుచేసి ఉంచుకున్న కచోరీలను వేసి దోరగా బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించాలి ● యోగర్ట్‌లో ముంచి అందించాలి.

– నిర్వహణ
**వైజయంతి**

## మూంగ్ దాల్ సమోసా

**కావలసినవి:** మైదా పిండి – 2 కప్పులు; ఉప్పు – తగినంత; నూనె – 2 టేబుల్ స్పూన్లు; చల్లటి నీళ్లు – తగినన్ని (పిండి కలపడానికి).

**ఫిల్లింగ్ కోసం:** పొట్టు పెసర పప్పు – 3 కప్పులు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; జీలకర్ర – ఒక టీ స్పూను; ఇంగువ – కొద్దిగా; గరం మసాలా – 3 టీ స్పూన్లు; మిరప కారం – 3 టీ స్పూన్లు; మెంతి పొడి – 1 టీ స్పూను; ధనియాల పొడి – 2 టీ స్పూన్లు; ఉప్పు – తగినంత; ఆమ్‌చూర్ పొడి – ఒక టీ స్పూను

**తయారీ:** ● ఒక పాత్రలో మైదా పిండి, ఉప్పు, కొద్దిగా నూనె వేసి బాగా కలపాలి ● చల్లటి నీళ్లు జత చేస్తూ చపాతీ పిండిలా కలిపి అరగంట సేపు పక్కన ఉంచాలి ● పిండిని ఉండలు చేసుకుని, చపాతీలా గుండ్రంగా ఒత్తి, రెండు భాగాలు అయ్యేలా మధ్యకు కట్ చేయాలి ● ఒక భాగాన్ని తీసుకుని అంచుల దగ్గర తడి చేసి, కోన్ ఆకారంలో చుట్టి, అంచుల దగ్గర గట్టిగా అదమాలి ● పొట్టు పెసర పప్పును మిక్సీలో వేసి కొద్దిగా రవ్వలా అయ్యేలా మిక్సీ పట్టాలి ● స్టౌ మీద బాణలి వేడయ్యాక నూనె వేయాలి ● జీలకర్ర, ఇంగువ వేసి వేయించాలి ●మిక్సీ పట్టిన పెసర పప్పు రవ్వను జత చేసి దోరగా వేయించాలి ● గరం మసాలా, మిరప కారం, మెంతి పొడి, ధనియాల పొడి, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జత చేసి మరోమారు వేయించి దింపి చల్లారనివ్వాలి ● తయారుచేసి ఉంచుకున్న సమోసా మౌల్డ్‌లోకి ఈ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా ఉంచి, అంచులు మూసేయాలి ● ఈ విధంగా అన్నీ తయారుచేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారుచేసి ఉంచుకున్న సమోసాలను వేసి బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి, పేపర్ న్యాప్‌కిన్ మీదకు తీసుకోవాలి.



## బ్యాంగ్ బ్యాంగ్



**కావలసినవి:** బేబీ పొటాటోస్ – పావు కేజీ; ఉప్పు – తగినంత; ఎండు మిర్చి – 2 (ముక్కలు చేయాలి); పసుపు – అర టీ స్పూను; బొంబాయి రవ్వ – ఒక టేబుల్ స్పూను; నెయ్యి – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; తరిగిన పచ్చి మిర్చి – మూడు; వెల్లుల్లి తరుగు – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు.

**తయారీ:** ● బంగాళదుంపలను శుభ్రంగా కడిగి ఉడికించాలి ● చల్లారాక తొక్క తీయాలి ● ఒక పాత్రలో ఉప్పు, పంచదార, ఎండు మిర్చి ముక్కలు, పసుపు, బొంబాయి రవ్వ వేసి బాగా కలపాలి ● బంగాళ దుంపలను అందులో వేసి దొర్లించాలి ● స్టౌ మీద బాణలిలో పాన్ ఉంచి వేడయ్యాక పచ్చి మిర్చి వేసి వేయించాలి ● బేబీ పొటాటోలను వేసి సుమారు పది నిమిషాలు ఉడికించాలి ● మధ్యమధ్యలో కలుపుతుండాలి ● బంగాళ దుంపలు బంగారు రంగులోకి మారగానే దింపేయాలి.

## రాశి ఫలాలు (సౌరమానం)



జన్మనక్షత్రం తెలియదా? నో ప్రాబ్లమ్! మీ పుట్టినరోజు తెలుసా? మీ పుట్టిన తేదీని బట్టి ఈవారం (జూన్ 22 నుంచి 28 వరకు) మీ రాశి ఫలితాలు

డా॥ మైలవరపు శ్రీనివాసరావు
జ్యోతిష్య పండితులు

### మేషం
(మార్చి 21 - ఏప్రిల్ 19)

చెరువులో నీటిని పొలానికి నీరు కట్టడం కోసం విడిచిపెడితే ఇంతసేపట్లో రావచ్చు ననుకునే వీలు లేదు. మధ్యలో చిన్న చిన్న గోతులున్నా, మలుపుల్లో కొంత సన్నగా ప్రవహించవలసి వచ్చినా కొద్దిపాటి ఆలస్యం కావచ్చు ఆ తడి రాక. అలాగే బడిలో బయల్దేరిన పిల్లవాడు తోవలో వచ్చే వాహనాల రద్దీ చిన్న చినుకుల కారణంగా రావడం కొద్దిపాటి ఆలస్యం కావచ్చు. అంత మాత్రాన దిగులు పడితే ఎలా? ఇదే తీరుగా పనులన్నీ సవ్యంగానే జరుగుతాయి కానీ కొద్ది జాప్యం తప్పక పోవచ్చు.

పెద్ద వయసున్న కుటుంబ వృద్ధులకి ఈ పిల్లలూ మనుమలూ చదువులూ ఉద్యోగాలూ జీతబత్తాలూ అనారోగ్యాలూ వైద్యాలూ.. ఇలా ఇంకెంతకాలమనే నిరుత్సాహం రావచ్చు. ఈ కారణంగా వాళ్లకి ఎవరినో తోడిచ్చి, వాళ్లిష్టపడే తీర్థయాత్రా ప్రదేశాలకో లేక బంధువుల ఇంటికో కొంత మార్పు కోసం పంపండి. సౌకర్యవంతమైన ప్రయాణం కోసం మరో రూపాయిని అదనంగా ఖర్చు చేయండి తప్ప ఇబ్బందికి గురిచేయవద్దు. వాళ్లు గాని వెళ్లినట్లయితే రోజుకి రెండుమార్లు పలకరిస్తూ ఉండండి. ఈ వయసులో వాళ్లకి దివ్యౌషధం పలకరింపే.

ప్రభుత్వేతర రంగ సంస్థల నుండి అనుకోకుండా ఆదాయం లభించవచ్చు బహుమతి రూపంగా (బోనస్). దాన్ని ఖర్చు చేసేయకుండా పిల్లల చదువులకో కూతురి పెళ్లికి బంగారంగా నిల్వ చేసుకోండి. బాగుంటుంది.

**లౌకిక పరిహారం:** పనుల్లో కొద్దిగా జాప్యం జరిగినా ఫలితం మాత్రం అనుకూలమే.
**అలౌకిక పరిహారం:** ఆదిత్య హృదయ స్తోత్ర పఠనం ఉత్తమం.

### వృషభం
(ఏప్రిల్ 20 - మే 20)

తగినంత సామర్థ్యం– ఏ పనినైనా సానుకూల పరచుకునేంత వరకూ తిరగ గలిగిన శారీరక శక్తీ న్న మీకు ఈ వారం అంతా అనుకూలంగానే ఉంటుంది. సమాజంలో కొంతలో కొంత గుర్తింపుకు కూడా నోచుకునే అవకాశముంది. కుటుంబ వ్యవహారాలన్నీ సంతృప్తికరంగా ఉండడమే కాక, లోగడ కొన్ని వ్యవహారాలలో మీరు చేసిన పరిష్కారాలు కుటుంబ మంతటికీ సత్ఫలితాలనిచ్చి ఉన్న కారణంగా మీ విలువ కూడా పెరిగి ఉండి తీరుతుంది.

తలిదండ్రుల వద్దకో అత్తమామల వద్దకో వెళ్లే అవసరాలు శుభకార్యక్రమాల సందర్భంగా బాగా గోచరిస్తున్నాయి. ఆర్థిక వ్యవహారాలన్నీ అనుకూలంగానే ఉండే కారణంగా ప్రస్తుతంలో చింత పడాల్సిన అవసరాలేమీ లేనే లేవు. అయితే ఎంతకీ మీరు నిర్ణయించుకున్న ఆలోచనలే అమలు పరచడానికి అనువైనవి తప్ప ఎవరెవరో చెప్పిన మాటలని ఆచరణలోకి తేవడం సరికాదు.

నిరుద్యోగులుగా ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే తప్పక ఉద్యోగ ప్రాప్తి ఉంది కాబట్టి ఆ ఉద్యోగ స్థలానికి వెళ్లి పైఅధికారితో ఏదో ఓ తీరుగా పరిచయం సంపాదించుకుని, మీ ప్రవర్తన కారణంగా తాత్కాలిక ఉద్యోగాన్ని సంపాదించుకోగలరు. ప్రయత్నించండి. 'నమ్మకమే నిజమైన పెట్టుబడి' అని పెద్దలు చెప్పిన మాటను మరచిపోకండి.

పిల్లల చదువు నిమిత్తమో, కుటుంబంలో ఉన్న ఒకరి అత్యవసర ఆరోగ్య పరిస్థితి కోసమో ప్రస్తుతమున్న ఉద్యోగ స్థలం నుండి అదే ఊళ్లోకి మరోచోటికి గాని లేదా మరో ప్రదేశానికి గాని బదిలీ కావాలంటూ దరఖాస్తు చేసుకోవడం మంచిది– అత్యవసరం కూడా.

**లౌకిక పరిహారం:** మీ నిర్ణయాన్నే అమలు చేసుకోండి. ఇతరుల సలహాలూ సూచనలూ వద్దు ప్రస్తుతానికి.
**అలౌకిక పరిహారం:** లలితా సహస్ర నామ పఠనం ఉత్తమం.

### మిథునం
(మే 21 - జూన్ 20)

భార్యాభర్తలు ఒకచోట ఉండాలనే ఆలోచనతోనో, ఆరోగ్యానికి ఈ వాతావరణం అంత అనుకూలంగా లేదనే ఊహతోనో, ఉద్యోగంలో ఎదుగు బొదుగులుండవనే అభిప్రాయంతోనో దాదాపుగా స్థానచలనం కోసం నిశ్చయపడిపోతారు. అలాంటి స్థానచలనమనేది మీకు శుభదాయకం. అభివృద్ధికి వెళ్లేందుకు ముఖద్వారమున్నూ.

అత్తమామల నుండి మీరు చేయని తప్పుకి అనవసరమైన నిందని మోయవలసి రావచ్చు. ఆ విషయం మీలో కొంత మానసిక ఆందోళన కలిగించవచ్చు. వీలయినంతవరకూ మర్చిపోవడానికి ప్రయత్నిస్తారు గాని కొద్దికాలంపాటు బాధించవచ్చు.

వ్యవసాయ దారులే గాని మీరయ్యుంటే కూలీల రాకా, ఏరువాక పున్నమి ఏర్పాట్ల దగ్గర నుండి అన్నీ కూడా మానసికమైన శారీరకమైన శ్రమకి గురి చేసే వ్యవహారాలు కావడంతోపాటు విత్తనాలూ శిస్తుల చెల్లింపులూ.. ఇలా అన్నీ కూడా ఇబ్బందే అనిపించే తీరులో సాగుతాయి. అమ్మేసే ఆలోచనని మీ హయాంలో రాకుండా చేసుకోండి.

బంధుమిత్రులందరూ కూడా మీకు సర్వవిధాలా సహకరిస్తున్నా ఏదో తెలియని కొరతతోనే కనిపిస్తూ ఉండవచ్చు మీరు. అది సంతాన సమస్యే అయ్యుండవచ్చు. ఉద్యోగాలూ హడావిడిగా రాకపోకలూ సమయపాలనా... వంటి ఈ నియమాల చట్రంలో పడి బతకడం కంటే తలిదండ్రులున్న ప్రదేశానికే వచ్చేసి ఉంటే వాళ్లకి అండగానూ విశ్రాంతిగానూ గడపవచ్చునేమో అనిపించవచ్చు. ఏమైనా మార్పు ఆలోచన వస్తుంది. మంచిదే మరి.

**లౌకిక పరిహారం:** శారీరకంగానూ మానసికంగానూ శ్రమ తప్పదు.
**అలౌకిక పరిహారం:** అమ్మవారికి సంబంధించిన స్తోత్ర పారాయణం సత్ఫలితాలనిస్తుంది.

### కర్కాటకం
(జూన్ 21 - జూలై 22)

భారతకథలో ధృతరాష్ట్రుడు ఒక ఉపాయం పన్నాడు– పాండవులలో నిజంగా రాజ్యాన్ని వారి 12+1 అరణ్య అజ్ఞాతవాసాలు అయిపోయిన కారణంగా ఇచ్చెయ్యాల్సి ఉంది. అప్పుడు సంజయుడనే దూతని పంపుతూ– ఎలాగూ అరణ్యాల్లో అలవాటయిందిగా మీకు ఉండడం, అదీగాక ఇప్పుడు యుద్ధం వస్తే ప్రాణినష్టం కూడా కదా! అక్కడే ఉండిపోండి– మీరు సజ్జనులు – అని చెప్పాడు. రాజ్యాన్ని ఇయ్యకూడదనే తన బలమైన ఆశని ఇలా చెప్పించాడు గుడ్డిరాజు. ఆ దాపరికం కారణంగానే కురుక్షేత్ర యుద్ధం దాకా వెళ్లింది కథ. మీకు దాపరికం వద్దు. ఉన్నదాన్ని ఉన్నట్టు స్పష్టంగా చెప్పెయ్యండి. దాపరికంతో పాటు మొహమాటాన్ని కూడా తరిమికొట్టండి. రవి కుజులు అర్ధ శుభులుగా ఉన్న కారణంగా విషయాన్ని బహిరంగంగా ఉంచుకోవడం మంచిది. కుంతీదేవి తన కర్ణుని పుట్టుక విషయాన్ని దాచిన కారణంగానే అటూ ఇటూ ఎటూ చెప్పలేక జీవితాంతం మధన పడింది. దాపరికం మొహమాటం అనేవి వద్దని మరోమారు– మరోసారి– ఇంకోసారి కూడా మీకు చెప్పడం కోసమే ఇంత వివరంగా రాయడమని గమనించండి. వ్యవసాయదారులైనట్లయితే మీరుగా శారీరక శ్రమ పడడం కంటే అమర్చడం– అజమాయిషీ చేసుకోవడం మంచిది. మీరు ఉద్యోగస్థులైతే అధికార హోదాని పెంచబోతున్న సూచనలే కనిపిస్తే ప్రస్తుత దశ కారణంగా తీసుకోకుండా ఉండే అన్ని ప్రయత్నాలనీ చేయండి. దానికోసం ఎదురు చూసేవాళ్లు సిద్ధంగా ఉన్నారు. వాళ్లకి పోనియ్యండి. మీరు మీ కింది వారితో చేయించలేరు– పైవాళ్లతో మాట పడలేరనేదే కారణం. స్త్రీలకి శుభవార్తలు వినిపించే కాలం. వివాహ ప్రయత్నాలు అనుకూలించే కాలం. వ్యాపారస్థులు పెద్దగా లాభాలని ఆశించని పక్షంలో పాత సరుకు మొత్తం చెల్లిపోయే అవకాశముంది. వస్తువు చెడిపోవడం, నిల్వ చేయడం, రద్దు పోవడం... వంటి బాధలుండవు.

**లౌకిక పరిహారం:** దాపరికం, మొహమాటం వద్దే వద్దు.
**అలౌకిక పరిహారం:** శివాభిషేకం మంచిది.

### సింహం
(జూలై 23 - ఆగస్ట్ 22)

ఒకచోట పని చేస్తున్నప్పుడూ ఎంతో పెట్టుబడి పెట్టిన యజమాని దగ్గర జీతాన్ని తీసుకుంటున్నప్పుడూ అతనికంటూ కొంత అహంకారం ఉండడం సహజమే. అదే మీరు పెట్టుబడిని పెట్టినా ఆ అహంకారాన్ని కలిగి ఉండేవాళ్లే. అయితే ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తూ అవమానిస్తూ అందరిలా కాకుండా మిమ్మల్ని వ్యతిరేక పక్షపాత దృష్టితో చూస్తుంటే తట్టుకోలేని మనస్తత్వం మీది కాబట్టి నిర్భయంగా వ్యతిరేకించండి. అయితే సాక్షిగా మరికొందరున్నప్పుడు మాత్రమే సుమా! మీకు ఏ నష్టమూ కలగ దు. యజమాని కళ్లు మామూలు చోటికి దిగుతాయి. అంతేకాక మీకున్న సామర్థ్యం మరెవరికీ లేదని కూడా అతనికి తెలుసు. మరెందుకని అలా చూస్తున్నాడనే ప్రశ్నకి సమాధానం ఒకటే– 'మీరు అహంకరించకుండా ఉండడం కోసం మాత్రమే – యజమాని అయిన తనకి అంత నైపుణ్యం లేదనే విషయాన్ని మీరూ గ్రహించగలిగారనే ఆలోచన మాత్రమే.

భర్త ఆరోగ్యం కంటే మించింది లేదనే దృష్టితో ఉంటూ వ్యాపారంలో రాత్రింబవళ్లూ మీ మగవారు శ్రమిస్తున్నారనిపిస్తే వ్యతిరేకించండి. మీ భర్త ఆ సంస్థ యజమానిని బాగు చేయడానికే పుట్టినవాడు కాదు. మీ, మీ పిల్లల యోగక్షేమాల కోసం తపించవలసినవాడు సుమా!

వ్యాపారంలో చక్కని లాభాలొస్తాయి. అయితే చేస్తున్న వ్యాపారాల్లో అడపాతడపా నష్టాలు కూడా తగులుతూనే ఉండచ్చు. చేరి ఫలాని పని ఏదో విఘ్నానికి గురి కావచ్చని చూచాయగా అనిపించినా, ఆ పనికి వెళ్లద్దు.

**లౌకిక పరిహారం:** మీకు మీరుగా విరోధాన్ని తెచ్చుకోకండి. అగౌరవ/అభిమాన పరిస్తే ఊరుకోకండి.
**అలౌకిక పరిహారం:** గణపతి ఆరాధన అవశ్యం.

### కన్య
(ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)

ఈ వారమంతా ఆర్థికమైన లావాదేవీలతో ఉండచ్చు మీరు. పాతబాకీల వసూళ్లకోసం ప్రయత్నాలూ ప్రయాణాలూ– ఒకప్పుడు తీసుకున్న రుణాలని తీర్చడాలూ బరువుని దించుకోడాలూ– వీటితోపాటు ఇంటిని కట్టించే ఆలోచనగాని కట్టుకునే ఆలోచనగాని కట్టిందాన్ని కొనే ఆలోచన గాని కలిగి ఖజానా (అడ్వాన్స్) చెల్లించే ప్రయత్నంలో ఉంటారు. మొత్తానికంతా శుభకాలమే ప్రస్తుతం.

సంతానం చదువులో ముందంజలో ఉండచ్చు. అందులో అబ్బాయి చదువు మరింత అభివృద్ధి పథంలో ఉండచ్చు. అతని స్థాయిని గమనించిన పెద్దలు మరింత పైస్థాయిలో ఉన్న చోట చదివించడం బాగుంటుందని సూచననియ్యచ్చుర. విద్యలో స్థాయి అనేది విద్యార్థి చదువుకి సంబంధించిన కృషి మీద ఆధారపడి ఉంటుంది గాని స్థాయి తక్కువ/ఎక్కువ విద్యాలయాన్ని బట్టి ఉండదు. ఓ మాటలో చెప్పాలంటే మరింత గొప్ప గొప్పగా ఉత్తీర్ణులైనవాళ్లలో ఎక్కువమంది దాదాపు విద్యుత్తు కూడా లేని ఇళ్లలో చదువుకున్నవాళ్లే! గమనించుకోండి.

మొదటినుండీ మీది ఎంచి మాత్రమే ఖర్చు చేసుకునే విధానమే అయ్యున్న కారణంగా సంతానానికి సంబంధించిన వ్యయాన్ని భరించడానికి ఎవరి వద్దకో ఎక్కడికో వెళ్లనక్కరలేదు– పైగా మీ సంతాన ప్రతిభని పురస్కరించుకుని అతనంతట అతనికే విద్యాప్రతిభా పురస్కారం రావచ్చు– విద్యాభివృద్ధికి ఇబ్బంది ఉండకపోవచ్చు.

మీ కింది ఉద్యోగులతో అలాగే సహోద్యోగులతో సమాన భావాన్ని చూపించకపోయినా ఫరవాలేదేమో గాని, వాళ్లని తక్కువ దృష్టితో చూస్తున్నారనే అభిప్రాయం వాళ్లకి ఏ తీరుగానూ కలిగేలా ఉండకండి. అది చాలా దూరం వెళ్లచ్చు.

**లౌకిక పరిహారం:** సంతానం విద్య అనే రెంటిని గురించీ ఆందోళన అనవసరం.
**అలౌకిక పరిహారం:** శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం మంచిది.

# రుచుల గడప



## ఆలూ దాల్ టిక్కీ



**కావలసినవి:** బంగాళ దుంపలు – అర కిలో (ఉడికించి తొక్క తీసి చేతితో మెత్తగా అయ్యేలా మెదపాలి); బ్రెడ్ స్లయిసెస్ – 3; ఉప్పు, కారం – రుచికి తగినంత; గరం మసాలా – కొద్దిగా; జీలకర్ర పొడి – అర టీ స్పూను; ధనియాల పొడి – అర టీ స్పూను; పచ్చి సెనగ పప్పు – అర కప్పు; సన్నగా తరిగిన పచ్చి మిర్చి – 4; నిమ్మ రసం – ఒక టీ స్పూను; కొత్తిమీర – కొద్దిగా.

**తయారీ:** ● బ్రెడ్ స్లయిస్‌లను చేతితో మెత్తగా చేయాలి ● బంగాళ దుంప ముద్ద, పచ్చిసెనగ పప్పు, కొత్తిమీర, నిమ్మరసం, పచ్చి మిర్చి తరుగు జత చేసి బాగా కలపాలి ● జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు, కొద్దిగా నూనె జత చేసి మరోమారు కలపాలి ● కొద్దికొద్దిగా ఈ మిశ్రమాన్ని చేతిలోకి తీసుకుని, వడల మాదిరిగా ఒత్తాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక వీటిని ఒక్కొక్కటిగా వేస్తూ, బంగారు రంగులోకి వచ్చేవరకు వేయించి పేపర్ న్యాప్‌కిన్ మీదకు తీసుకోవాలి.

## మిక్స్‌డ్ దాల్ దోసె



**కావలసినవి:** పొట్టు పెసర పప్పు – పావు కప్పు; పెసర పప్పు – పావు కప్పు; మినపప్పు – రెండున్నర టేబుల్ స్పూన్లు; పచ్చి మిర్చి పేస్ట్ – ఒక టీ స్పూను; అల్లం పేస్ట్ – అర టీ స్పూను; పసుపు – పావు టీ స్పూను; మిరప కారం – పావు టీ స్పూను; ఇంగువ – చిటికెడు; కొత్తిమీర తరుగు – 2 టేబుల్ స్పూన్లు; ఉప్పు – తగినంత; నూనె – తగినంత.

**తయారీ:** ● ఒక పెద్ద పాత్రలో పొట్టు పెసర పప్పు, పెసర పప్పు, మినప్పప్పు వేసి బాగా కడిగి, తగినన్ని నీళ్లు జత చేసి సుమారు మూడు గంటల సేపు నానబెట్టాలి ● బాగా నానిన తరవాత మిక్సీలో వేసి తగినన్ని నీళ్లు జత చేస్తూ దోసెల పిండిలా మిక్సీ పట్టాలి ● పిండిని ఒక పాత్రలోకి తీసుకుని నూనె మినహా మిగతా పదార్థాలన్నీ జతచేసి బాగా కలిపి ఒక గంట సేపు పక్కన ఉంచాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక గరిటెడు పిండి తీసుకుని దోసె మాదిరిగా వేసి, రెండు వైపులా నూనె వేసి దోరగా కాల్చి ప్లేటులోకి తీసుకోవాలి ● గ్రీన్ చట్నీతో అందించాలి.

## రైస్ పకోడా

**కావలసినవి:** అన్నం – 2 కప్పులు; అటుకులు – పావు కప్పు; ఉల్లి తరుగు – అర కప్పు; అల్లం ముద్ద – ఒక టీ స్పూను; స్వీట్ కార్న్ – పావు కప్పు (ఉడికించాలి); ఉప్పు – తగినంత; మిరప కారం – అర టీ స్పూను; కొత్తిమీర తరుగు – ఒక టేబుల్ స్పూను

**తయారీ:** ● ఒక పాత్రలో అటుకులకు, పావు కప్పు నీళ్లు జత చేసి బాగా కలిపి పక్కన ఉంచాలి ● అన్నాన్ని చేతితో మెత్తగా చేయాలి ● ఒక పెద్ద పాత్రలో మెత్తగా మెదిపిన అన్నం, ఉడికించిన స్వీట్ కార్న్, ఉల్లి తరుగు, కొత్తిమీర తరుగు, అల్లం ముద్ద, ఉప్పు, మిరపకారం, నానబెట్టిన అటుకులు వేసి బాగా కలపాలి ● చిన్న చిన్న ఉండలు చేసుకోవాలి ● స్టౌ మీద బాణలిలో నూనె కాగాక, తయారుచేసి ఉంచుకున్న ఉండలను వేసి దోరగా వేయించి కిచెన్ టవల్ మీదకు తీసుకోవాలి ● సాస్‌తో తింటే రుచిగా ఉంటాయి.



## ఇడ్లీ పకోడా

**కావలసినవి:** బొంబాయి రవ్వ – ముప్పావు కప్పు; పెరుగు – పావు కప్పు; నీళ్లు – పావు కప్పు; ఉప్పు – తగినంత; బేకింగ్ సోడా – అర టీ స్పూను; పంచదార పొడి – అర టీ స్పూను; నీళ్లు – రెండు టీ స్పూన్లు.

**పిండి కోసం:** చిక్కుడు గింజలు – ఒకటిన్నర కప్పులు; ఉప్పు – తగినంత; మిరప కారం – ఒక టీ స్పూను; ధనియాలు – ఒకటిన్నర టీ స్పూన్లు; మెంతులు – ఒక టేబుల్ స్పూను; నీళ్లు – 5 టేబుల్ స్పూన్లు; నూనె – డీప్ ఫ్రై కోసం.

**తయారీ:** ● చిక్కుడు గింజలకు తగినన్ని నీళ్లు జత చేసి సుమారు నాలుగు గంటల సేపు నానబెట్టాలి ● వేరే పాత్రలో ముప్పావు కప్పు రవ్వ, పావు కప్పు పెరుగు, పావు కప్పు నీళ్లు వేసి బాగా కలిపి నాలుగు గంటల సేపు పక్కన ఉంచాలి (నానిన తరవాత బాగా గట్టిగా అనిపిస్తే, కొద్దిగా నీళ్లు జత చేయాలి) ● బాగా నానిన ఈ పిండిని సగ భాగం తీసుకుని, తగినంత ఉప్పు, పావు టీ స్పూను బేకింగ్ సోడా, పావు టీ స్పూను పంచదార పొడి వేసి బాగా కలపాలి ● ఇడ్లీ రేకులకు కొద్దిగా నూనె పూసి, కలిపిన పిండిని వెంటనే ఇడ్లీ రేకులలో వేసి, కుకర్‌లో ఉంచి విజిల్ లేకుండా ఇడ్లీలు ఉడికించాలి ● పది నిమిషాల తరవాత స్టౌ మీద నుంచి దింపి చల్లారనివ్వాలి ● నానిన చిక్కుడు గింజలను మిక్సీలో వేసి మెత్తగా చేయాలి (కొద్దిగా నీళ్లు జత చేయాలి) ● ఉప్పు, మిరప కారం, ధనియాల పొడి, మెంతి పొడి, కొత్తిమీర జత చేసి మరోమారు మిక్సీ పట్టాలి ● ఉడికిన ఇడ్లీలను చిక్కుడు గింజల మిశ్రమంలో దొర్లించాలి ● స్టౌ మీద పెనం వేడయ్యాక, కొద్దిగా నూనె వేసి కాగాక, ఈ ఇడ్లీలను పెనం మీద వేసి రెండు వైపులా దోరగా కాల్చి తీసేయాలి ● గ్రీన్ చట్నీతో కాని టొమాటో సాస్‌తో కాని అందించాలి.



కడపలో పెరిగి, ఒకసారి ఇక్కడ రుచులకు నాలుక అలవాటు పడ్డాక, మరే ఊరిలోని వంటకాలు తిన్నా సరే! దాన్ని తృప్తి పరచడం మహా కష్టం. బయటి ఊరి వాళ్లెవరైనా కడప గురించి విన్నప్పుడు, 'అబ్బే కరువు ప్రాంతం కదా... ఇక్కడి వంటలు ఏం రుచిగా ఉంటాయిలే' అనుకుంటారు, కానీ ఒక్కసారి కడప గడపలో అడుగుపెట్టి ఇక్కడి ఆతిథ్యం స్వీకరించాక గానీ నమ్మరు, కడప లో రుచులు అద్భుతః అని. సీమలో జనాలకు ఆతిథ్యం ఇవ్వడం అంటే మహా ఇష్టం, ఇంట్లో వాళ్ళకు లేకపోయినా సరే, అతిథి కి మాత్రం ప్రేమతో చుక్కలు చూపించాల్సిందే, అందుకే సీమలో మంచినీళ్లడిగితే మజ్జిగిస్తారు, అన్న సామెత పుట్టుకొచ్చింది.

కడప గురించి మాట్లాడుకునేటప్పుడు దోశెతోనే మొదలెట్టాలి, ఇక్కడ దోశెల్లో కారమే కాదు, మమకారం కూడా బాగానే దట్టిస్తారు, అందుకే కళ్లలో నీళ్లు కారిపోతున్నా సరే, కంచెం లో దోశె ను ఒక పట్టాన వదలబుద్ధి అవ్వదు. చాలా చోట్ల దోశె అంటె ఒక వైపే కాలుస్తారు, కానీ కడప లో రెండు వైపులా కాల్చి, ఒక వైపున ఎండు మిరపకాయలతో చేసిన ఎర్రకారం, పుట్నాల పప్పులతో చేసిన పొడి, బొంబాయి చట్నీ, (కొన్ని చోట్ల దీన్ని 'పిట్లా' అంటారు) ని దోశె మొత్తం బాగా పూసి బాగా ఎర్ర గా కాల్చి చేస్తారు. ఈ దోశెలు చెన్నూరు బస్ స్టాండ్ దగ్గర చాలా ఫేమస్, పది పదిహేనేళ్ల కిందట, ఒకే వరుసలో మూడు బండ్లు ఉండేవి, అప్పట్లోనే ఒక్కోదోశె 6 రూపాయలు, ఇప్పుడు 40 రూపాయలనుంచి వంద రూపాయల దాకా ఉంది, బండ్లు పోయి స్టాళ్లు వెలిసాయి. దోశెల్లో అక్కడ దొరకని వెరైటీ ఉండదు, దోశె దొరకాలంటే ఎలాంటి టైంలో అయినా అథమ పక్షం అరగంట వెయిట్ చేయాల్సిందే.



బీకేయం వీధి లో లక్ష్మీనారాయణ స్వామి గుడి పక్కన ఒక చిన్న హోటల్లో పొద్దున మాత్రమే 'పచ్చి కారం దోశె' దొరుకుతుంది. ఇక్కడే 'చిట్లంపొడి దోశె, చింతాకు పొడి దోశె, కరివేపాకు పొడి దోశె' లాంటి వెరైటీ లు దొరుకుతాయి.

ఊటుకూరు గేటు దాటి చమ్మిమియ్యా పేటలో దొరికే పాలకూర దోశె, టాప్ క్లాస్. ఇంకా యెర్రముక్కపల్లె లో దొరికే సమీర్ దోశె, గాంధీనగర్ స్కూల్ దగ్గర దొరికే రాగి దోశె కూడా ఫేమస్సే. మామూలుగా కడప దోశెలంటే బాగా పల్చగా ఉండి వాటి లోపల పూసిన టాపింగ్స్ మొత్తం బయటికి కనిపిస్తూ, కరకరలాడుతుంటాయి, కాని పెద్ద దర్గా దగ్గర దొరికే సోమయ్య దోశెలు మాత్రం దీనికి భిన్నం, చాలా మందంగా... కారం దట్టంగా పూసి, నెయ్యిలో స్నానం చేసినట్టున్న ఒక్క దోశె తిన్న కడుపు నిండిపోతాయి.

కడపలో రవ్వ ఇడ్లీ కన్నా పిండి ఇడ్లీలు బాగా ఫేమస్సు, రవ్వ ఇడ్లీలు పెద్ద హోటల్ల లో మాత్రమే దొరుకుతాయి, కాని ప్రతీ వీధి దగ్గరా బండి లో పిండి ఇడ్లీలు దర్శనమిస్తాయి, కోటి రెడ్డి సర్కిల్ నుంచి నారాయణ కాలేజ్ కి వెళ్లే దారిలో దొరికే శ్యాం బండి ఇడ్లీలు చూడటానికి మల్లె పువ్వులా తెల్లగా ఉండి, తినటానికి దూది కన్నా మెత్తగా ఉండి, నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోతాయి, ఇంకా దొంగల చెరువు కట్ట మీద సాయంత్రం దొరికే ఇడ్లీ కూడా దాదాపుగా ఇదే రుచి తో ఉంటుంది, దేవుని కడప మాడ వీధుల పక్కన దొరికే ఎర్ర కారం ఇడ్లీ కూడా యమా రుచి.

ఇక కడప బిరియానీ, 21 వ శతాబ్దపు సరికొత్త సంచలనం, ఇరవై సంవత్సరాల కిందట, చెన్నూరులో శివరాం అనే ఒక వ్యక్తి చిన్న పందిరి వేసి ఒక బిరియానీ హోటల్ మొదలెట్టాడు, అది కడప– హైదరాబాదు నేషనల్ హైవే కావటంతో కస్టమర్ల ప్రవాహానికి కొదవ ఉండదు, జనాలకు ఈ బిరియాని ఎంత నచ్చేసిందంటే, పదేళ్లు తిరక్కుండానే ఒక్క కడప నగరంలోనే చెన్నూరు బిరియానీ పేరుతో వందకు పైగా హోటళ్లు వెలిసాయి, కానీ ఒరిజినల్ బ్రాంచ్ మాత్రం చెన్నూరు లోనే ఉంది, ఇది ఎంత ప్రాచుర్యంలోకి వచ్చిందో తెలియడానికి రెండు ఉదాహరణలు చాలు, రోడ్డు పక్కన చిన్న స్టాలు పెట్టుకుని బిరియానీలు అమ్ముకునే చోటికి ఐటి అధికారులు లెక్కలు చూపించమని రైడు కు రావడం, అమెరికాలోని ఓ పేద్ద హోటల్ మెను లో చెన్నూరు బిరియానీ అనే రెసిపీ దొరకడం. కడప జిల్లా మొత్తం కలిపి, చెన్నూరు బిరియానీ పేరుతో రమారమి ఓ 500 హోటళ్ల దాకా ఉండొచ్చని అంచనా!

కడప నుంచి రాయచోటి వెళ్ళే దారిలో గువ్వల చెరువు ఘాట్ దిగగానే ఓ ఇరవై ముప్పై పాలకోవా సెంటర్లు కనిపిస్తాయి, ఇక్కడ నుంచి విదేశాలకు కోవా ఎగుమతి అవుతుందంటే నమ్మండి, అక్కడి కెళ్ళి నించోగానే ఓ చిన్న కప్పులో కోవా వేసి పైన, కొన్ని బాదం పలుకులు వేసి ఇస్తాడు, దాని రుచి నచ్చితేనే మనం కొనుక్కోవచ్చు, లేదా కొనుక్కోకుండా వెళ్లిపోవచ్చు కూడా! డబ్బులు అడగరు!!

ఆరేడేళ్ళ క్రితం నాగరాజు పేటలో ఓ బండిలో బొరుగుల మిచ్చర్ దొరికేది, బాగా ఫేమస్సు, రాజారెడ్డి వీధిలో సీయస్సై గ్రౌండు వెనక పక్క ఓ బొరుగుల బండి లో 30 వెరైటీలు దొరుకుతాయి. కృష్ణా హాలు నుంచి దేవుని కడప వెళ్లే రోడ్డులో దొరికే సమోసా భలే ఉంటుంది, ఇక్కడ మరో స్పెషల్ ఏంటంటే స్వీట్ సమోసా, బూందిని స్టఫ్ గా పెట్టి సమోసా వేసి దానికి పాకం పడతారు, చాలా బావుంటుంది.

వైవీ స్ట్రీట్ దగ్గర దొరికే అలంకార్ లస్సీ, కొంచెం లోపలికి వెళ్లగానే దొరికే బాసుంది కడప ఐకానిక్ డిజర్ట్స్. నల్లమల అడవుల్లో మాత్రమే దొరికే నన్నారి వేర్లతో తయారు చేసే షర్బత్ చాలా కమ్మగా ఉండటమే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. కడప నుంచి ఈ నన్నారి షర్బత్ బాటిల్లు విదేశాలకు చాలా రెగ్యులర్గా పార్సిల్ అవుతుంటాయి. షర్బత్ తో పాటు నానబెట్టిన సబ్జా గింజలు కలుపుతారు, చూడటానికి చాలా కలర్ ఫుల్ గా ఉంటుంది.

**(వాట్సప్‌లో చక్కర్లు కొడుతున్న ఓ సందేశం ఆధారంగా...)**

**పరి పరిశోధన**

## ఊబకాయ సమస్యలకు కోకా పెంకుల్లో విరుగుడు!



చాక్లెట్ల తయారీలో ప్రధాన పదార్థమైన కోకా గింజల పెంకుల్లో ఉండే రసాయనాలు ఊబకాయంతో వచ్చే ఆరోగ్య సమస్యలకు విరుగుడుగా వాడవచ్చునని అంటున్నారు ఇల్లినాయి యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. ఎలుకలపై జరిపిన ప్రయోగాల్లో ఈ కోకా గింజల పెంకుల్లోని ఫినాల్స్ ఊబకాయాన్ని తగ్గించడంతోపాటు ఇన్సులిన్ నిరోధకత, మంట/వాపుల్లాంటివి తగ్గించినట్లు తెలిసింది. మరీ ముఖ్యంగా మూడు రకాల ఫినాల్స్ కొవ్వు, రోగనిరోధక కణాలపై ప్రభావం చూపుతున్నాయని తద్వారా మనకు మేలు చేకూరుతోందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త రెబెల్లో హెర్నాజ్ తెలిపారు. ఈ ఫినాల్స్‌ను నీటితో కలిపి అందించినప్పుడు తెల్ల కొవ్వు కణాలైన అడిపోసైట్స్‌పై.. మాక్రోఫేగస్ అనే రోగ నిరోధక వ్యవస్థ తాలూకూ కణాలపై ప్రభావం చూపాయి. ఈ వివరాల ఆధారంగా కంప్యూటర్ సిమ్యులేషన్‌ను నడిపినప్పుడు ఒక్కో ఫినాల్ కణాలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలుసుకున్నారు. కొవ్వు, గ్లూకోజ్ ఎక్కువైనప్పుడు కణాల్లని మైటోకాండ్రియా దెబ్బతినడం వల్ల సమస్యలు వస్తాయని.. ఫినాల్స్ ద్రావణం వీటిని తొలగిస్తున్నట్లు తాము గుర్తించామని వివరించారు. కొవ్వు కణాలు ఎక్కువైనప్పుడు మాక్రోఫేగస్‌లూ పెరిగిపోతాయని.. ఈ రెండింటి మధ్య జరిగే చర్యల ఫలితంగా మంట/వాపులు వస్తాయని తెలిపారు. కాలక్రమంలో ఈ మంట/వాపు కాస్తా ఇన్సులిన్ నిరోధకత తదితర సమస్యలకు దారితీస్తుందని వివరించారు. కోకో గింజల పెంకులు వధాగా పారబోస్తున్న నేపథ్యంలో వాటిల్లోంచి ఉపయోగకరమైన వస్తువులను వాడుకోవడం ఈ పరిశోధన ద్వారా సాధ్యమవుతోందని అన్నారు.

## కేన్సర్ కణితుల పెరుగుదలను ఆపే పసుపు!



కేన్సర్‌తోపాటు అనేక వ్యాధుల చికిత్సకు పసుపు ఉపయోగపడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అల్లోపతి వైద్యంలో మాత్రం ఇప్పటికే ఈ అంశంపై బోలెడన్ని సందేహాలున్నాయి. వాషింగ్టన్ స్టేట్ యూనివర్శిటీ పరిశోధనల పుణ్యమా అని ఇప్పుడు కేన్సర్ చికిత్సలో పసుపు వాడకంపై కీలకమైన అంశం రూఢి అయ్యింది. పసుపులోని మూల పదార్థం కర్కుమిన్ ఒకవైపు ఎముక కేన్సర్ తాలూకూ కణాల పెరుగుదలను నిరోధిస్తూనే.. ఆరోగ్యకరమైన కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుందని వీరు గుర్తించారు. అంతేకాదు. ఒక పద్ధతి ప్రకారం విడుదల చేసే కర్కుమిన్ కేన్సర్ కణితుల పెరుగుదలను నిరోధిస్తుందని తాము గుఋర్తించామని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త సుస్మితా బోస్ తెలిపారు. సహజసిద్ధంగా లభించే పసుపు లాంటి పదార్థాలు.. శరీరానికి హాని కలిగించే కృత్రిమ మందులకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చునని.. పైగా ఇలాంటివన్నీ చౌకగా అందరికీ అందుబాటులో ఉంటాయని బోస్ తెలిపారు. కర్కుమిన్‌ను నోటిద్వారా తీసుకున్నప్పుడు శరీరంలో వేగంగా శోషణకు గురవుతుందని ఈ నేపథ్యంలో కొందరు త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ సాయంతో కాల్షియం ఫాస్పేట్ స్ఫటికాలను సిద్ధం చేసి అందులో కర్కుమిన్‌ను ఉంచి వాడుతున్నారు. ఈ పద్ధతిలో ఒక క్రమం ప్రకారం కర్కుమిన్‌ను విడుదల చేసినప్పుడు దాదాపు 96 శాతం కేన్సర్ కణాలు నాశనమైపోయాయని, తెలిపారు.

### తుల
**(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)**

చెట్టు చిటారు కొమ్మన చక్కని తేనెపట్టుంది కాబట్టి దాన్ని కిందినుండి ఓ రాతితో బలంగా కొడితే ఆ పట్టు పట్టు మొత్తం నేలన రాలి పడిపోతుందనే ఆ తీరు ఊహ, ఆలోచన దశలోనైతే బాగుండచ్చు గాని, ఒక్కసారంటూ రాయి గనక దానికి తగిలితే అక్కడి తేనెటీగలు వందల సంఖ్యలో ఆ రాయి వచ్చిన మార్గాన కిందికి వేగంగా వచ్చి కుడితే మృత్యుముఖం దాకా వెళ్లాల్సి వస్తుంది పరిస్థితి. ఎక్కడికో వెళ్లిపోయి అకస్మాత్తుగా కోటీశ్వరులై పోదామనుకుంటే, అది కాగితం మీద ఏడంతస్థుల మేడ బొమ్మ గీసినంత తేలిక కాదు. సాహసాలోచనలు వద్దు.

ఇంట్లో పెద్ద వయసున్న వారి ఆరోగ్యాలని బాగా పట్టించుకుంటూ ఉండండి. ప్రస్తుతానికి ఉన్న ఉద్యోగాన్ని కూడా చేయలేని నిస్సత్తువ వచ్చే అవకాశం రాకుండా బాగా బలవర్ధకమైన శారీరక మానసిక ఆహారాన్ని ఇస్తూ ఉండండి. ఆ వయసులో పదిమంది గలగలా మాట్లాడుతూ చుట్టూ ఉండడమే వాళ్లకి మానసికాహారమని మీకు తెలియనిది కాదు.

మీ చేతి గుప్పెడుని తెరిచి అరచేతిని ఏ దిక్కువైపుకి పడితే ఆటునుండి మీకు ఆర్థికంగానూ భౌతికంగానూ కూడా సహాయ సహకారాలనందించే బంధు మిత్ర ఆప్తజనం అందరున్నా కూడా చింతించాల్సిన అవసరం దేనికి? నిర్భయంగా ఉండండి. పిరికితనం కంటే లో అధైర్యం ప్రమాదకరం. గమనించుకోండి.

మీరు చేస్తున్న వ్యాపారం లేదా వృత్తి ద్వారా వచ్చే ఆదాయం మరికొంత పెరిగే అవకాశముంది. పరుగెత్తి పాలని తాగడం కంటె ఇక్కడే ఉంటూ నిలబడి నీటిని తాగడానికి ప్రాధాన్యమీయండి.

**లౌకిక పరిహారం:** ధన సంపాదన దృష్టిని కొద్దిగా తగ్గించుకోండి.
**అలౌకిక పరిహారం:** దుర్గాదేవీ స్తోత్రం మంచిది.

### ధనుస్సు
**(నవంబర్ 22 - డిసెంబర్ 21)**

ఏదో ఒక వ్యాపారాన్ని భాగస్వాములతో కలిసి సామూహికంగా నిర్వహిద్దామనుకునే పక్షంలో ఆ వ్యాపారానికి సంబంధించిన రాతకోతలన్నీ పూర్తి వ్యవహార పద్ధతిలోనే ఉండేలా చూసుకోండి తప్ప నోటి మాటలుగా వద్దు ఏ ఒక్క అంశంలోనూ. అయితే ఈ రాతకోతలని ఈ వారంలో చేసుకోవడానికి అంత గొప్పగా లేదు కాబట్టి ఈ వారాన్ని దాటనీయకండి.

బంధువులతో మరింతగా వేళాకోళాలు, పరిచయాలు పెంపుదలలూ ఒక సందర్భంలో అభిప్రాయభేదాలకి తోవ తీయవచ్చు. అనవసరంగా సంబంధ బాంధవ్యాలని దెబ్బ తీసుకునేలా చేసుకోవడం కంటె పరిమితిలో ఉండడం మంచిదనే విషయాన్ని గ్రహించండి.

ఒకవేళ వాళ్లే మరింతగా మీదికొస్తూ వేళాకోళాల స్థాయిని పెంచినా మీరు అదుపులో ఉండండి. ఒకప్పుడు విరోధులైనవాళ్లు ఎవరో మధ్యవర్తులద్వారా మళ్లీ పరిచయాల్ని పెంచుకుని పూర్వంలా మీతో కలిసి మెలిసి ఉండడం కోసం దగ్గరితనాన్ని కోరుతూ ఉంటే, తగు దూరంలోనే ఉంచండి. ఎప్పుడైనా విరిగినకాలు విరిగిన విధంగానే ఉంటుంది తప్ప సహజమైన కాలులా ఎన్నటికీ ఉండనే ఉండదు. వీలయినంత వరకు వాళ్లంతట వాళ్లే మీతో కలిసి ఉండడానికిష్టపడని తీరులో వ్యవహరించండి.

నోటి మాటలో ఎక్కడా దొరకకండి. చేతిలో మాత్రమే ఈ పద్ధతిని చూపించండి. యంత్రపరికరాలూ వాహనాలూ సరిగా ఉన్నదీ లేనిదీ పరిశీలించుకున్నాకనే ప్రయాణాలు చేయడం మంచిది.

**లౌకిక పరిహారం:** బంధు ఆప్తమిత్ర గణంతోనూ విరోధులతోనూ కూడ తగు మాత్రంలో ఉండండి.
**అలౌకిక పరిహారం:** ఏ అమ్మవారికైనా పుష్పార్చన చేయించండి.

### కుంభం
**(జనవరి 20 - ఫిబ్రవరి 18)**

ఒకప్పటి రోజుల్లో ఆ వీధిలోని ఒకరింట్లో పెళ్లి అనగానే అందరూ ప్రతి మధ్యాహ్నపు వేళా ఆ ఇంటికి చేరి పెళ్లికి కావలసిన అప్పడాలు వడియాలు దగ్గర్నుండి అప్పగింతల వరకూ ఏమేం కావాలో ఆ అన్ని పనుల్నీ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ పూర్తి చేసేస్తుండేవాళ్లు. అలాటి సహకారం బంధుమిత్రుల నుండి మీకు సంపూర్ణంగా ఉండడం ఓ చెప్పుకోదగ్గ విశేషం. అయితే దాన్ని కాపాడుకుంటూ ఉండండి. అశ్రద్ధ చేయకండి.

సంతానం వైపు నుండి ఓ చిన్న సమస్య విద్యాపరంగా లేదా ఉద్యోగపరంగా లేదా మరో ధోరణిలో రావచ్చు. వయసొచ్చిన పిల్లలకి వాళ్ల బుద్ధిలోనికి ప్రవేశించేలా చెప్పాలంటే కోపం, విసుగు, చిరాకూ, అసహనం అనేవి సరికాదు. బండరాయి కూడా నిద్రించే సమయమంటే ఒకటుంటుందని గ్రహించిన శిల్పి అదే సమయంలో ఎలా శిల్పాన్ని ప్రారంభిస్తాడో, అలా మీ సంతానం తమంత తాము ప్రశాంతంగా ఉన్న వేళని గమనించి నిదానంగా సమస్యని విని, పరిష్కారాన్ని చెప్పి, పరిస్థితిని చక్కదిద్ది వాళ్లని శాంతపడేలా చేయండి. తప్పక సమస్య పరిష్కారమౌతుంది. మూడోవ్యక్తిని సమస్యాపరిష్కారంలోనికి రానీయకండి.

'అయోగ్యః పురుషో నాస్తి –యోజక స్తత్రదుర్లభః' అని సంస్కృతంలో ఓ మాట. ఎవ్వడూ లోకంలో నిష్ప్రయోజకుడు కాడుట.

అలాటి వాణ్ణి కూడ వినియోగించుకోలేని వ్యక్తే నిజమైన నిష్ప్రయోజకుడట. ఆ కారణంగా బంధుమిత్ర ఆప్తగణంలో ప్రతి వ్యక్తితోనూ అనుకూలతతోనే ఉంటూ ఎవరిని ఎలా సద్వినియోగపరుచుకోవాలో చూసుకోండి. అదృష్టకాలమే ఇదంతా.

**లౌకిక పరిహారం:** ఎవరితోనూ విరోధించకండి. అనుకూలంగానే సాగిపోండి.
**అలౌకిక పరిహారం:** ఆంజనేయుని ద్వాదశనామస్తోత్రాన్ని పఠిస్తూ ఉండండి.

### వృశ్చికం
**(అక్టోబర్ 23 - నవంబర్ 21)**

సూర్యునికి ఎదురుగా ప్రయాణిస్తుంటే ముఖం నిండుగా తగిలేలా పడుతుండే ఆ ఎండ, సాయంత్రం అస్తమయ కాలానికొచ్చేసరికి ఒక చెంపని మాత్రమే బాధిస్తుంది– కారణం సూర్యుడు ఒక వైపుకి మాత్రమే ఉంటాడు గనక. అదే తీరుగా ప్రస్తుతం మీ సమస్య దాంపత్య ధర్మానికి సంబంధించే కావచ్చు. తమ కళ్ల ఎదురుగా జరిగిన ద్రౌపదీ వస్త్రాపహరణాన్ని భీష్మద్రోణాదులంతటి పెద్దలు చూసినా ఆ దుర్యోధనాదులకి శిక్ష 13 సంవత్సరాల తర్వాత కదా పడింది! న్యాయస్థానపు తీర్పుకి సమయం పడుతుంది. వేచి ఉండాల్సిందే మరి! లౌకికమైన న్యాయస్థానానికి మించి దైవన్యాయస్థానం మరోటుంది. అది కూడా తీర్పునిస్తుంది. ధర్మబద్ధంగానే వ్యవహరిస్తుండండి.

తెలియని మోసంలోపడి భూ/ గృహ/ క్షేత్రాలని నష్టపోయుంటే వాళ్లకే ఇదే ఔషధం– ఓర్పు పట్టడమే. అయితే అంతిమ విజయం మాత్రం మీదే– శస్త్రచికిత్స అనేది బాధని కలిగించేదే అయినా ఆ తర్వాత ఆనందం మీదే అయినట్లు.

ప్రయాణాల విషయంలో ఆలోచించి మాత్రమే వెళ్లడమా? లేదా? అనే నిర్ణయాన్ని చేసుకోవడం అవసరం. సంతానానికి చక్కని చదువు అబ్బుతూ ఉంటుంది. వాళ్లముందు ఈ కుటుంబానికి సంబంధించిన ఎచ్చుతగ్గులూ వ్యవహారాలూ మాట్లాడుకుంటూ ఉండడం సరికాదు. ఊహ వచ్చిన పిల్లలు కాబట్టి మీ గురించిన ఒక అంచనాకి వాళ్లు వచ్చే ప్రమాదముంది.

ఒక శుభకార్యం మీ బంధువుల ఇంటిలో జరిగే సందర్భంగా ఆభరణాలని కొంటారు. మంచి వస్త్రాలని దూరం వెళ్లి కొనుగోలు చేస్తారు. చేస్తున్న వృత్తి ఉద్యోగాలు బరువుగానే అనిపిస్తాయి.

**లౌకిక పరిహారం:** సహనం కోల్పోవద్దు. ధైర్యమే కవచం, ధర్మమే ఆయుధం.
**లౌకిక పరిహారం:** శనిశ్లోకాన్ని రోజుకి 361 మార్లు పఠిస్తూ ఉండండి.

### మకరం
**(డిసెంబర్ 22 - జనవరి 19)**

'నువ్వు ఇంద్రుడివి – చంద్రుడివి' అంటూ ఉబ్బేసేవాళ్లు లోకంలో ఎందరో ఉంటారు. కొందరు మేధావులయితే బాగా బాగా పొగిడించుకుని ఆనందపడి రెండు చేతుల్నీ ఎత్తి నమస్కరించేసి చేతుల్ని దులుపుకుంటారు తప్ప ప్రతి సహాయంగా ఏమీ విదల్చరు. అయితే మీ పరిస్థితి అది కాదు. వాళ్ల ప్రశంస మొదలెట్టగానే అలా జావలా అయిపోతూ – అడగడం తరువాయి వాళ్ల కోర్కెలని తీర్చే ధోరణిలోకి వెళ్లిపోయి వాగ్దానం చేసేస్తారు. లోతుకి దిగి ఆలోచించి ఇబ్బంది పడతారు. గమనించుకోండి. ముందుకి ముందే జాగ్రతపడండి. మీకు కొందరి కారణంగా కొన్ని ఇబ్బందులు కలిగిన మాట వాస్తవమే. అయితే వాళ్లూ వీళ్లూ వచ్చి ప్రతీకారాన్ని తీర్చుకునే ఆలోచనలని మీకు నూరి పోసేందుకు రావచ్చు. ఒకసారంటూ ఒక ఆలోచనా బీజాన్ని ఇష్టం లేకుండా బుద్ధిలో నాటేలా చేసినా దాని ప్రభావం తప్పక అంతో ఇంతో కొంత ఉండి తీరుతుంది. కాబట్టి ప్రతీకార బుద్ధిని నూరిపోసే వాళ్లు రాగానే లేదా నూరిపోయడం ప్రారంభిస్తే నిర్ద్వంద్వంగా 'అలా చెప్ప వద్ద'ని కచ్చితంగా చెప్పేయండి. ఒకవేళ వాళ్లు చెప్పిన పథకాన్ని అమలు చేస్తే నష్టాన్నీ కష్టాన్నీ ఎదుర్కోవలసింది వాళ్లు కాదనే యదార్థాన్ని గమనించుకోండి.

ముళ్లున్న చెట్టు దగ్గరికి మనం పోయినా లేక గాలికి ఎగిరి ఆ కొమ్మ మనకి తగిలినా చెట్టుకి ఏమీ కాదు. మీ కంటె 2 1/2 రెట్లు వయసున్న వాళ్లూ పెద్దరికంతో ఉండేవాళ్లూ మంచీ చెడూ అనే విచక్షణ కలవాళ్లూ అయిన ఏ ఒకర్నో మార్గదర్శకులుగా నిర్ణయించుకోండి మంచి పరిశీలన మీద. అలా జరిగినప్పుడు మీ తొందరపాటు నిర్ణయాలకి వాళ్లు కళ్లెం వేస్తూ ఉండడమే కాక, అనుభవపాఠాల్ని మీకు స్పష్టంగా బోధిస్తారు.

**లౌకిక పరిహారం:** ప్రతీకార బుద్ధిని విడనాడండి. పొగడ్తలకి లొంగిపోకండి.
**అలౌకిక పరిహారం:** కాలభైరవస్తోత్రం లేదా శివాలయదర్శనం మంచిది.

### మీనం
**(ఫిబ్రవరి 19 - మార్చి 20)**

కడుపునిండిన వ్యక్తికి ఎలా తిండిమీద ధ్యాస ఉండదో, రాత్రి ప్రయాణంలో ఆకలేస్తే 'ఇబ్బందిపడతావు కొంత తీసుకుపో' అంటే ఎలా వద్దంటాడో అలా పనులన్నీ దాదాపుగా పూర్తి అయిపోతున్న కారణంగా ఓ తీరు గర్వం రావచ్చు. పనులని గురించిన పట్టుదలలో లోపం కన్పించవచ్చు. ఆ పట్టుదల లేనితనం వల్ల ఇబ్బందులు తలెత్తే సూచనలున్నాయి.

జాగ్రత్త. సంతానం తమ చదువుల్లో ముందంజలో ఉండే మాట యథార్థమే అయినా ప్రవర్తనలో కొంత మార్పుకి గురై మీ మాటని లెక్క చేయకపోవడం, అనవసర వస్తువులని మారాం చేసి మరీ కొనిపించడం, ఈ వ్యవహారంలో మీ భార్యాభర్తలు రెండుగా అయిపోయి ఒకరు సంతానానికి అనుకూలపక్షంగా మారి అనవసరమైన మనఃస్పర్ధలకి తావునియ్యడం వంటివి జరగవచ్చు. మంచో చెడో ఇద్దరూ ముందుగా ఒకే మాటని అనుకుని అలా నడవని పక్షంలో కుటుంబం అశాంతమయం కావచ్చు.

పిల్లలకి యంత్రవాహనాలని పొరపాటున కూడ ఈయద్దు. ప్రౌఢ వయసొచ్చినట్లయితే తగిన అనుమతి పత్రాలు ఉన్నట్లయితే వాహనాన్ని నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించి తీరాలని చెప్తూనే ఉండండి. ఏదో వార్త రావడం తదనుగుణంగా దూరప్రాంతానికి ప్రయాణించ వలసి రావడం గాని తప్ప నిసరైతే వీలైనంతవరకూ సొంతవాహనం సొంతంగా నడపడం మానండి.

నాలుగు రూపాయలైనా ఆ శ్రమని మీరు తీసుకోకండి. అద్దెలూ పాత బాకీలూ వంటివి వసూలు చేసుకునేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి తప్ప, జులుం ప్రదర్శించడం, మనుష్యులని వాళ్లమీదకి తోలడం వంటివి వద్దు.

**లౌకికపరిహారం:** ప్రయత్నాలని మానకండి.వసూళ్ల విషయంలో సాత్వికతే ఉండాలి.
**అలౌకిక పరిహారం:** లక్ష్మీ అష్టోత్తర శతనామార్చన మంచిది.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ శనివారం
22-6-2019


● ధనుష్

## విజయం అంటే భయం!

జీవితంలో ఎవరైనా అపజయానికి భయపడతారు. సినిమా తమ సినిమాలు విడుదలైన ప్రతిసారీ రిజల్ట్ ఎలా ఉంటుందో అని టెన్షన్ పడతారు. ఒక్క ఫెయిల్యూర్ వాళ్ల కెరీర్‌ని నిర్దేశిస్తుంది. అందుకే అపజయం అంటే భయం. కానీ ధనుష్ మాత్రం ఫెయిల్యూర్ కంటే సక్సెస్ తనను మరింత భయపెడుతుందని చెబుతున్నారు. ఒక యాక్టర్‌గా సక్సెస్ ఫెయిల్యూర్స్‌ను మీరెలా డీల్ చేస్తారు? అన్న ప్రశ్నను ధనుష్ ముందు ఉంచితే...''జయాపజయాలను నేను ఒకేలా తీసుకుంటాను. నా సినిమా ఆడనప్పుడు ప్రేక్షకులకు ఎందుకు కనెక్ట్ కాలేదా? అని ఆలోచిస్తా. ఫెయిల్యూర్‌ని ఎవరూ కోరుకోం కానీ నిజానికి నా సినిమా హిట్ సాధిస్తేనే నాకు ఎక్కువగా భయం ఉంటుంది. ఎందుకంటే సక్సెస్‌ను డీల్ చేయడం కష్టం. ఆ సక్సెస్ మనల్ని, మన చుట్టూ ఉన్న పరిస్థితులను మార్చేస్తుంది. జాగ్రత్తగా ఉండాలి'' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం వెట్రిమారన్, ఆర్‌ఎస్.థురై సెంథిల్ కుమార్ దర్శకత్వాల్లో హీరోగా నటిస్తూ బిజీగా ఉన్నారు ధనుష్.

# ఆస్ట్రియాలో ఆటాపాట


● ప్రభాస్



హీరోయిన్ శ్రద్ధాకపూర్‌తో కలిసి ఫారిన్‌లో ప్రేమరాగం తీస్తున్నారు ప్రభాస్. సుజీత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న చిత్రం 'సాహో'. ఇందులో శ్రద్ధాకపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు చిత్రబృందం. ఇందులో ప్రభాస్ పోలీస్ ఇన్ఫార్మర్‌గా నటిస్తున్నారని సమాచారం. శ్రద్ధాకపూర్ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో కీలక షెడ్యూల్స్‌ని కంప్లీట్ చేసిన టీమ్ ప్రస్తుతం ప్రభాస్, శ్రద్ధాలపై ఆస్ట్రియాలో ఓ పాటను చిత్రీకరిస్తోంది. ఈ పాటతో ఈ సినిమా షూట్ ఆల్మోస్ట్ పూర్తయినట్లే. ఈ సినిమాకు జిబ్రాన్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. జాకీష్రాఫ్, మందిరా బేడీ, నీల్‌నితిన్ ముఖేష్, అరుణ్‌విజయ్, 'వెన్నెల' కిశోర్ తదితరులు నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్న ఈ సినిమా ఈ ఏడాది ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మధి.

# కోపిష్టి యజమాని



ఇక్కడున్న ఫొటో చూశారుగా. ఫొటోలో ఉన్నది బాలీవుడ్ బిగ్ బి అమితాబ్‌బచ్చన్ అంటే ఆశ్చర్యపోరుగా. సుజీత్ సర్కార్ దర్శకత్వంలో అమితాబ్ బచ్చన్, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రధారులుగా 'గులాబో సీతాబో' అనే సినిమా తెరకెక్కుతోంది. తాజాగా ఈ సినిమాలోని అమితాబ్ బచ్చన్ లుక్ బయటికొచ్చింది. లక్నో నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ సినిమాలో కోపిష్టి యజమాని పాత్రలో నటిస్తున్నారట అమితాబ్. ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయాలనుకుంటున్నారు. 2015లో వచ్చిన 'పీకు' సినిమా కోసం అమితాబ్, సుజీత్ సర్కార్ కలిసి వర్క్ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత మళ్లీ వీళ్ల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఇదే.


● సల్మాన్ ఖాన్

## సల్మాన్ బిజినెస్‌మేన్

బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్‌ఖాన్ ఫ్లోరిడా వెళ్లనున్నారు. పర్సనల్ వర్క్‌పై కాదు. ప్రొఫెషనల్ వర్క్ మీదే. తన నెక్ట్స్ చిత్రం కోసమే ఈ యూఎస్ పయనం. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ హీరోగా 'ఇన్‌షా అల్లా' అనే సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఆలియా భట్ కథానాయికగా నటించనున్నారు. ఈ సినిమాలో ఫ్లోరిడాకు చెందిన నలభై ఏళ్ల బిజినెస్‌మెన్‌గా సల్మాన్ నటించబోతున్నారని బాలీవుడ్ సమాచారం. ఆగస్టు చివరి వారంలో ఆరంభం కానున్న ఈ సినిమా షూటింగ్ కోసం ఫ్లోరిడాలో లొకేషన్ హంట్ స్టార్ట్ చేశారు దర్శకుడు భన్సాలీ. ఈ సినిమా వచ్చే ఏడాది రంజాన్‌కు విడుదల కానుంది. ప్రస్తుతం 'దబాంగ్ 3' సినిమాతో బిజీగా ఉన్నారు సల్మాన్‌ఖాన్.


● 'జయం' రవి

## పాతిక... పదహారు!

నటుడిగా ఇండస్ట్రీలోకి వచ్చి 16ఏళ్లు పూర్తి కావడం ఒకటి, కెరీర్‌లో 25వ చిత్రం ప్రారంభం కావడం మరొకటి... ఇలా రెండు సెలబ్రేషన్స్‌తో ఖుషీగా ఉన్నారు తమిళ నటుడు 'జయం' రవి. లక్ష్మణ్ దర్శకత్వంలో 'జయం' రవి హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటిస్తారు. చెన్నైలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. ఈ చిత్రంలో 'జయం' రవి రైతు పాత్రలో నటించనున్నారని తెలిసింది. ఇది ఆయనకు 25వ చిత్రం కావడం విశేషం. అలాగే 2003లో 'జయం' (తెలుగు 'జయం' చిత్రానికి తమిళ రీమేక్) సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చిన రవి ఆ సినిమా హిట్‌తో 'జయం' రవిగా మారారు. ఆ సినిమా వచ్చి 16 ఏళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా తన 25వ చిత్రం ప్రారంభోత్సవంలో కేక్ కట్ చేసి సందడి చేశారు 'జయం' రవి.

# గుర్రపుస్వారీ.. కత్తిసాము

'ఆర్‌ఎక్స్ 100' సినిమాతో కుర్రకారు మనసులు దోచుకున్న పాయల్ రాజ్‌పుత్ ప్రస్తుతం గుర్రపుస్వారీ, కత్తిసాము నేర్చుకుంటున్నారు. ఇదంతా ఆమె లీడ్‌రోల్‌లో రూపొందనున్న 'అరుంధతి 2' సినిమా కోసం. శ్రీ శంఖుచక్ర ఫిలింస్ పతాకంపై కోటి తూముల ఈ సినిమా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా కోటి తూముల మాట్లాడుతూ– ''చారిత్రాత్మక, యూనివర్శల్ కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. పెద్ద బడ్జెట్‌తో, భారీ గ్రాఫికల్ చిత్రంగా రూపొందనుంది. పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ విజువలైజేషన్ గ్రాఫికల్ వర్క్స్ పనులు హాలీవుడ్ సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇందులో పాయల్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్‌కి చెందిన ప్రముఖ తారలు నటిస్తారు. కథాంశంలో భాగంగా పాయల్ గుర్రపుస్వారీ, కత్తిసాము శిక్షణ హాలీవుడ్ స్టంట్ మాస్టర్స్ వద్ద తీసుకుంటోంది. అతి త్వరలో షూటింగ్ ప్రారంభించనున్నాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో అధికారికంగా వెల్లడిస్తాం'' అన్నారు.


● పాయల్ రాజ్‌పుత్

# తలైవాతో తలపడుతున్నారు


● యోగ్‌రాజ్


● రజనీకాంత్

అవును తలైవా (నాయకుడు) రజనీకాంత్‌తో తలపడుతున్నారట యోగ్‌రాజ్ సింగ్. ఇంతకీ ఎవరీ యోగ్‌రాజ్ సింగ్? అంటే క్రికెట్‌ను ఫాలో అయ్యే వాళ్లకు ఈ పేరు సుపరిచితమే. ఇండియన్ క్రికెట్ టీమ్ తరపున కొన్ని మ్యాచులు ఆడటంతో పాటు యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ అని చాలా మందికి తెలుసు. క్రికెట్ నుంచి తప్పుకున్న తర్వాత పంజాబీ ఇండస్ట్రీలో యాక్టర్‌గా సినిమాలు చేస్తున్నారాయన. ఇప్పుడు రజనీకాంత్ తాజా చిత్రంలో నటిస్తున్నారని తెలిసింది. మురుగదాస్ దర్శకత్వంలో రజనీకాంత్ చేస్తున్న చిత్రం 'దర్బార్'. నయనతార కథానాయిక. 25 ఏళ్ల తర్వాత ఈ చిత్రంలో రజనీ పోలీస్ పాత్ర చేస్తున్నారు. ఇందులో యోగ్‌రాజ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారట. సినిమాలో వచ్చే ఫస్ట్ ఫైట్ సీక్వెన్స్‌లో రజనీ, యోగ్‌రాజ్ తలపడనున్నారని తెలిసింది. యోగ్‌రాజ్ ఇది వరకు 'సింగ్ ఈజ్ కింగ్, భాగ్ మిల్కా భాగ్' వంటి బాలీవుడ్ సినిమాల్లో కనిపించారు. 'దర్బార్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది.


● తాప్సీ

# మా బాధ్యత పెరిగింది

''గేమ్ ఓవర్' విజయంతో మా సంస్థపై బాధ్యత మరింతగా పెరిగింది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఈ విజయం వారిదే'' అని నిర్మాతలు ఎస్.శశికాంత్, చక్రవర్తి రామచంద్ర అన్నారు. తాప్సి లీడ్ రోల్‌లో అశ్విన్ శరవణన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఓవర్'. తెలుగు, తమిళ చిత్రాల నిర్మాణ సంస్థ 'వై నాట్ స్టూడియోస్' నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఎస్.శశికాంత్, చక్రవర్తి రామచంద్ర మాట్లాడుతూ– ''మా సంస్థ గతంలో తెలుగులో నిర్మించిన 'లవ్ ఫెయిల్యూర్, గురు' చిత్రాల విజయాల సరసన 'గేమ్ ఓవర్' నిలిచింది. మూడు భాషల్లో సినిమా విజయం సాధించింది. విజయోత్సవ వేడుకలు ఒకేచోట నిర్వహించనున్నాం'' అన్నారు. ''గేమ్ ఓవర్' ప్రేక్షకులకు ఓ సరికొత్త థ్రిల్లింగ్‌ను కలిగిస్తుందని విడుదలకు ముందు చెప్పాను.. ఇప్పుడు ఆ మాట నిజమైంది'' అన్నారు తాప్సీ. ''గేమ్ ఓవర్' సినిమా తెలుగులో నాకు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టింది'' అని అశ్విన్ శరవణన్ అన్నారు.


● సుమయ

## ఓ ప్రేమకథ

రామ్ ప్రణీత్, సుమయ జంటగా నిఖిలేష్ తొగరి దర్శకత్వంలో మహేష్ మొగుళ్ళూరి నిర్మించిన చిత్రం 'ప్రేమజంట'. స్క్రీన్ మ్యాక్స్ పిక్చర్స్ పతాకంపై దగ్గుబాటి వరుణ్ ఈ నెల 28న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ–రిలీజ్ ఫంక్షన్‌లో డైరెక్టర్ సాగర్, టి. ప్రసన్నకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని, ఆడియో సీడీలను విడుదల చేశారు. ''నిర్మాత మహేశ్ గారు పెట్టిన డబ్బు తిరిగి రావాలి''అన్నారు తుమ్మలపల్లి రామసత్యనారాయణ. ''మా బ్యానర్‌లో ఈ సినిమా విడుదల కాబోతుండటం హ్యాపీగా ఉంది. కంటెంట్ తెలియగానే రిలీజ్ చేద్దామని డిసైడ్ అయ్యాం. మంచి సబ్జెక్ట్‌తో వస్తున్నాం'' అన్నారు వరుణ్. ''గ్రేస్‌ఫుల్ అబ్బాయిలు, బ్యూటిఫుల్ అమ్మాయిల ప్రేమే ఈ చిత్రం'' అన్నారు మహేశ్. ''దర్శకుడు కావాలనే నా 13 ఏళ్ల కల నెరవేరింది'' అన్నారు దర్శకుడు నిఖిలేష్.

# మళ్లీ తెలుగులో నటించాలని ఉంది

చార్మి అందరికీ తెలుసు. చార్మిలా తెలిసి ఉండకపోవచ్చు. అక్కినేని నాగేశ్వరరావు, లక్ష్మీ జంటగా నటించిన 'ప్రాణదాత' (1992) సినిమా చూసినవారికి చార్మిలా తెలిసే ఉంటుంది. అందులో ఏయన్నార్, లక్ష్మీ కూతురిగా నటించిందామె. ఆ తర్వాత భానుమతీ రామకృష్ణ స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'అసాధ్యురాలు'లో నటించింది. 'ప్రేమ ఖైదీ'లో మాలాశ్రీ ఫ్రెండ్‌గా నటించింది. ఆ తర్వాత కనిపించలేదు. ఇప్పుడు మళ్లీ తెలుగులో కనిపించాలనుకుంటోంది. ''అప్పట్లో తెలుగులో హీరోయిన్‌గా నటించాను. ఇప్పుడు తమిళ, మలయాళ భాషల్లో అక్క, వదిన, అమ్మ పాత్రలు చేస్తున్నాను. అవకాశం వస్తే తెలుగులోనూ ఆ పాత్రలు చేయాలని ఉంది'' అన్నారు చార్మిలా. ప్రముఖ నటుడు శివాజీ గణేశన్ నటించిన 'నల్లదొరై కుటుంబం' సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించింది. హీరోయిన్ కావాలన్నది తన కల. మలయాళ చిత్రం 'ధనమ్' ద్వారా ఆ కల నెరవేరింది. ప్రశాంత్ సరసన చేసిన 'కిళక్కే వరుమ్ పాట్టు' ద్వారా కథానాయికగా తమిళ్‌కి పరిచయం అయ్యారు. తమిళంలో పది సినిమాలకుపైగా, మలయాళంలో 40 సినిమాలకు పైగా కథానాయికగా నటించారు. హీరోయిన్‌గా బిజీగా ఉన్నప్పుడే పెళ్లి చేసుకున్న చార్మిలా బాబు పుట్టాక ఇంటిపట్టున ఉండాలనుకున్నారు. ''మా అత్తగారితో నాకు సఖ్యత లేకుండాపోయింది. నా భర్తతో కూడా చిన్న చిన్న సమస్యలు వచ్చాయి. దాంతో విడిపోయాం. అయితే పిల్లలకు తల్లీదండ్రీ ఇద్దరూ ముఖ్యమే కాబట్టి నెలకోసారి ఆయన వచ్చి బాబుని చూసి వెళతారు. మేం ఫ్రెండ్లీగా ఉంటాం'' అన్నారు చార్మిలా. సింగిల్ పేరెంట్‌గా కొడుకు బాధ్యతను మోస్తున్న చార్మిలాకి తల్లి, పెద్దమ్మ, బాధ్యతలు కూడా ఉన్నాయి. అందుకే ఇండస్ట్రీకి రీ–ఎంట్రీ ఇచ్చారు. ఎక్కువ సినిమాల్లో నటించాలనుకుంటున్నారు. ప్రస్తుతం తమిళంలో ఆమె 'కన్నిరాశి', మలయాళంలో 'కొచ్చిన్ షాదీ అట్ చెన్నై 03', ప్రియపట్టవర్'.. ఇలా నాలుగైదు సినిమాలు చేస్తున్నారు. ''అమ్మ, వదిన, అక్క పాత్రలంటే ఒక్కో సినిమాకి ఒకటీ రెండు రోజుల్లో షూటింగ్ చేసేస్తారు. నెలకి మహా అయితే ఓ పది రోజులు షూటింగ్ ఉంటుంది. అదే ఎక్కువ భాషల్లో చేస్తే ఎక్కువ సినిమాలు చేయొచ్చు కదా. అందుకే తెలుగులోకి మళ్లీ ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు చార్మిలా.


● చార్మిలా











కోహ్లి, హార్దిక్

ప్రపంచ కప్‌లో అజేయంగా దూసుకెళ్తున్న భారత్‌కు మరో గెలుపును తేలికగా తన ఖాతాలో జమ చేసుకునే అవకాశం. సంచలనాలు సృష్టిస్తుందనుకుంటే... కొంతైనా ప్రతిఘటించ లేకపోతున్న అఫ్గానిస్తాన్‌ను కుమ్మేసి పాయింట్లతో పాటు నెట్ రన్‌రేట్‌ను మెరుగుపర్చుకునే మార్గం. ఇప్పటిదాకా పేస్ బలమున్న ప్రత్యర్థులపై నెగ్గుతూ వచ్చిన కోహ్లి సేన... ఇప్పుడు స్పిన్ ప్రధాన అస్త్రమైన జట్టును ఎదుర్కోనుంది. ఇందులోనూ పైచేయి సాధిస్తే ఓ విధంగా పరిపూర్ణ సన్నాహంతో సెమీస్ రేసులో ముందుకెళ్లే వీలుంటుంది.

# కూనను కుమ్మేస్తే...

**నేడు అఫ్గానిస్తాన్‌తో భారత్ పోరు • భువీ స్థానంలో షమీ • విజయాల ఊపులో కోహ్లి సేన**
**ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న ప్రత్యర్థి • మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**సౌతాంప్టన్:** వరుసగా గట్టి ప్రత్యర్థుల పని పట్టి గెలుపు ఊపులో ఉన్న టీమిండియాకు... ఆ ఒత్తిడి నుంచి కాస్త ఊపిరి పీల్చుకునే అవకాశం. అఫ్గానిస్తాన్ రూపంలో బలహీన జట్టుతో శనివారం జరుగనున్న మ్యాచ్ ఇందుకు వీలు కల్పిస్తోంది. ఎక్కడా తగ్గకుండా ఊహించినట్లే ఆడుతూ వస్తున్న కోహ్లి సేనకు... ఈ క్రమంలో పనిలో పనిగా ఒకరిద్దరు ఆటగాళ్లకు తగిన ప్రాక్టీస్ కల్పించేదిగానూ మారనుంది. మరోవైపు అనుకున్నట్లు రాణించలేకపోతున్న అఫ్గానిస్తాన్ పోరాటంతో పరువు నిలబెట్టుకోవాలని చూస్తోంది. జోరు మీదున్న భారత్‌ను అడ్డుకోవడం వారికి ఎంతవరకు సాధ్యమో చూడాలి.

**ఆ ఒక్క మార్పుతోనే!**

భువనేశ్వర్ స్థానంలో మొహమ్మద్ షమీని తీసుకోవడం ఒక్కటే భారత్ తుది జట్టులో చేయనున్న మార్పుగా కనిపిస్తోంది. ఫిట్‌నెస్ జాగ్రత్తల దృష్ట్యా ఆల్ రౌండర్ విజయ్ శంకర్‌ను ఆడించడం ఇబ్బందికరంగా భావిస్తే దినేశ్ కార్తీక్, రిషభ్ పంత్‌లలో ఒకరికి స్థానం దక్కొచ్చు. మిడిలార్డర్‌లో కేదార్ జాదవ్‌కు ఇంతవరకు బ్యాటింగ్ ప్రాక్టీస్ దక్కలేదు. మూడు మ్యాచ్‌ల్లో అతడు కేవలం 8 బంతులే ఎదుర్కొన్నాడు. ముమ్ముందు అవసరాలరీత్యా జాదవ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ చేసే వీలుంది. ఓపెనర్ రోహిత్ రెండు సెంచరీలతో ఫామ్‌ను చాటగా, కెప్టెన్ కోహ్లి నుంచి శతకం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇకపై టోర్నీ అంతా పూర్తిస్థాయి ఓపెనర్‌గా బాధ్యత మోయాల్సిన నేపథ్యంలో అందుకు తగినట్లుగా సిద్ధమయ్యేందుకు కేఎల్ రాహుల్‌కు ఈ మ్యాచ్ సరైన వేదిక. బుమ్రా, షమీల పేస్‌ను ఎదుర్కోనడమే సవాలంటే... స్పిన్ ద్వయం చహల్, కుల్దీప్‌లను కాచుకోవడం అఫ్గాన్ బ్యాట్స్‌మెన్‌కు శక్తికి మించిన పనే. పాక్‌తో మ్యాచ్‌లో భువనేశ్వర్ వంటి బౌలర్ అర్ధంతరంగా వైదొలగినా, మన బౌలింగ్ వనరుల లోతును చాటుతూ హార్దిక్, విజయ్ కర్తవ్యాన్ని నెరవేర్చారు. భారీ స్కోరు సాధించి తద్వారా రన్‌రేట్‌ను మెరుగుపర్చుకునే వ్యూహంతో టాస్ గెలిచిన జట్టు మొదట బ్యాటింగ్‌కే మొగ్గుచూపే వీలుంది.


నబీ, రషీద్


షమీ, బుమ్రా

**కూన నిలుస్తుందా?**

'పరుగులు కాదు... 50 ఓవర్లు నిలిచి ఆడాలని బ్యాట్స్‌మెన్‌ను కోరుతున్నా.' ...ఇది అఫ్గాన్ కెప్టెన్ గుల్బదిన్ నైబ్ మాట. హష్మతుల్లా షాహిది అర్ధ సెంచరీ కారణంగా ఇంగ్లండ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఈ కోరిక నెరవేరింది. కానీ, మోర్గాన్ విధ్వంసంతో వారి ఆత్మవిశ్వాసంపై పెద్ద దెబ్బే పడింది. ముఖ్యంగా ఆ చేదు జ్ఞాపకాల నుంచి మిస్టరీ స్పిన్నర్ రషీద్ ఖాన్ తేరుకోకుంటే జట్టు ప్రదర్శన మరింత పడిపోవడం ఖాయం. ఇప్పటివరకు అతడిపై పైచేయి సాధించిన వారంతా లెఫ్ట్ హ్యాండర్లే. భారత జట్టులో ఎడంచేతి వాటం బ్యాట్స్‌మన్ లేకపోవడం రషీద్‌కు కొంత ఊరట. అయితే, అనవసర మార్పులు టీంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. ఫామ్‌లో ఉన్న రహ్మత్ షాకు తోడు నూర్ అలీ, కెప్టెన్ నైబ్ పరుగులు చేస్తేనే పోటీ ఇవ్వగలుగుతుంది.

**ముఖాముఖి రికార్డు**

రెండు జట్ల మధ్య ఇప్పటి వరకు రెండు వన్డేలే జరిగాయి. అవి కూడా 2014, 2018 ఆసియా కప్‌లలో భాగంగానే కావడం గమనార్హం. వీటిలో భారత్ ఒక మ్యాచ్ నెగ్గగా... మరోటి 'టై' అయింది.

బ్యాటింగ్‌కు అనుకూలమైనప్పటికీ కొంత భిన్నమైన పిచ్. మైదానం చిన్నది. ఆట పూర్తిగా సాగిన గత ఐదు వన్డేల్లో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు సగటు స్కోరు 286 మాత్రమే. మే నెలలో ఇంగ్లండ్-పాకిస్తాన్ మధ్య జరిగిన

### పిచ్, వాతావరణం

వన్డేలో మాత్రం ఏకంగా 734 పరుగులు నమోదయ్యాయి. ప్రస్తుత కప్‌లో వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో 213 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ 33.1 ఓవర్లలోనే ఛేదించింది. భారత్... దక్షిణాఫ్రికాపై తొలి మ్యాచ్‌ను ఇక్కడే ఆడింది. 228 పరుగుల లక్ష్యాన్ని మన జట్టు 47.3 ఓవర్లలో అందుకుంది. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** రాహుల్, రోహిత్, కోహ్లి (కెప్టెన్), విజయ్ శంకర్/దినేశ్ కార్తీక్/రిషభ్ పంత్, ధోని, జాదవ్, హార్దిక్, కుల్దీప్, చహల్, షమీ, బుమ్రా.
**అఫ్గానిస్తాన్:** నూర్ అలీ, గుల్బదిన్ నైబ్ (కెప్టెన్), రహ్మత్ షా, హష్మతుల్లా, అస్గర్, నబీ, రషీద్ ఖాన్, ఇక్రమ్, ఆఫ్తాబ్ ఆలమ్, దౌలత్, ముజీబ్.

### ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 0.849 | 10 |
| న్యూజిలాండ్ | 5 | 4 | 0 | 1 | 1.591 | 9 |
| ఇంగ్లండ్ | 6 | 4 | 2 | 0 | 1.457 | 8 |
| భారత్ | 4 | 3 | 0 | 1 | 1.029 | 7 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | -1.119 | 6 |
| బంగ్లాదేశ్ | 6 | 2 | 3 | 1 | -0.407 | 5 |
| వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | 0.272 | 3 |
| దక్షిణాఫ్రికా | 6 | 1 | 4 | 1 | -0.193 | 3 |
| పాకిస్తాన్ | 5 | 1 | 3 | 1 | -1.933 | 3 |
| అఫ్గానిస్తాన్ | 5 | 0 | 5 | 0 | -2.089 | 0 |

### ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ x న్యూజిలాండ్
వేదిక: మాంచెస్టర్
సాయంత్రం 6 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం

# లంక వీరంగం

**శ్రీలంక సీనియర్ ఆటగాళ్లు మాథ్యూస్, మలింగ. ఒకరు బ్యాట్‌తో, మరొకరు బంతితో హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్‌కు దిమ్మతిరిగే షాకిచ్చారు. ఈ టోర్నీలో డకౌట్లతో తీవ్ర విమర్శలెదుర్కొన్న మాథ్యూస్ అజేయ పోరాటంతో జట్టుకు గౌరవప్రద స్కోరు అందించాడు. తర్వాత మలింగ తన అనుభవాన్నంత రంగరించి ఇంగ్లిష్ బ్యాట్స్‌మెన్‌ను దెబ్బకొట్టాడు. దీంతో లంక ప్రపంచకప్‌లో రెండో విజయాన్ని నమోదు చేసింది.**


మాథ్యూస్
మలింగ


స్టోక్స్

**లీడ్స్:** 'ఈ ప్రపంచకప్‌లో మేమూ ఆడుతున్నాం... మావైపూ కన్నెత్తి చూడండి' అనే రీతిలో విజయం సాధించింది శ్రీలంక. శుక్రవారం జరిగిన పోరులో ఆతిథ్య ఇంగ్లండ్‌కు అనూహ్య షాకిస్తూ 20 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా శ్రీలంక 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది. మాథ్యూస్ (115 బంతుల్లో 85 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చక్కని పోరాటం చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్, మార్క్ వుడ్ చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్ 47 ఓవర్లలో 212 పరుగుల వద్ద ఆలౌటైంది. స్టోక్స్ (89 బంతుల్లో 82 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయంగా నిలిచాడు. రూట్ (89 బంతుల్లో 57; 3 ఫోర్లు) రాణించాడు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మలింగ (4/43) ఇంగ్లండ్‌ను వణికించాడు. స్పిన్నర్ ధనంజయ 3 వికెట్లు తీశాడు.

### ఇంగ్లండ్‌పై జయభేరి

- మాథ్యూస్ బాధ్యతాయుత ఇన్నింగ్స్
- గెలిపించిన మలింగ, ధనంజయ
- స్టోక్స్, రూట్ శ్రమ వృథా

**ఆదుకున్న మాథ్యూస్...**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక ఆదిలోనే ఓపెనర్లు కరుణరత్నే (1), కుశాల్ పెరీరా (2) వికెట్లను కోల్పోయింది. అప్పుడు జట్టు స్కోరు 2/3. ఈ దశలో అవిష్క ఫెర్నాండో (39 బంతుల్లో 49; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (68 బంతుల్లో 46; 2 ఫోర్లు) ఆదుకున్నారు. ఫెర్నాండో ఔటయ్యాక వచ్చిన మాథ్యూస్ అద్భుతమైన పోరాటం చేశాడు. నాలుగో వికెట్‌కు కుశాల్ మెండిస్‌తో కలిసి 71 పరుగులు జోడించిన మాథ్యూస్... ధనంజయ (29)తో కలిసి ఆరో వికెట్‌కు 57 పరుగులు జతచేశాడు. జీవన్ (0) డకౌట్ కాగా, టెయిలెండర్లతో కలిసి జట్టుకు పోరాడే స్కోరును అందించాడు.

**మలింగ కూల్చేశాడు...**

ఇటీవల 300 పైచిలుకు స్కోర్లను అవలీలగా సాధిస్తున్న ఇంగ్లండ్‌కు 233 పరుగుల లక్ష్యం ఏమంత కష్టమే కాదు. కానీ పిచ్ పరిస్థితులతో పాటు మలింగ వీరంగం ముందు ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ తోకముడిచారు. అతని తొలి ఓవర్లోనే బెయిర్‌స్టో (0) డకౌటయ్యాడు. కాసేపటికి విన్స్ (18 బంతుల్లో 14; 2 ఫోర్లు) ఆటా ముగించాడు. ఈ దశలో రూట్, కెప్టెన్ మోర్గాన్ (35 బంతుల్లో 21; 2 ఫోర్లు) ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు కష్టపడ్డారు. కానీ మలింగ ఆ అవకాశం ఇవ్వలేదు. జట్టు స్కోరు 73 పరుగుల వద్ద మోర్గాన్‌ను ఉదాన ఔట్‌చేస్తే... అర్ధసెంచరీ పూర్తి చేసిన రూట్, కీలకమైన బట్లర్ (9 బంతుల్లో 10; ఫోర్) వికెట్లను మలింగ పడేశాడు. 144 పరుగులకే 5 వికెట్లను కోల్పోయిన ఇంగ్లండ్ కష్టాల్లో పడింది. ధనంజయ డిసిల్వా (3/32) లోయర్ ఆర్డర్ పనిపట్టడంతో ఇంగ్లండ్ కోలుకోలేకపోయింది. 186 స్కోరు వద్ద తొమ్మిదో వికెట్ కోల్పోవడంతో స్టోక్స్ వరుసగా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కానీ వుడ్ (0)ను నువాన్ ప్రదీప్ ఔట్ చేయడంతో ఇంగ్లండ్‌పై లంక విజయఢంకా మోగించింది.

### స్కోరు వివరాలు

**శ్రీలంక ఇన్నింగ్స్:** కరుణరత్నే (సి) బట్లర్ (బి) ఆర్చర్ 1; కుశాల్ పెరీరా (సి) అలీ (బి) వోక్స్ 2; ఫెర్నాండో (సి) రషీద్ (బి) వుడ్ 49; కుశాల్ మెండిస్ (సి) మోర్గాన్ (బి) రషీద్ 46; మాథ్యూస్ (నాటౌట్) 85; జీవన్ మెండిస్ (సి అండ్ బి) రషీద్ 0; ధనంజయ డిసిల్వా (సి) రూట్ (బి) ఆర్చర్ 29; తిసారా పెరీరా (సి) రషీద్ (బి) ఆర్చర్ 2; ఉదాన (సి) రూట్ (బి) వుడ్ 6; మలింగ (బి) వుడ్ 1; ప్రదీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 232. వికెట్ల పతనం:** 1-3, 2-3, 3-62, 4-133, 5-133, 6-190, 7-200, 8-209, 9-220.
**బౌలింగ్:** వోక్స్ 5-0-22-1, ఆర్చర్ 10-2-52-3, వుడ్ 8-0-40-3, స్టోక్స్ 5-0-16-0, మొయిన్ అలీ 10-0-40-0, రషీద్ 10-0-45-2, రూట్ 2-0-13-0.

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** విన్స్ (సి) కుశాల్ మెండిస్ (బి) మలింగ 14; బెయిర్‌స్టో (ఎల్బీడబ్ల్యూ) (బి) మలింగ 0; రూట్ (సి) కుశాల్ పెరీరా (బి) మలింగ 57; మోర్గాన్ (సి అండ్ బి) ఉదాన 21; స్టోక్స్ (నాటౌట్) 82; బట్లర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మలింగ 10; మొయిన్ అలీ (సి) ఉదాన (బి) ధనంజయ డిసిల్వా 16; వోక్స్ (సి) కుశాల్ పెరీరా (బి) ధనంజయ డిసిల్వా 2; రషీద్ (సి) కుశాల్ పెరీరా (బి) ధనంజయ 1; ఆర్చర్ (సి) తిసారా పెరీరా (బి) ఉదాన 3; వుడ్ (సి) కుశాల్ పెరీరా (బి) ప్రదీప్ 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (47 ఓవర్లలో ఆలౌట్) 212. వికెట్ల పతనం:** 1-1, 2-26, 3-73, 4-127, 5-144, 6-170, 7-176, 8-178, 9-186, 10-212.
**బౌలింగ్:** మలింగ 10-1-43-4, ప్రదీప్ 10-1-38-1, ధనంజయ డిసిల్వా 8-0-32-3, తిసారా పెరీరా 8-0-34-0, ఉదాన 8-0-41-2, జీవన్ 3-0-23-0.

# 'వాంఖెడే' లీజు పొడిగించాలంటే...

**రూ.120 కోట్లు చెల్లించాలన్న మహారాష్ట్ర సర్కారు**



**ముంబై:** వాంఖెడే స్టేడియం లీజును పొడిగించాలంటే ముందు రూ. 120 కోట్లు కట్టాలని మహారాష్ట్ర ప్రభుత్వం ముంబై క్రికెట్ సంఘాన్ని (ఎంసీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శాసనసభలో వచ్చిన చర్చకు ఆ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. మొత్తం బకాయిలన్నీ చెల్లించాలని ముంబై సిటీ కలెక్టర్ ఎంసీఏకు నోటీసులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. ఎంసీఏ ఆధీనంలో వాంఖడే స్టేడియం ఉంది. ఇందులోనే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రధాన కార్యాలయం కూడా ఉంది. అయితే ఆ స్టేడియం లీజ్ గడువు గతేడాది ఫిబ్రవరి 5తో ముగిసింది. దీంతో ఓ ఏడాది (2017) ముందే రెన్యువల్ కోసం ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు ఎంసీఏ లేఖ రాసింది. అరేబియా సముద్ర తీరంలో ఉన్న ఈ ప్రతిష్టాత్మక వాంఖడే స్టేడియంలో టీమిండియాకు ఎన్నో మధురస్మృతులున్నాయి. 2011లో ఇక్కడే జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారత్... లంకను ఓడించి జగజ్జేతగా నిలిచింది.

# ఏదో 'ఒకటి' తేల్చుకోండి

**గంగూలీ, లక్ష్మణ్‌లకు బీసీసీఐ ఎథిక్స్ అధికారి సూచన**



**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో ఫ్రాంచైజీలకు మెంటారింగ్, క్రికెట్ సలహా మండలి (సీఏసీ) సభ్యుల హోదాల్లో ఏదో ఒకదాంట్లో మాత్రమే కొనసాగేలా నిర్ణయం తీసుకోవాలని దిగ్గజ క్రికెటర్లు సౌరభ్ గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్‌లకు బీసీసీఐ ఎథిక్స్ అధికారి జస్టిస్ డీకే జైన్ అల్టిమేటం జారీ చేశారు. గత నెలలో సీఏసీ నుంచి సచిన్ తప్పుకొన్నాడు కాబట్టి అతడికి పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం వర్తించదని ఆయన పేర్కొన్నారు. 'ఒక వ్యక్తి, ఒక పదవి అన్నది లోధా కమిటీ సిఫార్సుల్లో అతి కీలకమైనది. దానిని అమలు చేయడానికే నేను ప్రయత్నిస్తున్నాను' అని ఆయన పేర్కొన్నారు. గంగూలీ ఈ ప్రపంచ కప్‌లో వ్యాఖ్యానం చేస్తున్నాడు. బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగానూ కొనసాగుతున్నాడు. మరోవైపు పోటీ క్రికెట్ ఆడుతున్న ఇర్ఫాన్ పఠాన్, రాబిన్ ఉతప్పలు, ప్రస్తుత ప్రపంచ కప్ గురించి కామెంటరీ చేస్తుండటమూ పరస్పర విరుద్ధ ప్రయోజనాల కిందకు వస్తుందని జైన్ పరోక్షంగా ధ్రువీకరించారు.



# కాంస్యం నెగ్గిన ప్రణతి

**న్యూఢిల్లీ:** ఆసియా సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ కాంస్య పతకాన్ని సాధించింది. మంగోలియాలోని ఉలాన్‌బాటర్‌లో జరుగుతున్న ఈ చాంపియన్‌షిప్‌లో బెంగాల్‌కు చెందిన 23 ఏళ్ల ప్రణతి వాల్ట్ విభాగంలో మూడో స్థానాన్ని సంపాదించింది. ఎనిమిది మంది పాల్గొన్న ఫైనల్లో ప్రణతి 13.384 పాయింట్లు స్కోరు సాధించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. యు లిన్‌మిన్ (చైనా-14.350 పాయింట్లు) స్వర్ణం, అయాక సకాగుచి (జపాన్-13.584 పాయింట్లు) రజతం సాధించారు.

# జూలై 20 నుంచి ప్రో కబడ్డీ లీగ్

- హైదరాబాద్ వేదికగా తొలి మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌తో యు ముంబా 'ఢీ'
- అక్టోబర్ 19న ఫైనల్

**ముంబై:** ప్రో కబడ్డీ లీగ్ ఏడో సీజన్ షెడ్యూల్ విడుదలైంది. జూలై 20 నుంచి అక్టోబర్ 19 వరకు ఏడో సీజన్ జరుగుతుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జూలై 20న తెలుగు టైటాన్స్, యు ముంబా జట్ల మధ్య మ్యాచ్‌తో లీగ్ ప్రారంభమవుతుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు బుల్స్‌తో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ తలపడుతుంది. అక్టోబర్ 19న జరిగే ఫైనల్‌తో లీగ్ ముగుస్తుంది. ఈసారి మ్యాచ్‌లు రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మొదలవుతాయి. మొత్తం 12 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో ప్రతి జట్టు మరో జట్టుతో రెండేసిసార్లు తలపడుతుంది. లీగ్ దశ ముగిశాక పాయింట్ల పట్టికలో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్ దశకు అర్హత సాధిస్తాయి. తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్‌కు చేరుకుంటాయి. మూడు నుంచి ఆరు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లు ఆడతాయి. అక్టోబర్ 14న జరిగే తొలి ఎలిమినేటర్‌లో ఆరో స్థానంలో నిలిచిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... రెండో ఎలిమినేటర్‌లో ఐదో ర్యాంక్‌లో నిలిచిన జట్టుతో నాలుగో ర్యాంక్‌లో నిలిచిన జట్టు ఆడుతుంది. అక్టోబర్ 16న జరిగే తొలి సెమీఫైనల్లో ఎలిమినేటర్-1 విజేతతో లీగ్ టాపర్; రెండో సెమీఫైనల్లో ఎలిమినేటర్-2 విజేతతో లీగ్ రెండో ర్యాంకర్ ఆడతాయి. అక్టోబర్ 19న ఫైనల్ జరుగుతుంది. మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రసారమవుతాయి.

### ప్రో కబడ్డీ లీగ్-7లో బరిలో ఉన్న జట్లు

తెలుగు టైటాన్స్, యు ముంబా, బెంగళూరుబుల్స్, పట్నాపైరేట్స్, గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్, తమిళ్ తలైవాస్, జైపూర్ పింక్ పాంథర్స్, పుణేరి పల్టన్, హరియాణా స్టీలర్స్, యూపీ యోధ, బెంగాల్ వారియర్స్, దబంగ్ ఢిల్లీ.

# సింగిల్స్ విజేత లక్ష్మిసాహితి రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ), చండీగఢ్ లాన్ టెన్నిస్ సంఘం (సీఎల్‌టీఏ) ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సీనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వుటుకూరు లక్ష్మిసాహితి రెడ్డి చాంపియన్‌గా అవతరించింది. చండీగఢ్‌లో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో లక్ష్మిసాహితి 7-5, 6-4తో సాల్సా అహిర్ (మహారాష్ట్ర)పై విజయం సాధించింది. కడప జిల్లా పులివెందుల ప్రాంతానికి చెందిన లక్ష్మిసాహితి క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగుపెట్టింది. టైటిల్ గెలిచే క్రమంలో ఆమె ప్రత్యర్థులకు ఒక్కసెట్ కూడా కోల్పోకపోవడం విశేషం. తొలి రౌండ్‌లో లక్ష్మిసాహితి 6-2, 6-2తో ఆర్తి మునియన్ (తమిళనాడు)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 7-6 (8/6), 6-1తో టాప్ సీడ్ యుబ్రాని బెనర్జీ (పశ్చిమ బెంగాల్)పై, క్వార్టర్ ఫైనల్లో 6-2, 6-4తో ఆరో సీడ్ ప్రేరణ బాంబ్రీ (ఢిల్లీ)పై, సెమీఫైనల్లో 6-4, 6-3తో నాలుగో సీడ్ శ్రావ్య శివాని (తెలంగాణ)పై విజయం సాధించింది.

# 'షూటింగ్ లేకపోతే కఠిన నిర్ణయం'

**న్యూఢిల్లీ:** 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో షూటింగ్ క్రీడ లేకపోతే కఠిన నిర్ణయం తప్పదని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తెలిపింది. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగే ఈ మెగా ఈవెంట్ నుంచి షూటింగ్‌ను తొలగించారు. ఈ నేపథ్యంలో ఐఓఏ కార్యదర్శి రాజీవ్ మెహతా మాట్లాడుతూ 'షూటింగ్ భారత్‌కు పట్టున్న క్రీడ. ఈ క్రీడను ఉంచాలని సీజీఎఫ్ సమావేశంలో మా వాదన వినిపించినా... షూటింగ్‌ను పక్కన బెట్టారు. అయితే ఇంతటితో ఈ ప్రక్రియ ముగిసిపోలేదు. ఇంకా ఒక నెల గడువుంది. ఓటింగ్ అనంతరం తుది క్రీడల జాబితా వెలువడుతుంది. ఒక వేళ షూటింగ్‌కు చోటులేకపోతే మేం కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదు' అని అన్నారు.

# ఆటోను ఢీకొట్టిన లారీ

- ఆరుగురు దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు
- మృతులు మహబూబాబాద్ జిల్లా చింతపల్లి వాసులు


అఫ్జల్ కుటుంబ సభ్యులు

**చిలుకూరు:** ఆటోను ఓ లారీ ఢీకొనడంతో ఒకే కుటుంబానికి ఆరుగురు వ్యక్తులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చింతపల్లికి చెందిన షేక్ అఫ్జల్‌పాషా (48), గౌసియాబేగం (40), మహమూదాబేగం (35), మహిన్ (15), ముస్కాన్ (12), షేక్ మహబూబ్ పాషా (40) సూర్యాపేట జిల్లా కోదాడలో ఉంటున్న తన చెల్లెలు అక్తర్‌బేగం ఇంట్లో ఫంక్షన్ కోసం బుధవారం వచ్చారు. మరుసటి రోజు హుజూర్‌నగర్ నుంచి కోదాడ వచ్చేందుకు లోకల్ ఆటో మాట్లాడుకున్నారు. చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామ శివారులోకి రాగానే ఆటో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో షేక్ అఫ్జల్‌పాషా, గౌసియాబేగం, మహమూదాబేగం, మహిన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలైన ముస్కాన్, షేక్ మహబూబ్ పాషా, ఆటోడ్రైవర్ నాగుల్ మీరాలను హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా ముస్కాన్ మార్గమధ్యలో చనిపోయింది. మహబూబ్ పాషా, డ్రైవర్‌ను మెరుగైన చికిత్స అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహబూబ్ పాషా మృతి చెందాడు. జాకీర్ పాషా, ఆటోడ్రైవర్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం :: ఖమ్మం**
**ఇ–ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన**
NIT No. 05/DB/KMC/1624/2019-20 తేది: 24–06–2019
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం జిల్లా, తెలంగాణవారు సంక్షిప్త టెండరు ప్రకటన ప్రకారం ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ క్రింద దిగువ తెలిపిన విధంగా టెండర్లు కోరుతున్నారు: మొత్తం పనుల సంఖ్య: 74 నం.లు. పనుల స్వభావం: సివిల్ మరియు ఇతర పనులు– 74 నం.లు. మొత్తం పని విలువ: రూ. 1162.70 లక్షలు. కార్యాలయంలో సంప్రదించుటకు అధికారి పేరు & చిరునామా: అసిస్టెంట్ ఇంజనీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మొబైల్: 9705371670 (అసిస్టెంట్ ఇంజనీర్). తదుపరి నిబంధనలను ఇ–ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వద్ద http://tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO.No.177-PP/CL/Advt/1/2019-20, Dt: 21.06.19

**A.P. STATE AGRO INDUSTRIES DEVELOPMENT CORPORATION LTD.**
(A GOVT. OF A.P. UNDERTAKING)
Admn.Office: D.No. 55-17-2 to 4, 5th Floor, Stalin Corporate Building, Road No.2, C-Block, Industrial Estate, Autonagar, Vijayawada - 520 007.
Ph:0866-2556803, Fax: 0866-2556804, Website: www.apagros.org, E.mail: apagrospeshi@gmail.com
NO. AGROS/FMD/EOI/ST Lab/2018-19 Date : 20.06.2019
**EOI NOTICE INVITING SEALED QUOTATIONS**
Sealed Quotations are invited from reputed manufacturers and importers for supply commissioning validation of equipment to Soil Testing labs and Pesticide Testing labs of Department of Agriculture, Andhra Pradesh. The details of EOI Schedule cost, submission particulars etc., may be seen in our website: www.apagros.org Sd/- V. C. AND MANAGING DIRECTOR

**అనుబంధం - I**
**తెలంగాణ ప్రభుత్వం**
**ఆర్థిక శాఖ**
**8 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీస్) 2027 వేలం**

| | | |
|---|---|---|
| మొత్తం | : | రూ. 1800.00 కోట్లు |
| జారీ ధర | : | ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : | 8 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ వ్యవధి | : | మొత్తం అందిన వెంటనే నోటీసు లేకుండా 25.06.2019న వ్యాపార వేళల తరువాత తక్షణమే ముగుస్తుంది. |

పైన తెలిపిన రుణానికి తెలంగాణ ప్రభుత్వం సబ్‌స్క్రిప్షన్లను అభ్యర్థిస్తోంది. పూర్తి వివరాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబై నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.
కె.రామకృష్ణ రావు
ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ, ఆర్థిక శాఖ
DIPR RO No.398-DP/CL/Advt/1/2019-20, తేది: 21.6.2019

# బీడులన్నీ సస్యశ్యామలం

## గోదావరి జలాలతో రైతుల కాళ్లు కడుగుతాం : కేటీఆర్

- మూడేళ్లలో కాళేశ్వరం పూర్తి
- నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా
- ఎగువమానేరులో పూజలు


శుక్రవారం ఎగువమానేరు జలాశయంలో పూజలు చేస్తున్న కేటీఆర్

**సిరిసిల్ల:** తెలంగాణ బీడు భూములకు కృష్ణా, గోదావరి నీళ్లను మళ్లించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అనేక సాగునీటి పథకాలకు శ్రీకారం చుట్టారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె.తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయంలో శుక్రవారం ఆయన పూజలు నిర్వహించారు. కాళేశ్వరం సాగు నీటి పథకం సంబురాల్లో భాగంగా ఎగువ మానేరు జలాశయంలో పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సభలో కేటీఆర్ మాట్లాడారు. గోదావరి నీళ్లతో రైతుల కాళ్లు కడుగుతామని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకమని పేర్కొన్నారు. కొందరి త్యాగ ఫలితంగా ఎందరికో ప్రయోజనం కలిగించే ఈ సాగునీటి ప్రాజెక్టు రూపుదిద్దుకుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ఏర్పడిందని, అందుకు అనుగుణంగా రైతుల సమస్యలు తెలిసిన వ్యక్తిగా సీఎం తెలంగాణలోని కోటి ఎకరాలకు నీరిచ్చేందుకు వివిధ సాగు నీటి పథకాలను చేపట్టారన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఇదే గోదావరిపై సీతారామ ఎత్తిపోతల పథకం, కృష్ణా నదిపై డిండి, పాలమూరు ఎత్తిపోతల పథకాలను చేపట్టామన్నారు.

### పొరుగు రాష్ట్రాలతో స్నేహహస్తం

పొరుగు రాష్ట్రాలతో వివాదాలు లేకుండా స్నేహపూరిత వాతావరణంలో తెలంగాణలోని ప్రతీ ఎకరాకు సాగు నీరిచ్చే పథకాలను సీఎం చేపట్టారని కేటీఆర్ పేర్కొన్నారు. గతంలో ఏళ్ల తరబడి నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులకు భిన్నంగా కేసీఆర్ చిత్తశుద్ధి, అంకితభావంతో కేవలం మూడేళ్లలోనే కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశారన్నారు.

### రైతు బాగుంటేనే..

రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన ఎవుసం సుభిక్షంగా ఉండదని నానుడి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని గట్టిగా నమ్మిన వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యలు బాగా తెలిసిన వ్యక్తిగా కేసీఆర్ వారికి పునరావాసం కల్పిస్తూనే సాగునీటి ప్రాజెక్టులను చేపట్టారని కేటీఆర్ వివరించారు. ఎగువమానేరు నీటిలో కేసీఆర్ సొంత ఊరు పోసానిపల్లి మునిగిపోయిందని, మధ్యమానేరులో మా అమ్మమ్మ ఊరు కొదురుపాక మునిగిపోయి ఆస్తులు కోల్పోయారని కేటీఆర్ గుర్తు చేశారు. నిర్వాసితుల సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపుతుందన్నారు.

### హరీశ్‌కు అభినందనలు

వాయువేగంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్ పర్యవేక్షణలో పనిచేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, రాళ్లెత్తిన కూలీలు, రేయింబవళ్లు శ్రమించిన ఇంజనీర్లకు కేటీఆర్ అభినందనలు తెలిపారు. రూ.వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పథకంలో 1,531 కిలోమీటర్ల కాలువలు, 203 కిలోమీటర్ల సొరంగం పనులు చేస్తున్నారని వివరించారు. ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా కాళేశ్వరం పథకం అర కిలోమీటర్‌పైకి నీటిని ఎత్తి పోస్తుందని కేటీఆర్ వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చెరువులన్నింటినీ నీటితో నింపుతామని చెప్పారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన వివక్షతను అధిగమిస్తూ స్వరాష్ట్రంలో తెలంగాణ అన్ని రంగాల్లో ముందుంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు 40 టీఎంసీల నీటిని కాళేశ్వరం పథకం ద్వారా సరఫరా చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధి కల్పించేందుకు పారిశ్రామిక ప్రగతికి 16 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.**
**NOTIFICATION**
Application forms are invited through online from the candidates who have secured the cutoff score and more in NEET UG – 2019 and fulfilled the eligibility criteria for admission into MBBS, BDS BAMS, BHMS, BNYS & BUMS Courses available under **Competent Authority Quota** in Medical, Dental, ISM & H Colleges affiliated to Dr. NTR UHS, Vijayawada and also for MBBS course under SVIMS, Tirupati for the Academic Year **2019-20 from 11.00 A.M on 22-06-2019 upto 05.00 P.M on 28-06-2019** from https://apmedadm.ntruhs.ap.gov.in.
For Details Visit http://ntruhs.ap.nic.in and https://apmedadm.ntruhs.ap.gov.in
VIJAYAWADA. Date: 21.06.2019 Sd/- REGISTRAR

**తెలంగాణ ప్రభుత్వం**
**నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ**
**సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, వరంగల్**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**
e-proc.Tender Notice No. 07/2019–20, తేది: 10–06–2019
RRR-III-Batch-IV- జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా, మల్హార్‌రావు (మం), ఎడ్లపల్లి (గ్రా॥), ఊర చెరువు కొరకు మరమ్మతులు, నవీకరణ మరియు పునరుద్ధరణ పని కోసం బిడ్లు కోరబడుచున్నవి. బిడ్లు 19.06.2019 నుండి 26.06.2019 వరకు వెబ్‌సైట్‌లో లభిస్తాయి. తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ http://tender.telangana.gov.in కు లాగాన్ అవ్వండి.
సం/– సూపరింటెండింగ్ ఇంజనీర్, I&CADD., ఇరిగేషన్ సర్కిల్, వరంగల్
DIPR RO.No.175-PP/CL/Advt/1/1/2019-20, Dt: 21.06.2019

# ఇది ప్రజల విజయం:హరీశ్


కేక్ కట్ చేస్తున్న హరీశ్‌రావు తదితరులు

**సాక్షి, సిద్దిపేట:** 'తెలంగాణ రావడం ఎంత ముఖ్యమో, నేడు కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించుకోవడం అంతే ముఖ్యం. గోదావరి జలాలతో బీడు భూములను తడిపే ఈ ప్రాజెక్టు ప్రారంభమైన నేడు శుభదినం. ఇది ప్రజల విజయం. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ విజయం'అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శుక్రవారం తెలంగాణ ముద్దుబిడ్డ ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి కావడం, మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించడం యాదృచ్ఛికమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్‌తో పని చేసిన జయశంకర్ సార్ మదిలో మెదిలిన ఉద్యమ ట్యాగ్ అయిన నీళ్లు, నిధులు, నియామకాల్లో ఒకటైన గోదావరి జలాల సాధన సాకారమైందన్నారు. తెలంగాణ బీడు భూములకు గోదావరి నీటిని మళ్లించడం జయశంకర్‌సార్‌కు నిజమైన నివాళి అని ఆయన అభివర్ణించారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులన్నీ పెండింగ్ ప్రాజెక్టులుగా మారాయన్నారు. కాళేశ్వరంతో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాజెక్టును కేవలం మూడు సంవత్సరాల్లోనే పూర్తి చేయడం ఒక రికార్డు అని, సీఎం పట్టుదల, కృషితోనే ఇది సాధ్యపడిందన్నారు.

# పెళ్లి ఇంట తీవ్ర విషాదం

## కరెంట్ షాక్‌తో నలుగురి మృతి

భూదాన్‌పోచంపల్లి: రెండు రోజులపాటు భాజాభజంత్రీలు, కుటుంబసభ్యులు, బంధువులతో సందడిగా మారిన పెళ్లి ఇంటిపై విధి కరెంటు రూపంలో కన్నెర్రజేసింది. పారాణి కూడా ఆరకముందు కరెంట్‌షాక్‌తో పెళ్లి కొడుకు, అతని తల్లి, తండ్రి, మేనత్త మృతిచెందారు. ఈ విషాద ఘటన శుక్రవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ముక్తాపూర్ గ్రామానికి చెందిన చిందం సాయిలు(60) రెండో కుమారుడైన చిందం ప్రవీణ్ (23) వివాహం ఈ నెల 19న ఇదే మండలం రేవనపల్లి గ్రామానికి చెందిన యువతితో జరిగింది. శుక్రవారం పెళ్లి కుమార్తె ఇంట్లో చిన్నవిందు ఉండడంతో సాయిలు కుటుంబసభ్యులు, బంధువులంతా కలిసి వెళ్లారు. సాయంత్రం పోచంపల్లి మండలంలో వర్షం కురిసింది. వీరంతా రాత్రి తిరిగి ఇంటికి వచ్చారు. పెళ్లి సందర్భంగా ఇంటికి జే వైరు ద్వారా సీరియల్ బల్బులను అమర్చారు. పెళ్లి కుమారుడి మేనత్త శ్యామల గంగమ్మ ఆ జే వైరుపై తెలియక తడిబట్టలు ఆరేసింది. దీంతో ఆమెకు కరెంట్ షాక్ తగిలింది. ఆమెను రక్షించేందుకు పెళ్లికుమారుడి తల్లి చిందం గంగమ్మ పట్టుకోగానే ఆమెకూ షాక్ తగిలింది. గంగమ్మకు రక్షించబోయి సాయిలు, తర్వాత పెళ్లి కుమారుడు ప్రవీణ్ ఇలా ఒకరి తర్వాత ఒకరు పట్టుకోవడంతో వారందరికీ షాక్ తగిలింది. ఏమైందో తెలియక సాయిలు పెద్ద కుమారుడైన చిందం భాస్కర్ ఫీజు తీసేయడంతో కింద పడిపోయారు. అప్పటికే తీవ్ర గాయాలైన వీరిని పోచంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్ పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే వారు మృతిచెందారని చెప్పారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో గ్రామంలో పెనువిషాదం నెలకొంది.

## కాళేశ్వరం వరప్రదాయిని

### మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

**రామడుగు:** తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు వరప్రదాయినిగా నిలుస్తుందని మంత్రి కె. జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. కరీంగనర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో నిర్మించిన కాళేశ్వరం 8వప్యాకేజీ టన్నెల్‌ను శుక్రవారం ప్రారంభించారు.ముందుగా మోటార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ నాయకుడిగా, ఉద్యమనేతగానే కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇంజినీర్‌గా ప్రతిపని దగ్గరుండి చేయించారని తెలిపారు. కాళేశ్వరం నీటితో కోటి ఎకరాలకే కాకుండా.. పాత తొమ్మిది జిల్లాలకు తాగు నీరందుతుందన్నారు. మోటార్ స్విచాన్ చేసి స్వీట్లు తినిపించుకున్నారు.

**INDIAN NAVY – AN OCEAN OF OPPORTUNITIES**
**UNIVERSITY ENTRY SCHEME – JUN 2020**



**ONLINE REGISTRATION OPEN FROM 07 JUN 19 TO 27 JUN 19**

| Entry | Age | Gender | Type of commission |
|---|---|---|---|
| University Entry Scheme (UES) | Born between 02 Jul 1996 to 01 Jul 1999; both dates inclusive | Men | Short Service Commission |

Scan this QR Code to apply online

Note:
1. Applicant should be in the final year (regular BE/B.Tech or Integrated degree course) in an AICTE recognized university.
2. Identity proof is mandatory for online registration.
3. For educational qualifications and other details please visit our website www.joinindiannavy.gov.in. and Employment News dated 08 Jun 19.

davp/10701/11/0011/1920

# అన్నిటికీ అతీతం యోగా

## జీవితంలో అది ఒక భాగం కావాలి

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ
### ఐరాసతోపాటు ప్రపంచవ్యాప్తంగా యోగా ఉత్సవాలు


రాంచీలో ఔత్సాహికులతో కలిసి యోగాసనాలు వేస్తున్న ప్రధాని మోదీ

**రాంచీ/ న్యూఢిల్లీ/ ఐరాస:** భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా అన్నిటికీ అతీతమైందని, దీనిని జీవితంలో ఒక భాగంగా మార్చుకోవాలని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. 5వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన యోగా డే కార్యక్రమంలో ప్రధాని పాల్గొన్నారు. అదేవిధంగా పార్లమెంట్ హాల్లో, ఐక్య రాజ్యసమితిలో, ఇతర దేశాల్లోనూ ఈ కార్యక్రమాలు జరిగాయి. రాంచీలోని ప్రభాత్ తారా గ్రౌండ్‌లో నిర్వ హించిన కార్యక్రమంలో 40 వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడిగా మారిన ప్రధాని మోదీ వివిధ ఆసనాల విశిష్టతను వివరిస్తూ ఆసనాలు వేయించారు.

**ఆరోగ్యం కోసం యోగా**

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా కుల, మత, వర్ణ, లింగ, ప్రాంతీయ వంటి విభేదాలకు అతీతమైంది. అందుకే దీనిని జీవితంలో అంతర్భాగంగా మార్చు కోవాలి' అని సూచించారు. 'నగరాల నుంచి పల్లెలు, గిరిజన ప్రాంతాలకు యోగాను వ్యాపింపజేయాలి. గిరిజనుల జీవితాల్లో యోగాను విడదీయరాని భాగంగా మార్చాలి. ఆరోగ్యవంతమైన శరీరం, స్థిర మైన మనస్సు, ఏకాత్మతా భావం అనే మూడు యోగా విశిష్టతలు ఏమాత్రం మారలేదు. జ్ఞానం, కర్మ, భక్తి అనే మూడింటి సమ్మేళనమే యోగ' అని ప్రధాని వివరించారు. శాంతి, సామరస్యాలను సాధించే యోగాను ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తప్ప నిసరిగా ఆచరించాలన్నారు. 'ఈ రోజుల్లో యువత గుండె జబ్బులకు ఎక్కువగా గురవుతున్నారు. గుండె జబ్బుల బెడద నుంచి కాపాడుకునేందుకు యోగా మంచి ఆయుధం. ఈ దిశగా వారిని అప్రమత్తం చేయాల్సి ఉంది. అందుకే ఈ ఏడాది యోగా డేకు 'హృదయం కోసం యోగా' నినాదాన్ని ఇతివృత్తంగా పెట్టుకున్నాం. అనారోగ్య సమస్యల నుంచి రక్షించే ముఖ్య సాధనంగా యోగాను మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది' అని చెప్పారు. తెల్లటి దుస్తులు, టీ షర్టు, స్కార్ఫుతో వచ్చిన ప్రధాని ప్రసంగం అనంతరం స్టేజీ దిగి అందరితో కలిసి కూర్చుని వివిధ ఆసనాలు, ప్రాణాయామం చేయించారు.


బ్రిటన్‌లోని స్టోన్‌హెంజ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆసనాలు వేస్తున్న ప్రజలు

**రాష్ట్రపతి భవన్‌లో..:** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తోపాటు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితరులు పాల్గొని యోగాసనాలు వేశారు. పార్లమెంట్ పరిస రాల్లో జరిగిన కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పాల్గొన్నారు. ఢిల్లీ రాజ్‌పథ్‌లో జరిగిన కార్యక్ర మంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోహ్‌తక్‌లో హోం మంత్రి అమిత్ షా, నాగ్‌పూర్‌లో నితిన్ గడ్కారీ పాల్గొన్నారు. ప్రవాసీ భారతీయ కేంద్రంలో విదే శాంగ మంత్రి జై శంకర్ నేతృత్వంలో జరిగిన యోగాడే కార్యక్రమంలో 60 దేశాల రాయబారులు పాల్గొన్నారు. చైనా, బ్రిటన్, ఇజ్రాయెల్ దేశాల్లోనూ యోగా డే పాటించారు. అంతర్జాతీయ యోగా ఉత్స వాల్లో పాల్గొన్న దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్, శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీకి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

**ఐరాసలో మార్మోగిన ఓం శాంతి...**

అంతర్జాతీయ వేదిక ఐక్యరాజ్యసమితి జనరల్ అసెం బ్లీ హాల్‌లో ఓం శాంతి మంత్రం మార్మోగింది. ప్రపంచ నేతలు ప్రసంగించే విశ్వ వేదిక జనరల్ అసెంబ్లీ హాల్‌లో యోగా డే సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులు, అధికారులు, శిక్షకులు, గురువులు వివిధ ఆసనాలు వేశారు. ఐరాస జనరల్ అసెంబ్లీ హాల్‌లో ఈ తరహాలో యోగా ఉత్సవం జర పడం ఇదే ప్రథమం.

## రాహుల్ ట్వీట్ కలకలం



శిక్షకులతో కలిసి యోగా చేస్తున్న ఆర్మీ జాగిలాలు

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు వివాదానికి దారి తీశాయి. ఆర్మీకి చెందిన జాగిలాలు, వాటి శిక్ష కులు యోగా చేస్తున్న ఫొటోలు పోస్ట్ చేసిన రాహుల్ వాటికి 'నవ భారతం' అనే వ్యాఖ్యను జోడించారు. దీనిపై బీజేపీ తీవ్రంగా మండిపడిం ది. యోగా డేను అపహాస్యం చేశారని, ఆర్మీ బల గాలను రాహుల్ అవమానపరిచారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విమర్శించారు. 'కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేక ధోరణితోనే ఉంటుంది. ట్రిపుల్ తలాక్‌కు మద్దతిచ్చినప్పుడే ఈ విషయం పూర్తిగా అర్థమైంది. ఇప్పుడు యోగాడేను అపహాస్యం చేయడమే కాకుండా ఆర్మీ బలగాలను అవమానపరిచారు. వారిలో సానుకూల ధోరణి పెరగాలని ఆశిస్తున్నాను' అంటూ అమిత్ షా ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'ఓ సీనియర్ రాజకీయవేత్త యోగాడేను ఇలా అవ మానపరచడం బాధాకరం. ఓటు బ్యాంకు రాజ కీయాలే వారిని ఇలా భారతీయ సంస్కృతులు, సంప్రదాయాలను అవమానించేలా చేస్తున్నట్లు ఉంది'అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధి ట్విట్టర్‌లో దుయ్యబట్టారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నవ భారత్ అవత రించింది. తన ఆధ్వర్యంలో కొత్త కాంగ్రెస్ ఎలా ఉందో రాహుల్ గాంధీ ట్వీట్‌లో అర్థమైంది' అంటూ బీజేపీ అధికార ప్రతినిధి నళిన్ కోహ్లి ఎద్దేవా చేశారు. 'రాహుల్‌కు జీవితం అంటే ఓ జోక్‌గా మారింది. తన పెంపుడు కుక్కను గుర్తు చేసుకుంటూ పోస్టులు చేస్తున్నట్లు ఉన్నారు' అంటూ చాలా మంది నెటిజన్లు మండిపడుతున్నారు.

# లోక్‌సభలో 'ట్రిపుల్ తలాక్' రగడ

- బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్
- తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం మరోసారి 'ట్రిపుల్ తలాక్' బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు–2019ను లోక్‌స భలో ప్రవేశపెట్టారు. అయితే ఈ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమనీ, దీనిపై డివిజన్ ఓటింగ్ నిర్వహిం చాలని ప్రతిపక్షాలు డిమాండ్‌చేశాయి. ఈ సంద ర్భంగా బిల్లుకు అనుకూలంగా 186 మంది సభ్యులు మద్దతు తెలపగా, 74 మంది ఎంపీలు వ్యతిరేకిం చారు. అనంతరం రవిశంకర్ ప్రసాద్ మాట్లాడు తూ..'ఇది మతానికి సంబంధించిన విషయం కాదు. మహిళలకు న్యాయం చేకూర్చడానికి సంబంధించిన ది. ఈ బిల్లును సమానత్వం, న్యాయం కోసం తీసు కొస్తున్నాం. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి 543 కేసులు నమోద య్యాయి. ట్రిపుల్ తలాక్ చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చాక కూడా 200 కేసులు నమోదయ్యాయి. ఇది మహిళల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశం. ఇందుకోసం మేం కట్టుబడి ఉన్నాం' అని స్పష్టం చేశారు.

**అందరికీ ఒకే శిక్ష ఉండాలి: కాంగ్రెస్**

ట్రిపుల్ తలాక్ బిల్లుపై స్పీకర్ ఓం బిర్లా చర్చకు అనుమతి ఇవ్వడంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాట్లాడుతూ.. 'ఈ బిల్లు కేవలం ఓ మతాన్ని.. ముస్లింలనే లక్ష్యంగా చేసుకుని తీసుకొచ్చారు. భార్య లను కేవలం ముస్లిం పురుషులే వదిలివేస్తున్నారా? ఈ బిల్లు సివిల్, క్రిమినల్ చట్టాలకు విరుద్ధంగా ఉంది. మేం ట్రిపుల్ తలాక్‌ను సమర్థించడం లేదు. కానీ ఈ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తున్నాం. దేశంలో ఎవరు భార్యను వదిలేసినా ఒకే శిక్ష పడేలా చట్టం ఉండాలి' అని సూచించారు.

**రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే: ఒవైసీ**

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పంది స్తూ..'ముస్లిం మహిళలపై ఇంత ప్రేమ చూపుతున్న బీజేపీ శబరిమల ఆలయంలోకి హిందూ మహిళలు వెళ్లడాన్ని వ్యతిరేకించింది. 'ట్రిపుల్ తలాక్' బిల్లు రాజ్యాంగ హక్కులను స్పష్టంగా ఉల్లంఘిస్తోంది. ఎందుకంటే ఓ ముస్లిం పురుషుడు చేసిన నేరానికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తామని బిల్లులో పొందు పర్చారు. ఇదే తప్పును ముస్లిం కానివారు చేస్తే ఏడాది జైలుశిక్ష మాత్రమే పడుతుంది' అని విమర్శిం చారు. ఆర్‌ఎస్పీకి చెందిన ఎంపీ ఎన్.కె.ప్రేమ్‌చంద్ర న్‌తో పాటు పలువురు ప్రతిపక్ష ఎంపీలు కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును 2018, సెప్టెంబర్‌లో ఓసారి, 2019, ఫిబ్రవరిలో మరోసారి కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. లోక్ సభలో ఆమోదం పొందినప్పటికీ రాజ్యసభలో మెజా రిటీ లేకపోవడంతో మోదీ ప్రభుత్వం ఆర్డినెన్స్ ద్వారా చట్టాన్ని తీసుకొచ్చింది.

# 'హెచ్1బీ' కోటాలో కోత లేదు

- భారత్‌కు స్పష్టం చేసిన అమెరికా విదేశాంగ శాఖ
- అన్ని వీసాలను సమీక్షిస్తున్నామని వెల్లడి




**వాషింగ్టన్:** విదేశీ కంపెనీలు సేకరించే సమాచారాన్ని స్థానికంగానే భద్రపరచాలని కోరే దేశాలకు జారీచే స్తున్న హెచ్1బీ వీసాల్లో ఎలాంటి కోత విధించడం లేదని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. డేటా ప్రవాహంపై భారత్‌తో అమెరికా జరుపుతున్న చర్చ లకు, హెచ్1బీ వీసాల జారీపై ట్రంప్ యంత్రాంగం చేస్తున్న సమీక్షలకు ఎలాంటి సంబంధం లేదని వెల్ల డించింది. విదేశీ కంపెనీలు భారత్‌లో సేకరించిన సమాచారాన్ని స్థానికంగానే భద్రపరచాలని కేంద్రం గతంలోనే సూచించింది. దీంతో అమెరికా కంపెనీ లపై ఇలాంటి నిబంధనలు విధించే దేశాలకు జారీచే స్తున్న హెచ్1బీ వీసాల్లో 10–15 శాతం కోత విధిం చాలని అగ్రరాజ్యం నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా అమెరికా విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు వీటిని ఖండించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీచేసిన కార్యనిర్వా హక ఉత్తర్వుల ఆధారంగా హెచ్1బీ సహా అన్ని వర్క్ వీసా ప్రోగ్రామ్‌లను ప్రభుత్వం సమీక్షిస్తోందని ఆయన తెలిపారు. 'ఈ సమీక్షలు ఏ దేశాన్నీ లక్ష్యంగా చేసుకుని నిర్వహించడం లేదు. భారత్‌తో జరుగు తున్న చర్చలకు, హెచ్1బీ సమీక్షలకు ఎలాంటి సంబంధం లేదు. దేశాల సరిహద్దును దాటి సమా చారం స్వేచ్ఛగా ప్రయాణించాల్సిన అవసరంపై అమెరికా భారత్‌తో చర్చిస్తోంది' అని వెల్లడించారు. డేటాను గ్లోబల్ సర్వర్లలో కాకుండా స్థానికంగా భద్ర పరచాల్సివస్తే వ్యయాలు పెరుగుతాయని విదేశీ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. అత్యంత నైపుణ్యవంతులైన విదేశీ యులు తమదేశంలో పనిచేసేందుకు వీలుగా ఏటా హెచ్1బీ వీసాలను అమెరికా జారీచేస్తోంది. మరో వైపు అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా ట్రంప్ ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేరని పలువురు ఇమిగ్రేషన్ నిపుణులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రస్తుత ఇమిగ్రేషన్ చట్టానికి సవరణ చేస్తేనే ఇది సాధ్యమనీ, అయితే ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు, సెనెట్‌లో రిపబ్లికన్లకు మెజారిటీ ఉన్న నేపథ్యంలో ఇది జరగడం కష్టమేనని వ్యాఖ్యానించారు. భారత్‌కు జారీచేస్తున్న హెచ్1బీ కోటాలో కోత విధిస్తే నిపుణుల రాక తగ్గి అంతిమంగా అమెరికాయే నష్ట పోతుందని హెచ్చరించారు.

# ఆఖరి క్షణంలో ఆగిన యుద్ధం

- ఇరాన్‌పై దాడులకు తొలుత సై
- తర్వాత వెనక్కి తగ్గిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు యుద్ధానికి దారి తీస్తాయని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్న వేళ ఒకడుగు ముందుకు వేసి సమరానికి సై అన్న అగ్రరా జ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆఖరి క్షణంలో వెనక్కి తగ్గారు. ఇరాన్‌లోని ఎంపిక చేసిన మూడు లక్ష్యాలపై గురువారం రాత్రే దాడి చేయాలని అంతా సిద్ధం చేసినప్పటికీ, దాడి చేస్తే 150 మంది చనిపోతారని తెలియడంతో ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ట్విట్టర్‌లో శుక్రవారం ప్రకటించారు. ఇరాన్ భూభాగం లోకి ప్రవేశించిన అమెరికా నిఘా డ్రోన్‌ని ఇరా న్‌కు చెందిన రివల్యూషనరీ గార్డులు కూల్చివే యడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకోవడం తెలిసిందే. యుద్ధా నికి తాము ఎప్పుడూ సిద్ధమేనంటూ ఇరాన్ రివల్యూషనరీ గార్డు కవ్వింపు చర్యలకి దిగేస రికి డ్రోన్ కూల్చేసి ఇరాన్ అతి పెద్ద తప్పు చేసిందంటూ ట్రంప్ ట్వీట్ చేశారు.

**భద్రతా అధికారులతో ట్రంప్ భేటీ**

డ్రోన్‌ని కూల్చిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే జాతీయ భద్రతా అధికారులతో ట్రంప్ గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఇరాన్‌పై దాడులకు మార్గాలు అన్వేషించారు. ఇరాన్ డ్రోన్‌ని కూల్చేయడం అంత చెత్త పని మరొకటి లేదని మండిపడ్డారు. యుద్ధం ప్రక టించడానికే సిద్ధమయ్యారు. అయితే కొందరు ప్రజాప్రతినిధులు మాత్రం ట్రంప్‌ని వారిం



చారు. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌పై ఎలాంటి కఠిన చర్యలకు దిగవద్దని ఆయనకు నచ్చ చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో, జాతీయ భద్రతా సలహాదారు జాన్ బాల్టన్ ఇరాన్‌పై కఠినాత్మకంగా వ్యవహ రించాలని సూచిస్తే, హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీ చైర్మన్ ఆడమ్ స్కిఫ్ మాత్రం ఈ దశలో యుద్ధం మంచిది కాదని వారించారు. చివరకు ఆ దాడి చేస్తే 150 మంది చనిపోతారని చెప్పడంతో, డ్రోన్‌ను కూల్చేసినందుకు అంత మందిని చంపడం భావ్యం కాదని తాను దాడి ఆలోచనను విరమించుకున్నట్లు ట్రంప్ చెప్పారు.

**స్పష్టమైన ఆధారాలున్నాయి: ఇరాన్**

అమెరికా డ్రోన్ అంతర్జాతీయ గగనతల నిబం ధనల్ని అతిక్రమించి మరీ తమ దేశంలోకి ప్రవే శించిందనడానికి కచ్చితమైన సాక్ష్యాధారా లున్నాయని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. డ్రోన్ శకలాలు ఇరాన్ ప్రాంతంలోని జలాల్లో కనిపించాయని తెలిపిం ది. ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రి మహ మ్మద్ జావేద్ జరీఫ్ మాత్రం తాము యుద్ధం కోరుకోవడం లేదని, తమ గగనతలంలోకి, జలాల్లోకి ఎవరు ప్రవేశించినా ప్రతిఘటి స్తామని స్పష్టం చేశారు.

### పౌర విమానాల దారి మళ్లింపు..

**లండన్:** హొర్ముజ్ జలసంధి చుట్టు పక్కల ప్రాంతాల్లో వెళ్లే పౌర/వాణిజ్య విమానాలు కూడా పొరపాటున కూల్చివే తకు గురయ్యే అవకాశాలు ఉంటాయంటూ అమెరికా హెచ్చరించ డంతో పలు విమానయాన సంస్థలు తమ విమానాల ప్రయాణ మార్గాలను మార్చు కున్నాయి. బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఖంతాస్, సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేసియా ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా, ఎమిరేట్స్, కేఎ ల్‌ఎం సహా పలు అంతర్జాతీయ విమాన యాన సంస్థలు శుక్రవారం ఈ నిర్ణయం తీసుకున్నాయి. అమెరికా నిర్ణయం ఫలి తంగా న్యూయార్క్–ముంబై విమాన సర్వీసును రద్దు చేస్తున్నట్టు యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. ఆ మార్గంలో విమానం నడిపి ప్రయాణికుల ప్రాణా లకు ముప్పు కలిగించ లేమని తెలిపింది.

### భారత్‌తో కలిసి పనిచేస్తాం: పాంపియో



**న్యూఢిల్లీ:** ద్వైపాక్షిక వ్యూహా త్మక భాగస్వా మ్యాన్ని మరింత ముందుకు తీసు కెళ్లడం కోసం భారత్‌తో కలిసి పని చేసేందుకు అమె రికా కట్టుబడి ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి మైక్ పాంపియో స్పష్టం చేశారు. ఈ నెల 25 నుంచి రెండు రోజుల పాటు భారత్ పర్యటనకు రానున్న పాంపియో గురువారం భారత్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు. ద్వైపాక్షిక భద్రత, ఆర్థిక భాగస్వామ్యాల గురించి ఇరువురు నేతలు చర్చించారు. భారత విదేశాంగ మంత్రిగా నియమితులైన జయశంకర్‌కు పాంపియో అభినందనలు తెలిపారు. మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారం లోకి వచ్చిన తర్వాత విదేశీ నేత ఒకరు భారతలో పర్యటించడం ఇదే ప్రథమం. 28నుంచి జపాన్‌లో జరిగే జి–20 దేశాల శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమావేశం కానున్న నేపథ్యంలో పాంపియో భారత పర్యటనకు ప్రాధాన్యం లభించింది. పర్యటనలో భాగంగా పాంపియో విదే శాంగ మంత్రి జయశంకర్, తదితర మంత్రులతో సమావేశమవుతారని విదే శాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలి పారు.'భారత్ అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, పరస్పరం లాభదాయక మైన ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జా తీయ అంశాలపై చర్చలకు ఈ పర్యటన చక్కని అవకాశంగా భావిస్తున్నాం.'అని కుమార్ అన్నారు.

## ఆ కారణంతోనే గడువు పెంచలేం..

### మెడికల్ పీజీ సీట్ల భర్తీపై సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ:** డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు వైద్య కాలేజీల్లో ఖాళీగా ఉన్న దాదాపు వెయ్యి పీజీ మెడికల్ సీట్లు భర్తీ గడువును పెంచాలన్న పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టేసింది. కేవలం సీట్లు ఖాళీగా ఉన్నాయనే ఒకే కారణంతో గడువు పెంచాలనడం సరికాదని పేర్కొంది. పలు కాలేజీల్లో సీట్లు భర్తీ ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసుకునేందుకు కౌన్సెలింగ్ కొంత సమయం ఇచ్చేలా ఆదేశాలివ్వాలని డీమ్డ్ యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీల సంఘం పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ సూర్య కాంత్‌లతో కూడిన ధర్మాసనం శుక్ర వారం కొట్టేసింది. షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాల్సిందేనని, ఒకవేళ గడువు పెంచుకు నేందుకు సమయం ఇస్తే అది ఆశలకు తలు పులు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం పేర్కొంది. సీట్లు భర్తీ చేసుకునేందుకు షెడ్యూల్ ప్రకారం మూడు దశల వరకు అవ కాశం ఇచ్చామని, ఆ తర్వాత కూడా సీట్లు మిగిలితే ఏమీ చేయలేమని స్పష్టం చేసింది. కేవలం సీట్లు మిగిలాయనే కారణంతో గడువు పెంచడం కుదరదని పేర్కొంది.

## ఇండోనేసియాలో అగ్నిప్రమాదం

### 30 మంది మృతి.. మృతుల్లో పలువురు చిన్నారులు

**జకార్తా:** ఇండోనేసియాలో అగ్గిపెట్టెల కర్మా గారం నడుపుతున్న ఓ ఇంటిలో మంటలు చెలరేగడంతో 30 మంది మృతి చెందారు. మృతుల్లో పలువురు చిన్నారులు ఉన్నట్లు శుక్రవారం ప్రభుత్వ అధికార వర్గాలు వెల్లడిం చాయి. ఉత్తర సుమత్రాలోని బింజాయ్ పట్ట ణంలో ఈ ఘటన జరిగింది. మృతుల్లో కనీసం ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు భావిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రమాదానికి కారణాలు ధ్రువీకరించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. బాధిత చిన్నారులు తమ తల్లిదండ్రులను కలిసేందుకు వచ్చిన సమయంలో ఈ ఘటన జరిగిందని భావిస్తున్నామని అధికారులు చెప్పారు.


ప్రమాదం జరిగిన కర్మాగారం

# 'జమిలి' ఆలోచనకు 20 ఏళ్లు

### రాజ్యాంగ చిక్కులు అధిగమించేనా?

**కేం**ద్రంలో రెండోసారి అధికారం చేపట్టిన బీజేపీ ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రతిపాదనను మళ్లీ తెరపైకి తెచ్చింది. లోక్‌సభకు, శాసన సభలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించే విషయం చర్చించడానికి మోదీ గత వారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. 40 పార్టీలను ఆహ్వానిస్తే, 21 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. మెజారిటీ పార్టీలు జమిలి ఎన్నికలకు సానుకూలత వ్యక్తం చేసినా కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు.జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయడానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలనీ ఆ సమావేశం నిర్ణయించింది. నిజానికి జమిలి ఎన్నికల ఆలోచన ఇప్పటిది కాదు. 20 ఏళ్ల క్రితమే బీజేపీ–ఆరెస్సెస్‌లు ఒకే దేశం ఒకే ఎన్నిక ఆలోచన చేశాయి. అటల్ బిహారీ వాజ పేయి హయాంలో దీనిపై విస్తృత చర్చ జరిగిం ది. అప్పటి లా కమిషన్ కూడా ఇందుకు సానుకూలత వ్యక్తం చేసింది.




**70వ దశకం వరకు ....**

మన దేశంలో 1951 నుంచి 1967 వరకు లోక్‌సభ, శాసన సభలకు ఇంచుమించు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. రాష్ట్రాల పునర్వి భజన జరగడం, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గడువు కంటే ముందే రద్దవడం వంటి కార ణాల వల్ల లోక్‌సభతో పాటు ఎన్నికలు జరిగే రాష్ట్రాల శాతం తగ్గుతూ వచ్చింది.1970వ దశకం నుంచి జమిలి ఎన్నికలు దాదాపుగా జరగలేదనే చెప్పాలి. అయితే, 1990లలో బీజేపీ ఎన్నికల్లో బలం పుంజుకోవడంతో జమిలి ఎన్నికల ప్రతిపాదన బలపడుతూ వచి్చంది. అన్నాడీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, వైఎ స్సార్ కాంగ్రెస్ పార్టీ,టీఆర్‌ఎస్ జమిలి ఎన్ని కలను సమర్థిస్తోంటే, సీపీఐ, బీఎస్పీ, తృణ మూల్ కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్నాయి. 2017 నుంచి మోదీ జమిలి ఎన్నికల గురించి పదే పదే ప్రస్తావిస్తున్నారు. జమిలి ఎన్నికలపై అధ్యయనం జరగాలని ఈ ఏడాది జనవరిలో మోదీ సూచించారు.

### ఇవీ అవరోధాలు

**జ**మిలి ఎన్నికలు అమల్లోకి రావా లంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుం ది. దానికి పార్లమెంటులో మూడొంతుల మెజారిటీ, సగం రాష్ట్రాల ఆమోదం అవ సరం. ప్రస్తుతం లోక్‌సభలో బీజేపీకి పూర్తి మెజారిటీ ఉంది. రాజ్యసభలో కూడా త్వరలో మెజారిటీ వచ్చే అవకాశం ఉంది. నిబంధనల ప్రకారం జమిలి ఎన్నికలు అమ ల్లోకి వస్తే ఉప ఎన్నికలు, మధ్యంతర ఎన్నికలు ఉండవని రాజ్యాంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఏ కారణం చేతనయినా ఎంపీ లేదా ఎమ్మెల్యే పదవి ఖాళీ అయినా, ప్రభుత్వం కూలిపో యినా గడువు వరకు వాటికి ఎన్నికలు జరిపే అవకాశం ఉండదంటున్నారు. ఈ విధానంతో ఖర్చు తగ్గుతుందని, రాజకీయ కక్షలు తగ్గుతాయని, సంక్షేమ పథకాలు కొనసాగుతాయంటున్నారు.

## జి–20 భేటీకి ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** ఈ నెల 27 నుంచి 29 వరకు జపాన్‌లోని ఒసాకాలో జరిగే జి–20 శిఖరాగ్ర సమావేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. మోదీ వెంట మాజీ కేంద్రమంత్రి సురేశ్ ప్రభు కూడా ఉంటారని ఆ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. సదస్సులో పాల్గొనే పలు దేశాలతో మోదీ ద్వైపాక్షిక, త్రైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని తెలిపారు. జి–20లో ఇండియాతోపాటు అర్జెంటినా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, యూరోపిన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేసియా, ఇటలీ, జపాన్, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, టర్కీ, బ్రిటన్, అమెరికా ఉన్నాయి.

## పీఎంకేవై కింద 12,305 కోట్ల పంపిణీ

**న్యూఢిల్లీ:** అర్హులైన రైతులకు పీఎం కిసాన్ పథకం(పీఎంకేవై) కింద ఇప్పటి వరకూ రూ. 12,305 కోట్లు పంపిణీ చేశామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. ఈ మేరకు ఆయన రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సాయంగా ప్రధాన మంత్రి కిసాన్ పథకం కింద అందించే రూ. 6,000 మూడు దఫాల్లో చెల్లించ నున్నామని మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా 14.5కోట్ల మంది రైతులు లబ్ధి పొందనున్నారని చెప్పారు. భూపరిమితితో నిమిత్తం లేకుండా సహాయం అందిస్తున్నామని, దీనివల్ల ప్రభుత్వంపై రూ. 87,215.50 కోట్ల భారం పడనున్నదని తెలిపారు.

## లోక్‌సభ చైర్‌పర్సన్ల ప్యానెల్‌కు నలుగురు

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ లేనపుడు సభకు అధ్యక్షత వహించే చైర్‌పర్సన్ల ప్యానెల్‌కు నలుగురు బీజేపీ సభ్యులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నామినేట్ చేశారు. శుక్రవారం ప్రకటించిన ఈ ప్యానెల్ సభ్యుల్లో బీజేపీకి చెందిన రమాదేవి, కిరీటి పి.సోలంకీ, రాజేంద్ర అగర్వాల్, మీనాక్షి లేఖి ఉన్నారు. ఈ సందర్భంగా బిర్లా మాట్లాడుతూ ఇతర పార్టీలు కూడా తమ పార్టీ సభ్యుల పేర్లను సూచిస్తే ప్యానెల్ సంఖ్యను పెంచుతామన్నారు. సాధారణంగా ఈ ప్యానెల్‌లో పది మంది వరకు చైర్‌పర్సన్లు ఉంటారు.

## కర్ణాటకలో ఎప్పుడైనా మధ్యంతర ఎన్నికలు

### జేడీఎస్ అధినేత దేవెగౌడ సంచలన వ్యాఖ్యలు

**బెంగళూరు:** జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలో త్వరలోనే మధ్యంతర ఎన్నికలు జరుగు తాయని ప్రకటించారు. తన కుమారుడు హెచ్.డి.కుమారస్వామి నేతృ త్వంలోని కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో తనకు తెలియదని వ్యాఖ్యానించారు. బెంగళూరులో శుక్రవారం దేవెగౌడ మీడి యాతో మాట్లాడుతూ..'కర్ణాటక అసెంబ్లీకి మధ్యంతర ఎన్నికలు వస్తాయన్న విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. కుమారస్వామి ప్రభుత్వానికి ఐదేళ్లపాటు మద్దతు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. ఇప్పుడు కాంగ్రెస్ నేతల వ్యవహారశైలి, పరిస్థితులు అందుకు అనుగుణంగా లేవు. మా ప్రజలు తెలివైనవాళ్లు. ఏ నిర్ణయం తీసుకోవాలో వాళ్లకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవ సరం లేదు' అని తెలిపారు. జేడీఎస్‌తో పొత్తుతో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని మాజీ సీఎం సిద్దరామయ్య పార్టీ చీఫ్ రాహుల్‌కు ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యంఏర్పడింది.

## నౌకలో అగ్నిప్రమాదం.. ఒకరి మృతి

**ముంబై:** ముంబైలోని మజ్‌గావ్ నౌకానిర్మాణ స్థావరంలో ఇంకా నిర్మాణంలో ఉన్న ఓ యుద్ధనౌకలో శుక్రవారం అగ్నిప్రమాదం జరిగి ఓ కార్మికుడు మర ణించాడు. మరో కార్మికుడు గాయపడినట్లు అధికారులు చెప్పారు. మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎస్‌ఎల్) ఓ ప్రకటన విడుదల చేస్తూ, యార్డ్–12704లో స్వల్ప సాయంత్రం నాలుగు గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగిందనీ, ఊపిరాడక పోవడం, శరీరం కాలడం కారణంగా బజేంద్ర కుమార్ (23) కార్మికుడు మరణించాడని తెలిపింది. మరో కార్మికు డికి స్వల్పంగా కాలిన గాయాలయ్యాయంది. ఇది కాస్త తీవ్రమైన ప్రమాదమేనని అగ్నిమాపక శాఖ అధికారులు అన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
22-6-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 407 ▼ | 39,194 |
| నిఫ్టీ | 108 ▼ | 11,724 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,039 | ▼ 12 |
| డోజోన్స్ | 26,799 | ▲ 46 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,408 | ▼ 17 |
| డాక్స్ | 12,340 | ▼ 15 |
| షాంఘై | 3,002 | ▲ 15 |
| నికాయ్ | 21,259 | ▼ 204 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.00 | 70.64 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 87.18 | 90.31 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.45 | 80.35 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.97 | 66.42 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.33 | 49.52 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.64 | 52.42 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.82 | 19.53 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.25 | 19.76 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.50 | 10.85 |

# వాల్‌మార్ట్‌కు 282 మిలియన్ డాలర్ల జరిమానా




**వాషింగ్టన్:** భారత్ సహా 4 దేశాల్లో అవినీతి నిరోధక చట్టాలను ఉల్లంఘించిన ఆరోపణలను సెటిల్ చేసుకునేందుకు గాను అమెరికన్ నియంత్రణ సంస్థలకు వాల్‌మార్ట్ 282 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించనుంది. నిబంధనలకు విరుద్ధంగా వాల్‌మార్ట్ తరపున థర్డ్ పార్టీ మధ్యవర్తులు విదేశాల ప్రభుత్వాధికారులకు చెల్లింపులు జరపడం ద్వారా ఉల్లంఘనలకు పాల్పడినట్లు అమెరికా సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) నిర్ధారించడమే ఇందుకు కారణం. ఎస్ఈసీకి 144 మిలియన్ డాలర్లు, న్యాయశాఖ పెట్టిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవడానికి మరో 138 మిలియన్ డాలర్లు.. వెరసి 282 మిలియన్ డాలర్లు చెల్లించేందుకు వాల్‌మార్ట్ అంగీకరించినట్లు ఎస్ఈసీ వెల్లడించింది. చాలా ఉల్లంఘనలను వాల్‌మార్ట్ నివారించగలిగేదని, పదే పదే హెచ్చరికలు చేసినా సకాలంలో సూచనలు అమలు చేయకుండా పెడచెవిన పెట్టిందని ఎస్ఈసీ పేర్కొంది.

# అరబిందోకు యూఎస్‌ఎఫ్‌డీఏ వార్నింగ్ లెటర్



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఔషధ తయారీ కంపెనీ అరబిందో ఫార్మాకు యూఎస్‌ఎఫ్‌డీఏ వార్నింగ్ లెటర్ జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం వద్ద ఉన్న కంపెనీకి చెందిన ఏపీఐ తయారీ కేంద్రం యూనిట్–11లో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎఫ్‌డీఏ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు లోపాలను గుర్తించిన ఎఫ్‌డీఏ తాజాగా వార్నింగ్ లెటర్ జారీ చేసింది. ఈ ఫెసిలిటీలో ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారంపై ఎటువంటి ప్రభావం ఉండకపోవచ్చని అరబిందో అభిప్రాయపడింది. త్వరిత గతిన సమస్య పరిష్కారం దిశగా యూఎస్‌ఎఫ్‌డీఏతో సంప్రదింపులు జరుపుతున్నట్టు వివరించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తయారీ కేంద్రాల్లో అత్యంత నాణ్యత ప్రమాణాలు కొనసాగించేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్టు స్పష్టం చేసింది. బీఎస్ఈలో శుక్రవారం అరబిందో షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే 3.92 శాతం తగ్గి రూ.602.35 వద్ద స్థిరపడింది.




# పరిశ్రమను మించి వృద్ధి సాధిస్తాం

**మైండ్‌ట్రీ చైర్మన్ నటరాజన్**



**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం మైండ్‌ట్రీ పూర్తి సత్తా ఇంకా చాటలేదని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పనితీరు కనపరుస్తుందని కంపెనీ చైర్మన్ కృష్ణ కుమార్ నటరాజన్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కనిష్ట రెండంకెల స్థాయి వృద్ధికి పరిమితం కావొచ్చని.. అయితే అనేక అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ పరిశ్రమను మించే వృద్ధి సాధించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మైండ్‌ట్రీలో ఎల్‌అండ్‌టీ సంస్థ అవాంఛిత రీతిలో మెజారిటీ వాటాలు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తుండటం అసాధారణ పరిస్థితని, వాటాదారులందరికీ గరిష్ట ప్రయోజనాలు చేకూర్చేలా ఈ అంశాన్ని పరిష్కరించగలమని నటరాజన్ వివరించారు. బీఎస్ఈకి సమర్పించిన వార్షిక నివేదికలో నటరాజన్, సీఈవో రోస్టో రవనన్ ఈ విషయాలు తెలిపారు. అవకాశాలు అందిపుచ్చుకోవడంపైనా, పరిశ్రమ కన్నా అధిక వృద్ధి రేటు సాధించడంపైనా కంపెనీ దృష్టి పెడుతోందని వారు పేర్కొన్నారు. మైండ్‌ట్రీని ఎల్ అండ్ టీ బలవంతపు టేకోవర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే 30 శాతం దాకా వాటాలు పెంచుకున్న ఎల్ అండ్ టీ మరో 31 శాతం వాటా కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. ఇది జూన్ 28తో ముగియనుంది. మొత్తం మీద 66 శాతం వాటాల కొనుగోలు కోసం ఎల్ అండ్ టీ రూ. 10,700 కోట్లు వెచ్చిస్తోంది. కానీ ఈ బలవంతపు టేకోవర్ నుంచి తమ సంస్థను కాపాడుకునేందుకు మైండ్‌ట్రీ ప్రమోటర్లు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఈ-కామర్స్ @ మేడిన్ ఇండియా




- దేశీయంగా తయారీపై దృష్టి
- భారత్‌లో సొంత ప్రైవేట్ లేబుల్స్ ఉత్పత్తి
- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ దేశీ బాట

**భా**రీ దిగుమతి సుంకాల బెడద తప్పించుకునేందుకు, మేకిన్ ఇండియా నినాద ప్రయోజనాలను పొందేందుకు ఈ-కామర్స్ దిగ్గజాలు క్రమంగా భారత్‌లో తయారీపై దృష్టి పెడుతున్నాయి. ఇప్పటిదాకా సొంత బ్రాండ్స్ కోసం చైనా, మలేసియాపై ఎక్కువగా ఆధారపడుతూ వస్తున్న ఫ్లిప్‌కార్ట్ కొన్నాళ్లుగా మేడిన్ ఇండియా ఉత్పత్తుల వైపు మొగ్గుచూపుతోంది. దీంతో తమ ప్లాట్‌ఫాంపై విక్రయించే దాదాపు 300 కేటగిరీల ఉత్పత్తుల ధరలను గణనీయంగా తగ్గించగలిగామని కంపెనీ వెల్లడించింది. ''రెండేళ్ల క్రితం దాకా దాదాపు 100 శాతం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు చైనా నుంచే వచ్చేవి. ప్రస్తుతం ఇది 50 శాతాని కన్నా తక్కువకి పడిపోయింది. ఇక మా ఫర్నిచర్ బ్రాండ్‌ను ప్రవేశపెట్టినప్పుడు మొత్తం శ్రేణిని మలేసియా నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇది 50 శాతం కన్నా తక్కువే ఉంది'' అని ఫ్లిప్‌కార్ట్ ప్రైవేట్ లేబుల్ బిజినెస్ విభాగం హెడ్ ఆదర్శ్ మీనన్ చెప్పారు.

ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం మార్‌క్యూ, పర్ఫెక్ట్ హోమ్స్, బిలియన్, స్మార్ట్ బై మొదలైన ప్రైవేట్ బ్రాండ్స్‌ను విక్రయిస్తోంది. ఇవి కంపెనీ మొత్తం అమ్మకాల్లో 8 శాతం దాకా ఉంటాయి. ఎక్కువగా ఎలక్ట్రానిక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, టెక్స్‌టైల్స్, ఆండ్రాయిడ్ టీవీలు, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మెషీన్స్, చిన్న స్థాయి ఉపకరణాలు మొదలైనవాటిని దేశీయంగా సోర్సింగ్ చేస్తున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. దాదాపు 50–60 శాతం యాక్సెసరీలను కూడా భారత్ నుంచే సోర్సింగ్ చేస్తోంది. అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజాలను భారత్‌లో తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలంటూ ప్రభుత్వం ఆహ్వానిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**చిన్న వ్యాపారస్తుల నిరసనలు..**

స్మార్ట్‌ఫోన్స్ దిగుమతులపై భారీగా సుంకాల వడ్డన ఉండటంతో యాపిల్ వంటి టెక్ దిగ్గజాలు తమ ఐఫోన్స్ తదితర ఖరీదైన ఉత్పత్తులను భారత్‌లోనే తయారు చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫాక్స్‌కాన్, విస్ట్రన్ వంటి సంస్థలు వీటిని తయారు చేస్తున్నాయి. అమెజాన్ కూడా చాలా మటుకు ప్రైవేట్ లేబుల్స్‌ను భారత్‌లోనే రూపొందిస్తున్నట్లు వెల్లడించింది. ఏసీలు, మొబైల్‌ఫోన్ యాక్సెసరీలు, నిత్యావసరాలు, గృహోపకరణాలు, ఆహారోత్పత్తులు తదితర ప్రైవేట్ లేబుల్స్ అమెజాన్‌కు ఉన్నాయి. ఫ్లిప్‌కార్ట్ దాదాపు 150 ఫ్యాక్టరీల నుంచి ఉత్పత్తులు సేకరిస్తుండగా.. వీటిలో 100 ఫ్యాక్టరీలు భారత్‌కి చెందినవేనని సంస్థ ప్రైవేట్ లేబుల్ వ్యాపార విభాగం హెడ్ మీనన్ పేర్కొన్నారు. అయితే, విలువపరంగా చైనా, మలేసియాతో పోలిస్తే భారత ఉత్పత్తుల వాటా ఎంత ఉంటోందనేది మాత్రం తెలపలేదు. ఇలా సొంత ప్రైవేట్ లేబుల్స్‌ను అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు ప్రవేశపెడుతుండటాన్ని గత రెండేళ్లుగా చిన్న వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల వీటితో పోటీపడేందుకు తాము అసంబద్ధ స్థాయిలో ధరలను తగ్గించుకోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అమెజాన్ వంటి సంస్థలు సొంత ప్రైవేట్ లేబుల్స్ ఏర్పాటు చేసుకోకుండా నియంత్రిస్తూ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లో మార్చినప్పటికీ.. ఆ తర్వాత మళ్లీ వివరణనివ్వడంతో ప్రైవేట్ లేబుల్స్‌కు కొంత వెసులుబాటు లభిస్తోంది.

**చిన్న సంస్థలకు తోడ్పాటు..**

**ధ**రలపరంగానో నాణ్యతపరంగానో చాలా వ్యత్యాసాలు ఉన్న ఉత్పత్తులకు సంబంధించి మాత్రమే ప్రైవేటు లేబుల్స్‌ను ప్రవేశపెడుతున్నామని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ పేర్కొన్నాయి. మరోవైపు, వాల్‌మార్ట్‌కి చెందిన పలు ప్రైవేట్ లేబుల్స్ కూడా భారత్‌లో తయారవుతున్నాయని, ఇది తయారీ భాగస్వామ్య సంస్థలకు తోడ్పాటుగా ఉంటోందని ఫ్లిప్‌కార్ట్ పేర్కొంది. ప్రైవేట్ బ్రాండ్స్ వ్యాపారం ద్వారా ఇటు దేశీ తయారీ సంస్థలు, ఉత్పత్తిదారులు .. ముఖ్యంగా లఘు, చిన్న, మధ్య తరహా సంస్థల వృద్ధికి, నవకల్పనల ఆవిష్కరణలకు మరింత మద్దతు లభిస్తోందని ఫ్లిప్‌కార్ట్ వర్గాలు తెలిపాయి.

# ఆర్థిక లక్ష్యాలపై కేంద్రంతో చేతులు కలపండి

**రాష్ట్రాలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ:** ఆర్థిక లక్ష్యాల సాధనకు కేంద్రంతో కలిసి పనిచేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రాలకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఆర్థిక వృద్ధికి కేంద్రం ఒక దిశను నిర్దేశించుకుంటోందని పేర్కొన్నారు, అయితే ఈ లక్ష్యాలను సాధించడానికి క్షేత్ర స్థాయిలో రాష్ట్రాలూ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్రాల సహకారం లేనిదే కేంద్రం తన లక్ష్యాలను సాధించలేదని పేర్కొన్నారు. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో ఆమె బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీతారామన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాలకు కేంద్ర నుంచి నిధుల బదలాయింపు పరిమాణం ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిందని ఆమె పేర్కొన్నారు. పన్ను బదలాయింపుల విషయం చూస్తే, 13వ ఆర్థిక కమిషన్ సమయంలో 32 శాతం ఉంటే, 14వ ఫైనాన్స్ కమిషన్ సమయంలో (ఎన్‌డీఏ మొదటి ఐదు సంవత్సరాల పరిపాలనా కాలం) ఈ రేటు 42 శాతానికి చేరిందన్నారు. కేంద్రంలో కొత్తగా కొలువుతీరిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి (2019–20) పూర్తి స్థాయి బడ్జెట్‌ను జూలై 5వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వివిధ వర్గాలతో బడ్జెట్ ముందస్తు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో... పరిమిత కాలానికి ప్రభుత్వ వ్యయాలకు వీలు కల్పిస్తూ, ఫిబ్రవరి 1న కేంద్రం మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని తాజా బడ్జెట్ టీమ్‌లో ఆర్థికశాఖ సహాయమంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణ్యన్ ఉన్నారు. ఫైనాన్స్ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ నేతృత్వంలోని అధికారుల బృందంలో వ్యయ వ్యవహారాల కార్యదర్శి గిరీష్ చంద్ర ముర్మూ, రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషన్ పాండే, డీఐపీఏఎం సెక్రటరీ అతన్ చక్రవర్తి, ఫైనాన్స్ సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్‌లు ఉంటారు. 2018–19 ఆర్థిక సర్వేను జూలై 4న ఆర్థికమంత్రి ప్రవేశపెడతారు. తదుపరిరోజు 2019–20 పూర్తి బడ్జెట్‌ను పార్లమెంటు ముందు ఉంచుతారు.



# అక్రమ లాభార్జనపై 10% జరిమానా

- విద్యుత్ వాహనాలపై పన్ను తగ్గింపును తేల్చనున్న కమిటీ
- జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు
- లాటరీలపై ఒకే పన్ను అంశంలో కుదరని ఏకాభిప్రాయం




**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ వాహనాలపై, ఎలక్ట్రిక్ చార్జర్లపై పన్ను తగ్గింపు ప్రకటన జీఎస్టీ కౌన్సిల్ నుంచి వెలువడుతుందని భావించగా, నిర్ణయాన్ని ఫిట్‌మెంట్ కమిటీకి నివేదిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొలిసారి అధ్యక్షత వహరించిన జీఎస్టీ కౌన్సిల్ 35వ భేటీ శుక్రవారం ఢిల్లీలో జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రెవెన్యూ కార్యదర్శి ఏబీ పాండే తెలిపారు.

- అక్రమ లాభ నిరోధక విభాగం పదవీ కాలాన్ని 2021 నవంబర్ వరకు రెండేళ్లపాటు పొడిగింపు.
- జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కస్టమర్లకు బదలాయించకుండా అక్రమంగా లాభాలు పోగేసుకుంటే ఆ మొత్తంలో 10% జరిమానా విధింపునకు నిర్ణయం. ప్రస్తుతం ఈ జరిమానా నిబంధనల మేరకు గరిష్టంగా రూ.25,000గానే ఉంది.
- ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను ప్రస్తుతం 12 శాతం ఉండగా, దీన్ని 5 శాతానికి, ఎలక్ట్రిక్ చార్జర్లపై 18 శాతం నుంచి 12 శాతానికి పన్ను తగ్గించాలన్న ప్రతిపాదనలను ఫిట్‌మెంట్ కమిటీకి నివేదింపు.
- ఆధార్‌తో జీఎస్టీ రిజిస్ట్రేషన్‌కు అనుమతి.
- 2017–18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీఎస్టీ వార్షిక రిటర్నుల దాఖలుకు ఈ ఏడాది ఆగస్టు వరకు గడువు పొడిగింపు.
- వరుసగా రెండు నెలల పాటు జీఎస్టీ రిటర్నులు దాఖలు చేయని వారిని ఈవే బిల్లులు జారీ చేయకుండా నిషేధం విధింపు సైతం ఆగస్టు వరకు వాయిదా.
- 2020 జనవరి 1 నుంచి ప్రయోగాత్మక విధానంలో ఎలక్ట్రానిక్ ఇన్‌వాయిస్ విధానం ప్రారంభం. అప్పటి నుంచి జీఎస్టీ నమోదిత మల్టీప్లెక్స్‌లు ఈ టికెట్లనే జారీ చేయాల్సి ఉంటుంది. అలాగే, రూ.50 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న సంస్థలు ఎలక్ట్రానిక్ రూపంలోనే ఇన్‌వాయిస్‌లను జారీ చేయాలి.
- నూతన జీఎస్టీ రిటర్నుల దాఖలు వ్యవస్థ కూడా 2020 జనవరి 1 నుంచి అమల్లోకి.

**తేలని లాటరీల అంశం**

**ప్ర**స్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే లాటరీలపై 12 శాతం జీఎస్టీ, రాష్ట్రాల గుర్తింపుతో నడిచే లాటరీలపై 28 శాతం పన్ను అమల్లో ఉంది. ఒకటే దేశం ఒకటే పన్ను అన్నది జీఎస్టీ విధానం కావడంతో ఒకటే పన్నును తీసుకురావాలన్నది కేంద్రం ప్రతిపాదన. అయితే, ఇందుకు ఎనిమిది రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీ ఏకాభిప్రాయానికి రాలేకపోతోంది. దీనిపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని తీసుకోవాలని కౌన్సిల్ తాజాగా నిర్ణయించింది. దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ... ''దేశవ్యాప్తంగా ఒకటే రేటు ఉండాలన్నది జీఎస్టీ ప్రాథమిక సూత్రం. లాటరీల విషయంలో ప్రస్తుతం రెండు రేట్లు అమల్లో ఉన్నాయి. దీంతో ఆర్టికల్ 340పై స్పష్టత తీసుకోవాలని నిర్ణయించినట్టు'' చెప్పారు. రేట్లను తదుపరి తగ్గించాలన్న అంశం చర్చకు వచ్చిందా? అన్న ప్రశ్నకు.. మరింత సులభంగా మార్చడమే తమ ఉద్దేశమన్నారు. జీఎస్టీ నిబంధనలు మరింత సులభంగా మార్చడం, జీఎస్టీ రేట్ల క్రమబద్ధీకరణ, జీఎస్టీ పరిధిలోకి మరిన్ని వస్తు, సేవలను తీసుకురావడమన్నది ఆర్థిక మంత్రి అభిప్రాయంగా ఆర్థిక శాఖ తెలిపింది.

# చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తాం

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హెచ్చరిక**

- తప్పుడు సలహాలు ఇవ్వొద్దని అకౌంటింగ్ సంస్థలకు సూచన
- తప్పు చేయని వారికి సమస్యలు ఉండవని భరోసా



**న్యూఢిల్లీ:** చట్ట స్ఫూర్తిని ఉల్లంఘించొద్దని పరిశ్రమకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హితవు పలికారు. రౌండ్ ట్రిప్పింగ్ (ఒకరి నుంచి ఒకరు చేతులు మార్చుకోవడాన్ని) వంటి ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ''ఏ తప్పూ చేయని వారికి ఎటువంటి సమస్య ఉండదని నేను భరోసా ఇస్తున్నాను. కానీ, అదే సమయంలో తప్పుడు పనుల్లో పాల్గొనే వారిపై చాలా కఠిన చర్యలు తీసుకుంటాం. దేశ సంస్కృతి, మైండ్‌సెట్‌ను మార్చేస్తాం'' అని పీయూష్ గోయల్ సీఐఐ సభ్యులతో సమావేశం సందర్భంగా స్పష్టం చేశారు. న్యాయవాదులు, అంతర్జాతీయంగా నాలుగు అతిపెద్ద ట్యాక్స్ కన్సల్టెన్సీ సంస్థలు (పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, ఈఅండ్‌వై) ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించొద్దని సూచించారు. భారత చట్ట స్ఫూర్తికి విరుద్ధమైన సలహాలు ఇవ్వొద్దని పరోక్షంగా హెచ్చరించారు. బహుళ బ్రాండ్ల ఉత్పత్తుల రిటైల్ విభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) చట్టాన్ని కంపెనీలు గౌరవించాలని, లొసుగుల ద్వారా దీన్నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించొద్దని హితవు పలికారు.

**చట్టానికి అనుగుణంగా...**

''మల్టీ బ్రాండ్ రిటైల్‌లో 51 శాతం వరకు ఎఫ్‌డీఐని అనుమతించే విధానం అమల్లో ఉంది. దీనికి కట్టుబడి ఉన్నాం. ప్రతీ ఒక్కరూ దీన్ని అనుసరించాలి, గౌరవించాలి. చట్టానికి అనుగుణంగా ఉన్నంత వరకు సమస్య ఏమీ ఉండదు'' అని మంత్రి పేర్కొన్నారు. చట్టానికి అనుగుణంగా నడుచుకోండి. రౌండ్ ట్రిప్పింగ్‌ను చట్టం చాలా తీవ్రంగా పరిగణిస్తుంది. మీలో ఎవరైనా అది చేసుంటే అంగీకరించి ప్రక్షాళన చేసుకుని, ఆ అధ్యాయానికి ముగింపు పలకండి'' అని మంత్రి సూచించారు. దొడ్డిదారిన వచ్చిన వారు బయటపడే మార్గం కోసం కామా, ఫుల్‌స్టాప్‌లను వెతకొద్దన్నారు. ఆసియాన్ దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్యం ఒప్పందాలకు సంబంధించిన అంశాలపై గోయల్ స్పందిస్తూ... చట్టంలో కొన్ని నిబంధనలు భారంగా ఉన్నాయని, వాటిని సభ్యదేశాల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు.

**ఎగుమతిదారులకు విదేశీ మారక రుణాలు**

**ఎ**గుమతిదారులకు విదేశీ మారక రూపంలో రుణాలను సమకూర్చే విషయంలో బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఖజానాపై పెద్దగా భారం పడకుండా, ఖరీదైన రుణ సమస్యను పరిష్కరించే మార్గాలున్నాయని చెప్పారు. వాణిజ్యానికి సంబంధించి ఏ అంశానికైనా సబ్సిడీలన్నవి పరిష్కారం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా విదేశీ కరెన్సీ రుణాలు సమకూర్చనున్నామని, బ్యాంకులతో ఇప్పటికే సంప్రదింపులు మొదలు పెట్టినట్టు చెప్పారు. ఈ విషయంలో ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (ఈసీజీసీ) కీలక పాత్ర పోషించాలన్నారు. రాష్ట్రాల పన్నులను ఎగుమతిదారులకు తిరిగి చెల్లించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 50 బిలియన్ డాలర్ల ఎగుమతులకు అవకాశాలున్నాయని వాణిజ్య శాఖ మదింపు వేసినట్టు చెప్పారు.

# ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపునివ్వాలి

- స్లాట్స్‌పై హామీ కావాలి
- జెట్ టేకోవర్‌కు ఎతిహాద్ డిమాండ్లు







**ముంబై:** రుణ సంక్షోభంతో మూతబడిన జెట్ ఎయిర్‌వేస్‌ను టేకోవర్ చేయాలంటే ఓపెన్ ఆఫర్ నుంచి మినహాయింపునివ్వాలని, ఎయిర్‌పోర్టులలో స్లాట్స్‌పై హామీ ఇవ్వాలని ఎతిహాద్ ఎయిర్‌వేస్ డిమాండ్ చేస్తున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ వెల్లడించింది. అయితే, ఆయా మినహాయింపులపై హామీ ఇచ్చేందుకు తమకు అధికారాలేమీ లేవని పేర్కొంది. జెట్ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉన్న నేపథ్యంలో గతేడాది కాలంగా సముచిత పరిష్కార మార్గం కోసం రుణదాతలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని ఎస్‌బీఐ శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ఇందుకోసం సలహాదారులుగా ఎస్‌బీఐక్యాప్స్, మెకిన్సే వంటి పేరొందిన కన్సల్టెంట్లను కూడా నియమించుకున్నట్లు వివరించింది. అటుపైన కొత్త ఇన్వెస్టర్లను తీసుకొచ్చేందుకు బిడ్స్ ఆహ్వానించగా.. ఎతిహాద్, ఎన్ఐఐఎఫ్, టీపీజీ క్యాపిటల్, ఇండిగో పార్ట్‌నర్స్ మొదలైనవి ఆసక్తి వ్యక్తీకరించినప్పటికీ.. బైండింగ్ బిడ్స్ రాలేదు. చివరికి ఇద్దరు రుణదాతలు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)ని ఆశ్రయించడంతో తాము కూడా అదే బాటలో ముందుకెడుతున్నట్లు ఎస్‌బీఐ పేర్కొంది. ఏప్రిల్ 17న కార్యకలాపాలు నిలిపివేసిన జెట్ ఎయిర్‌వేస్.. బ్యాంకులకు దాదాపు రూ. 8,500 కోట్లు, ఉద్యోగులకు రూ. 3,000 కోట్లు, వెండార్లకు దాదాపు రూ. 10,000 కోట్లు బాకీ పడిన సంగతి తెలిసిందే.

**షేరు జూమ్..**

జెట్ ఎయిర్‌వేస్ షేర్లలో ర్యాలీ కొనసాగుతోంది. షేరు శుక్రవారం మరో 15.5 శాతం పెరిగింది. బీఎస్ఈలో రూ. 39.10–రూ. 79.75 మధ్య తిరుగాడిన షేరు చివరికి 13 శాతం లాభంతో రూ. 72.45 వద్ద క్లోజయ్యింది. అటు ఎన్ఎస్ఈలో 15.51 శాతం పెరిగి రూ. 72.60 వద్ద ముగిసింది.

# రవాణా.. రయ్‌రయ్!

- 15 లాజిస్టిక్ సంస్థలతో షిప్‌రాకెట్ ఒప్పందం
- 1.5 లక్షల మంది విక్రయదారుల నమోదు
- ఏటా 10 లక్షల డెలివరీ; రూ.348 కోట్ల జీఎంవీ
- త్వరలోనే పోస్టల్ విభాగంతో ఒప్పందం
- 'స్టార్టప్ డైరీ'తో కో–ఫౌండర్ సాహిల్ గోయల్

Shiprocket



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:**




**రి**టైలర్, హోల్‌సేలర్ అనే తేడా లేదు ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లోకి విస్తరించాలని భావిస్తున్నారు. మెట్రో నగరాల్లో అయితే ఓకే.. ఎందుకంటే అందుబాటులో లాజిస్టిక్ కంపెనీ సేవలుంటాయి కాబట్టి! మరి, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారస్తులు ఈ–కామర్స్‌లోకి ఎంట్రీ ఇస్తే.. ఉత్పత్తుల పికప్, డెలివరీ ఎవరు చేయాలి? పోనీ, కొరియర్ సంస్థలేమైనా చేస్తాయా అంటే ఆర్డర్లు బల్క్‌లో ఉంటే తప్ప దగ్గరికి రావు. ఇదీ ఇప్పటివరకు గ్రామీణ వ్యాపారస్తుల సమస్య. దీనికి పరిష్కారం చూపిస్తోంది షిప్‌రాకెట్. చిన్న, పెద్ద ఆర్డర్ అనే తేడా లేకుండా ప్రతి ఒక్కటీ డెలివరీ చేయడమే దీని ప్రత్యేకత. మరిన్ని వివరాలు షిప్‌రాకెట్ కో–ఫౌండర్ సాహిల్ గోయల్ మాటల్లోనే..

**15 సంస్థలతో ఒప్పందం..**

ప్రస్తుతం అరామెక్స్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, బ్లూడార్ట్, డెల్హివరీ, గటీ, ఫెడెక్స్, డీహెచ్‌ఎల్, ప్రొఫెషనల్ వంటి 15కి పైగా కొరియర్ సంస్థలతో ఒప్పందం ఉంది. దేశంలోని 26 వేల పిన్‌కోడ్స్‌లో, 220 దేశాల్లో డెలివరీ సేవలందిస్తున్నాం. ప్రస్తుతం షిప్‌రాకెట్‌లో 1.5 లక్షల మంది విక్రయదారులు నమోదయ్యారు. ప్రతి ఉత్పత్తి మీద అమ్మకందారు నుంచి కమీషన్ ఉంటుంది. డొమెస్టిక్ షిప్పింగ్ చార్జీలు 500 గ్రాములకు ప్రారంభ ధర రూ.27, ఇంటర్నేషనల్‌లో రూ.110గా ఉంది.

**10 లక్షల డెలివరీలు; రూ.348 కోట్ల జీఎంవీ..**

గతేడాది మా ఒప్పంద లాజిస్టిక్ సంస్థలకు రూ.348 కోట్ల (50 మిలియన్ డాలర్లు) గ్రాస్ మర్చండేజ్ వ్యాల్యూ (జీఎంవీ) వ్యాపారాన్ని చేసిచ్చాం. ఈ ఏడాది 800 మిలియన్ డాలర్ల జీఎంవీని లక్ష్యించాం. ప్రస్తుతం ఏడాదికి 10 లక్షల ఆర్డర్లను డెలివరీ చేస్తున్నాం. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వాటా 20 శాతం వరకుంటుంది. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి ఎక్కువ వ్యాపారం ఉంటుంది. 2020 నాటికి ఏటా 30 లక్షల డెలివరీలను లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి నెలా ఆదాయం 15 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నాం.

**సొంతంగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్**

**రి**మోట్ ప్రాంతాల్లోనూ డెలివరీ సేవలందించేందుకు భారత తపాలా శాఖతో ఒప్పందం చేసుకోనున్నాం. దీని తర్వాత సొంతంగా ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాం. రెండేళ్లలో ఆయా సేవలు అందుబాటులోకి వస్తాయి. 2020 నాటికి ఆఫ్రికా, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లోకి విస్తరించాలని లక్ష్యించాం. ఇప్పటి వరకు 14 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాం. బెర్టెల్స్‌మన్ ఇండియా ఇన్వెస్ట్‌మెంట్స్, నిర్వాణా డిజిటల్ ఇండియా, బీనెక్స్ట్ సంస్థలు ఈ పెట్టుబడులు పెట్టాయని గోయల్ తెలిపారు.

అద్భుతమైన స్టార్టప్‌ల గురించి అందరికీ తెలియజేయాలనుకుంటే startups@sakshi.com కు మెయిల్ చేయండి...

# ఐదేళ్లు దాటితే బదిలీ కావాల్సిందే!

**దేవాలయ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు సిద్ధం**

- ఇక ఒకేచోట పాతుకుపోయే విధానానికి చెల్లు
- కోర్టు ఆదేశం మేరకు విధివిధానాలు ఖరారు
- ఉత్తర్వు జారీ చేసిన దేవాదాయ శాఖ

**సాక్షి, హైదరాబాద్:** దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఇక ఐదేళ్లు దాటితే బదిలీ కావాల్సిందే. ఈమేరకు ప్రభుత్వం బదిలీ మార్గదర్శకాలు సిద్ధం చేసింది. ఓ పద్ధతంటూ లేకుండా ఇంత కాలం దేవాదాయశాఖ ఉద్యోగుల్లో ఇష్టారాజ్యం కొనసాగింది. ఆదాయం ఎక్కువగా ఉండి తమకు అనుకూలంగా ఉన్న దేవాలయాల్లో ఏళ్లతరబడి కొనసాగడం, నచ్చని దేవాలయాల్లో ఎక్కువ కాలం పనిచేయకుండా ఆదాయం ఎక్కువగా ఉండే వేరే దేవాలయానికి బదిలీ చేసుకోవటం పరిపాటిగా మారింది. ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు లేకపోవటంతో కొందరు ఉన్నతాధికారులు సైతం వీరికి వంతపాడారు. ఇంతకాలానికి దేవాదాయశాఖ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు తాజాగా దేవాదాయశాఖ ఉత్తర్వు జారీ చేసింది. ఇక నుంచి దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఐదేళ్లకు మించి ఒకే చోట పనిచేసేందుకు వీలు లేదు. ఐదేళ్ల సర్వీసు పూర్తి కాగానే వేరే దేవాలయానికి బదిలీ కావాల్సిందే.

**13 ఏళ్ల తర్వాత ఖరారు...**

ఆదినుంచీ దేవాదాయ శాఖలో బదిలీలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు లేవు. దీంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఇది అవినీతి పెచ్చుమీరటానికి కారణమైంది. 2006లో నాటి దేవాదాయశాఖ మంత్రి దీనిపై సమీక్షించి ఉద్యోగులను ఆలయాల మధ్య బదిలీకి అవకాశం కల్పించారు. దీంతో కొన్ని బదిలీలు చేశారు. దీనిపై కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మార్గదర్శకాలు లేకుండా బదిలీలు చేపట్టే విషయాన్ని కోర్టు కూడా ప్రశ్నిస్తూ నాటి బదిలీలపై స్టే విధించింది. దీంతో మార్గదర్శకాలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించినా అది అమలు కాలేదు. తాజాగా దీనిపై దేవాదాయ శాఖ దృష్టిసారించి రెండు నెలల క్రితం మార్గదర్శకాలపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పుడు తుది నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఉత్తర్వు జారీ చేసింది.




**కమిటీ ఉండాలి...**

బదిలీల అధికారం విషయాన్ని కూడా ఇందులో పొందుపరిచారు. 6–సి కేడర్ ఆలయాలకు సంబంధించి ఆ ప్రాంత సహాయ కమిషనర్, 6–బి కేడర్‌కు సంబంధించి ఉప కమిషనర్, 6–ఏ అయితే రీజినల్ జాయింట్ కమిషనర్, పెద్ద దేవాలయాలైతే కమిషనర్‌ను బదిలీ అధికారిగా పేర్కొన్నారు. వారు మాత్రమే బదిలీ చేసేందుకు అర్హులు. ఇందుకోసం ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తానికి సంబంధించి ఓ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కమిటీ ఆదేశం, సూచనల ప్రకారం బదిలీ ప్రక్రియ కొనసాగాలి. అయితే... ప్రత్యేకావసరాలు, ఫిర్యాదుల ఆధారంగా కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా కమిషనర్ ఏ ఉద్యోగినైనా, ఎప్పుడైనా బదిలీ చేసే వెసులుబాటు కల్పించారు. ఐదేళ్లు పూర్తయి బదిలీ అయిన తర్వాత మళ్లీ రెండేళ్లలో వారిని తిరిగి బదిలీ చేయటానికి వీల్లేదు. పదవీ విరమణకు ఏడాది ముందు కూడా బదిలీపై నిషేధం ఉంటుంది. ఉద్యోగులు ఇలా బదిలీలపై ఎన్ని దేవాలయాలకు మారినా... వారి పదోన్నతులు మాత్రం నియామకం పొందిన ఆలయం కేడర్ స్ట్రెంథ్ ఆధారంగానే జరపాల్సి ఉంటుంది. ఈ బదిలీలు ఆ కేడర్‌కు సంబంధించి 20 శాతాన్ని మించకుండా ఉండాలనే నిబంధన విధించారు.

- దేవరకొండ మండలంలోని పత్లావతు తండా సర్పంచ్‌పై దాడికి పాల్పడిన వారిమీద ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కేసులు నమోదు చేసి శిక్షించాలని తెలంగాణ గిరిజన సమాఖ్య డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్‌లకు పిటిషన్ ఇచ్చినట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ తెలిపారు. బృందంలో సర్పంచ్ రాజ్‌కుమార్, బద్ది, ధర్మ, నరేశ్, గోపీ, రమేష్ ఉన్నారు.






## గణాంక ఉద్యోగుల సంఘం

## అధ్యక్షుడిగా జూపల్లి

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జూపల్లి రాజేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లో ఉప సంచాలకుడు బి. రాజయ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమానికి గణాంక ఉద్యోగులు హాజరై, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గణాంక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కె. కోటేశ్వరరావు, కోశాధికారిగా విజయ కుమార్, కార్యదర్శిగా పి. కృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగ మల్లేశ్వరావు తదితర కార్యవర్గాన్ని సంఘం నాయకులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జూపల్లి రాజేందర్ మాట్లాడుతూ గణాంక ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఉద్యోగులకు రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.









# సాయిసింధు ఫౌండేషన్‌కు భూకేటాయింపుపై పిల్

**ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం**

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో రూ.500 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని సాయిసింధు ఫౌండేషన్‌కు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఫౌండేషన్‌కు భూమిని కేటాయిస్తూ 2018 మార్చి 22న జారీ చేసిన జీవో 59, ఆగస్టులో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌లను రద్దు చేయాలని హైదరాబాద్‌కు చెందిన ఉర్మిళా పింగ్లేతోపాటు పలువురు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిని శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు మరో నాలుగు వారాల సమయం కావాలని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ ధర్మాసనాన్ని కోరారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే నాలుగు వారాల సమయం తీసుకుని కౌంటర్ దాఖలు చేయలేదని, పైగా ఆ ప్రదేశంలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ భూకేటాయింపులు చట్ట వ్యతిరేకమని తేలితే నిర్మాణాల్ని కూల్చివేసేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయవచ్చని పేర్కొంది. కౌంటర్ దాఖలుకు 2 వారాల గడువు ఇస్తున్నట్లు ప్రకటించింది.

## యోగాను పాఠ్యాంశాల్లో భాగం చేయాలి

**ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించడానికి, అసంక్రమిత వ్యాధుల పెరుగుదలను ఎదుర్కొనేందుకు విద్యార్థులకు యోగాను పాఠ్యాంశంగా బోధించాలని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయ, ఆయుష్ మంత్రాలయం సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో వెంకయ్య నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాచీన భారతీయ యోగాభ్యాసం శారీరక దృఢత్వం కోసమే కాదని, మానసిక సమతుల్యతను, క్రమశిక్షణను కూడా పెంపొందిస్తుందన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఆర్కేపురం సెక్టార్–4లోని కమ్యూనిటీ సెంటర్‌లో జరిగిన యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు బండి సంజయ్, సోయం బాపురావు పాల్గొన్నారు.






Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792